అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 31-03-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 89 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మంచి రోజులొచ్చాయి

పండుగనాడే కాదు.. పేదలు ప్రతిరోజూ సన్న బియ్యం తినాలి



హుజూర్‌నగర్‌కు వ్యవసాయ కళాశాల : సీఎం రేవంత్‌రెడ్డి

అది కాళేశ్వరం కాదు..కూలేశ్వరమంటూ విమర్శ

హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన ముఖ్యమంత్రి

సన్నబియ్యం పంపిణీ అద్భుత కార్యక్రమం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

పేదవాడు పండుగనాడు మాత్రమే కాకుండా ప్రతిరోజు తెల్లబువ్వ తినాలన్న సంకల్పంతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఉగాది పండుగ రోజున సన్నబియ్యం పంపిణీని ప్రారంభించడం సంతోషంగా ఉందని, శ్రీమంతులు లాగానే పేదలకూ సన్నబియ్యం తినే రోజులు వచ్చాయన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన ప్రగతిబాట' సభకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి హాజరై సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది అషామాషీ కార్యక్రమం కాదని, ప్రభుత్వాలు మారినా సన్నబియ్యం పంపిణీ ఎప్పటికీ కొనసాగుతుందని స్పష్టం చేశారు. పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మల్లు స్వరాజ్యం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన గడ్డ నల్లగొండ అని, క్రిష్టపట్టి ప్రాంతం చైతన్యానికి మారు పేరన్నారు. హుజూర్ నగర్, కోదాడ కాంగ్రెస్‌కు కంచుకోట అని ఎన్నికల్లో కార్యకర్తలు నిరూపించారన్నారు. కాంగ్రెస్ ఎంపీ రావి నారాయణరెడ్డిని దక్షిణ దేశంలోనే అత్యంత మెజార్టీతో గెలిపించిన గడ్డ నల్లగొండని గుర్తుచేశారు. తెలంగాణలో 25 లక్షల ఎకరాల భూములను ఇందిరాగాంధీ పేదలకు పంచి పెట్టారన్నారు. పేదలకు బియ్యం ఇచ్చేందుకు 1957లోనే రేషన్‌కార్డు దుకాణాలు కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని గుర్తుచేశారు. రూ.1.90కే కిలో బియ్యం ఇవ్వాలని మొదట కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి భావించారని, కానీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో రూ.2 కిలో బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం ఇచ్చేందుకు పూనుకున్నదని తెలిపారు. నల్లగొండ జిల్లాలో 12 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మిల్లర్ల దగ్గర రూ.21 వేల కోట్ల విలువైన వడ్లను దాచి పెట్టిందన్నారు. రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం ఇస్తే ఆ బియ్యాన్ని రూ.10 లకు మిల్లర్లు కొని రూ.30 లకు ప్రభుత్వానికి అమ్ముతున్నారని ఆరోపించారు. దొడ్డు బియ్యం పేదవాడు తింటలేడని, దళారుల దోపిడీకి గురవుతున్నాయని అన్నారు. ప్రతి పేదవాడికి ఆరు కిలోల సన్నబియ్యం ఇవ్వాలని మంత్రి వర్గ సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. గత సీఎం మాత్రం వరి వేస్తే ఉరేనని రైతులను భయపట్టారని అన్నారు. 'వరి వేయొద్దు.. వడ్లు కొనమ'ని బెదిరించారని తెలిపారు. రాష్ట్రంలో 3.10కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తామన్నారు.

కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం

గత ప్రభుత్వ హయాంలో పడావు పెట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికీ గత బడ్జెట్‌లోనే రూ.24 వేల కోట్లు కేటాయించి పనులు చేపట్టినట్టు సీఎం తెలిపారు. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే మూడేండ్లలోనే కూలిపోయిందని తెలిపారు. ప్రపంచంలోనే ఏడో వింత అని చెప్పుకున్న కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. అలాగే, గడిచిన పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం పక్కకు పెట్టిన ఎస్ఎల్బీసీ టన్నెల్‌ను తిరిగి చేపట్టామని తెలిపారు. ఏడాదికొక కిలోమీటర్ తవ్వినా పదేండ్లలో పూర్తయ్యేదని, కానీ నల్లగొండ జిల్లాపై పగతోనే ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టారని అన్నారు. ఎస్ఎల్బీసీ పూర్తయితే.. జిల్లాలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది 1.56 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ...13లో

మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు?

గవర్నర్‌తో రేవంత్‌రెడ్డి సుదీర్ఘ మంతనాలు 3లో..

రాష్ట్ర బడ్జెట్ షడ్రుచుల సమ్మిళితం

భట్టి, నేను జోడెద్దుల్లా పని చేస్తున్నాం

అన్నింటికీ బడ్జెట్ లో కేటాయింపులు : ఉగాది వేడుకలలో సీఎం రేవంత్ రెడ్డి 6లో..



సన్నగిల్లుతున్న సజీవ ఆశలు

మయన్మార్ భూ ప్రళయం తర్వాత మృతదేహాల దుర్గంధం

శిధిలాల కింద చిక్కుకున్న వారి పరిస్థితిపై ఆందోళన


1700 దాటిన మృతుల సంఖ్య..అనధికారికంగా ఎక్కువే

నెపిడా: మయన్మార్‌లో భూకంప విలయంలో మరణించిన వారి సంఖ్య 1700 దాటింది. అయితే అనధికారికంగా మరింత ఎక్కువే ఉండోచ్చని అక్కడి జనం అంటున్నారు. ఇక వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. అయితే వారు బతికే ఉన్నారా..లేదా అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అధికారయంత్రాంగం చర్యలు తీసుకునేలోపు.. తమవంతు ప్రయత్నంలా..కుటుంబసభ్యులు చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇంకా అనేక ప్రాంతాలకు సహాయక బృందాలు చేరలేదని సమాచారం. దీంతో మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని అంచనా. మరోవైపు.. మృతదేహాల దుర్గంధం మొత్తం వ్యాపిస్తున్నట్టు సమాచారం.



రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకాలు

మయన్మార్‌లో 7.7 తీవ్రతతో వచ్చిన భూకంపం అనేక నగరాలపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా మాండలేలో భారీ భవనాలు, ఆధ్యాత్మిక, పర్యటక ప్రదేశాలతోపాటు అనేక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వంతెనలు కూలిపోవడం, రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్న కారణంగా రెస్క్యూ ఆపరేషన్‌కు ...13లో



పారదర్శక దర్యాప్తు అవసరం

ఇది జస్టిస్ యశ్వంత్ వర్మ విషయం మాత్రమే కాదు

ఇతర న్యాయమూర్తుల భవిష్యత్తునూ నిర్ణయిస్తుంది

ఆరోపణల ఆధారంగా తీసుకునే చర్యలతో వారికి ఇబ్బందులు : విశ్లేషకులు

న్యూఢిల్లీ : తన అధికారిక నివాసంలో నోట్ల కట్టలు బయటపడిన విషయంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై అంతర్గగత విచారణకు ఆదేశించిన విషయం విదితమే. దీంతో భారత న్యాయవ్యవస్థ ప్రజాభిప్రాయ న్యాయస్థానంలో దాని స్వతంత్రత, సమగ్రత విషయంలో పరీక్షను ఎదుర్కోనున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. తన ఇంట్లో కాలిన స్థితిలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్టు తెలిపుతున్న వీడియోలు, ఫోటోలు ఇప్పటికే వైరల్‌గా మారిన విషయం విదితమే. అయితే, ఈ వాస్తవికతను చట్టపరమైన చర్యలు పరీక్షించనున్నాయి. ఈ చర్యలకు ముందే.. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వీడియోలు, ఫోటోలు వంటి ఆధారాలు బయటపడటం న్యాయస్థాన ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నపుడు ఏవైనా సాక్ష్యాలను బహిర్గతం చేయటాన్ని సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కూడా వ్యతిరేకిస్తుందని చెప్తున్నారు. వాస్తవానికి, దర్యాప్తు సంస్థలు కీలకమైన సాక్ష్యాలను జర్నలిస్టులకు లీక్ చేసే సంస్కృతిని కోర్టులు గతంలో ఖండించాయి. న్యాయమూర్తి కేసులో ఇది లోపించిందని గుర్తు చేస్తున్నారు. సదరు న్యాయమూర్తి ఇంటిలో చెప్పబడుతున్నటువంటి నగదుకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ప్రజాబాహుళ్యంలోకి రావటాన్ని వారు గుర్తు చేస్తున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు ఆరోపణలు ఎదుర్కొంటున్నపుడు వ్యవస్థ తమకు న్యాయం చేస్తుందన్న ...13లో

దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ఉండాలి

ప్రతిఘటన, సంఘీభావానికి ఉగాది స్ఫూర్తినివ్వాలి : తమిళనాడు సీఎం స్టాలిన్ ఆకాంక్ష



చెన్నై : దక్షిణాది రాష్ట్రాలు ఐకమత్యంతో వ్యవహరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఉగాది పండుగ సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఘటన, సంఘీభావం వంటి విషయాలలో ఉగాది పండుగ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. 'తెలుగు, కన్నడ మాట్లాడే ద్రావిడ సోదర సోదరీమణులకు ఉగాది శుభాకాంక్షలు. ఎన్నో ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం చెబుదాం. వేడుకలు జరుపుకుందాం' అని స్టాలిన్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. హిందీని రుద్దడం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వంటి భాషాపరమైన, రాజకీయ ప్రమాదాలు ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య మున్నెన్నడూ లేనంతగా ఐకమత్యం నెలకొనాల్సిన అవసరం ఉన్నదని స్టాలిన్ అన్నారు. 'మన హక్కులు, గుర్తింపును అణచివేసేందుకు చేసే ప్రయత్నాలను కలసికట్టుగా ఎదుర్కొని తిప్పికొట్టాల్సి ఉంది. ఈ ఉగాది పండుగ మనలో ప్రతిఘటన, సంఘీభావ స్ఫూర్తిని నింపి మనలను ఏకం చేస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. హిందీని బలవంతంగా రుద్దడం, పునర్విభజన ద్వారా రాజకీయ సరిహద్దులను మార్చడం వంటి అంశాలు ప్రాంతీయ గుర్తింపునకు, హక్కులకు ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు.



పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

ఒకరు మృతి... 8 మందికి గాయాలు

13లో

అణు ఒప్పందంపై ప్రత్యక్ష చర్చలకు తిరస్కరణ

ట్రంప్ లేఖకు ఇరాన్ ప్రతిస్పందన

ఒప్పందం కుదుర్చుకోకపోతే.. బాంబు దాడులే : అమెరికా అధ్యక్షుడు



టెహ్రాన్: అణు ఒప్పందంపై అగ్రరాజ్యంతో ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్టు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ వెల్లడించారు. దీంతో ట్రంప్ లేఖపై టెహ్రాన్ ఏలా స్పందిస్తుందన్న దానిపై అధికారికంగా ...13లో

మస్క్‌కు తప్పని తిప్పలు

టెస్లా టార్గెట్‌గా నిరసనకారుల పోరాటాలు

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఆందోళనలు



వాషింగ్టన్ : ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్‌కు కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. అయనకు చెందిన 'టెస్లా' టార్గెట్‌గా నిరసనకారులు పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధికారం చేపట్టిన తర్వాత దుబారా ఖర్చులను తగ్గించటంలో భాగంగా ప్రభుత్వ సామర్థ్య విభాగం డోజ్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. దీనికి ఎలన్ మస్క్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికాలో ప్రక్షాళన పేరుతో తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. అయితే, ఇలాంటి చర్యలపై తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పలువురు నిరసనకారులు అమెరికా అంతటా, యూరప్‌లోని కొన్ని నగరాల్లో టెస్లా డీలర్‌షిప్‌ల వెలుపల గుమిగూడారు. డీలర్‌షిప్‌లు, వాహనాలను లక్ష్యంగా చేసుకుని నిరసనకారులు ఉద్యమాన్ని తీవ్రతరం చేయటానికి ప్రయత్నిస్తున్నారు. 340 యూఎస్ బిలియన్ డాలర్ల మస్క్ సంపదలో అతిపెద్ద భాగం ఎలక్ట్రిక్ వాహన కంపెనీలో ఆయన స్టాక్. ఇటీవల ఇటువంటి ఆందోళనలతో కంపెనీ అమ్మకాలలో క్షీణత నమోదైంది. తాజాగా అమెరికాలోని 277 ఆటోమేకర్ షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లను చుట్టుముట్టటానికి నిరసకారులు ప్రయత్నాలు చేశారు. న్యూజెర్సీ, మసాచుసెట్స్, కనెక్టికట్, న్యూయార్క్, మేరీల్యాండ్, మిన్నెసోటా, వాహన తాయిదారుల స్వస్థలమైన టెక్సాస్‌లోని టెస్లా స్థానాలకు వందలాది మంది నిరసనకారులు తరలివచ్చారు. ఎలన్ మస్క్‌కు ...13లో

క్లెయిమ్స్ పరిష్కారంలో కార్మిక శాఖ తాత్సారం

రెండేండ్లలో 607 కేసులకు పరిష్కరించింది 26 మాత్రమే

గ్రాట్యూటీ చెల్లింపుల కేసుల్లోనూ ఇదే తంతు

డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకం అమలూ అంతంతే

కనీస వేతనాలు...ఉద్యోగ భద్రత కల్పించడం..సంక్షేమం..పని గంటల అమలు తీరు పర్యవేక్షణ ద్వారా కార్మికులకు మేలు జరిగేలా చూడటమే కార్మిక శాఖ ప్రధాన ఉద్దేశం. పారిశ్రామిక ప్రాంతాల్లో లాకౌట్‌లు, సమ్మెలను నివారించడానికి కార్మిక సంఘాలకు, పరిశ్రమల యాజమాన్యాలకు మధ్యవర్తిత్వం వహించి నివారిస్తున్నది. పరిశ్రమల్లో ఉత్పత్తి ఆగి యాజమాన్యాలకు నష్టం చేకూరకుండా చూసే పాత్రను కార్మిక శాఖ చక్కగా పోషిస్తున్నది.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2024-25లో పారిశ్రామిక వివాదాలు కార్మిక శాఖ వద్దకు 375 రాగా...అందులో 350 పరిష్కరించింది. ఈ ఏడాది రాష్ట్రంలో కార్మిక శాఖ 1280 పరిశ్రమల్లో క్రమం తప్పకుండా చేపట్టిన తనిఖీల్లో యజమానులందరూ కార్మికుల హక్కులను ఎక్కడ కూడా కాలరాయడం లేదని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ బుక్కుల్లో గొప్పగా ప్రకటించింది. బొమ్మాబొరుసుండే నాణంలో ఇది యాజమాన్య కోణంలోనిది మాత్రమే. అదే కార్మికుల కోణంలో చూస్తే అడుగడుగునా పరిశ్రమల్లో అడుగడుగునా హక్కులు ఉల్లఘించబడుతున్నాయి. కనీస వేతనాలు ఎక్కడ కూడా అమలు కావడం లేదు. కార్మికులతో గొడ్డుచాకిరీ చేయించుకుంటూ అరకొర వేతనాలను కూడా ఇవ్వని పరిశ్రమలు రాష్ట్రంలో కోకొల్లలుగా ఉన్నాయి.

కార్మిక శాఖకు ఫిర్యాదు చేస్తే ఈ చిరుద్యోగం కూడా ఎక్కడ పోతుందో అన్న భయంతో ఫిర్యాదు చేయడానికి కూడా కార్మికులు వెనుకాడుతారు.కొంత చైతన్యముం డో...ఆ కంపెనీ తనకు తీవ్ర అన్యాయం చేసిందనే బాధతో కొందరు కార్మికులు కార్మిక శాఖ గడప



తొక్కుతున్నారు. ఆ కార్మికులకు సంబంధించిన క్లెయిమ్స్‌ను పరిష్కరించడంలో మాత్రం కార్మిక శాఖ తీవ్ర తాత్సారం చూపిస్తున్నది. కనీస వేతనాల కోసం కార్మికుల క్లెయిమ్స్ పరిష్కారంలోనూ, ఆలస్యమైన వేతనాలు ఇప్పించడంలోనూ, ప్రమాదాలకు నష్టపరిహారాలు చెల్లించడంలోనూ, తొలగింపునకు గురైన ఉద్యోగుల అప్పీళ్లను ...13లో

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఇంటిల్లి పాది సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకిక వాదానికీ, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అనీ, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనీ, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

కులూలో గాలుల బీభత్సం

- ఆరుగురు దుర్మరణం
- నేలకూలిన వృక్షాలు...దెబ్బతిన్న వాహనాలు



సిమ్లా : ప్రముఖ పర్యాటక కేంద్రమైన కులూలోని మణికరణ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం బలమైన గాలులు బీభత్సం సృష్టించాయి. ఆరుగురు ప్రాణాలు కోల్పోగా అనేక వృక్షాలు నేలకూలాయి. పలువురు గాయాలపాలయ్యారు. పర్వతం పక్కన నిలిపి ఉన్న వాహనాల పైన, అక్కడ ఉన్న ఫుడ్ స్టాల్స్ పైన చెట్లు పడిపోవడంతో అవి దెబ్బతిన్నాయి. ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. మణికిరణ్‌లోని సాహిబ్ గురుద్వార్ సమీపంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రాంతం కులూకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. హిమాచల్ ప్రదేశ్‌లోని నాలుగు జిల్లాలలో ఉరుములు, మెరుపులతో బలమైన గాలులు వీస్తాయని వస్తాయని వాతావరణ విభాగం ఈ వారం ప్రారంభంలోనే హెచ్చరికలు జారీ చేసింది.

తప్పు తెలుసుకున్నా.. నాకు మరో అవకాశం ఇవ్వండి

- ఇకపై బాధ్యతగా నడుచుకుంటా : యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా



ముంబయి: 'ఇండియాస్ గాట్ లాటెంట్' వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు.. ఎన్నో విమర్శలను, కేసులను ఎదుర్కొన్న అనంతరం రణవీర్ మొదటిసారి మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వీడియోను షేర్ చేశారు. అందులో తాను మళ్లీ కొత్త జీవితం ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. కష్టసమయంలో తనకు, తన కుటుంబానికి మద్దతుగా నిలిచిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై మరింత బాధ్యతాయుతంగా మసులుకుంటానని అన్నారు.

"అభిమానులకు దూరమైన ఈ కొద్ది రోజుల్లో ఓపికగా ఉండడం ఎలాగో జీవితం నేర్పించింది. ఇకపై నేను రాసే కంటెంట్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుంటాను. నేను ఎదుర్కొన్న ఈ దశను శిక్షగా కాకుండా.. సమాజంలో మనం ఎలా బతకాలో నేర్పించే పాఠంగా తీసుకుంటాను. మా పాడ్‌కాస్ట్ నాణ్యతను మరింత మెరుగుపరుచుకుంటాము. నాకు మరో అవకాశం ఇవ్వండి. దేశంలో ప్రతి ఒక్కరు నన్ను వారి కుటుంబంలో ఓ సభ్యునిగా చూస్తారు. వారందరినీ నేనెప్పటికీ గౌరవిస్తాను. అభిమానులకు ధన్యవాదాలు" అని రణవీర్ పేర్కొన్నారు.

ఇటీవల ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా అతని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించి వివాదాల్లో చిక్కుకున్నాడు. ఆయన వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు, ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. మహారాష్ట్ర సైబర్ విభాగం ఈ షో సభ్యులపై కేసు నమోదు చేసింది. దీంతో రణవీర్ క్షమాపణలు చెప్పాడు. ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు యూట్యూబర్‌కు చురకలు అంటించింది. భావప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని, అసభ్య పదజాలం వాడటం హాస్యం కాదని మందలించింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించింది.

దేశసేవకు అంకితమైంది

ఆర్ఎస్ఎస్‌ను పొగడ్తలతో ముంచెత్తిన మోడీ

మానవతా సాయంలో ముందుంటున్నాం

వలసవాద అవశేషాలు చెరిపేస్తున్నాం



నాగపూర్ : ప్రధాని నరేంద్ర మోడీ ఆర్ఎస్ఎస్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. దేశాభివృద్ధికి ఆ సంస్థ ఎంతో సేవ చేస్తోందని కొనియాడారు. శతాబ్ద కాలంగా సంఘ్ సాగిస్తున్న ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ దేశ సేవకు అంకితమైందని చెప్పారు. మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా హింగ్నా పట్టణంలో మాధవ్ నేత్రాలయ నూతన ప్రాంగణానికి ఆదివారం భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగం చేశారు. రాజకీయాల జోలికి వెళ్లకుండా ఆర్ఎస్ఎస్ గొప్పతనాన్ని, సమాజంపై దాని ప్రభావాన్ని మాత్రమే వివరించారు. మానవతావాద సాయంలో భారత్ నాయకత్వ పాత్ర పోషిస్తోందని మోడీ చెప్పారు. అంతర్జాతీయ సంక్షోభాలు తలెత్తినప్పుడు మన దేశం తక్షణమే స్పందిస్తోందని తెలిపారు.

మయన్మార్‌లో పెను భూకంపం సంభవించగానే 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట సహాయ సామగ్రిని పంపామని గుర్తు చేశారు. విపత్తులను ఎదుర్కొంటున్న దేశాలకు సాయం అందించడంలో భారత్ క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని అన్నారు. టర్కీ, నేపాల్, మాల్దీవులకు కూడా ఇలాగే సాయం చేశామని చెప్పారు. 'కోవిడ్ మహమ్మారి వచ్చినప్పుడు కూడా ప్రపంచానికి వ్యాక్సిన్లు సరఫరా చేశాము. మానవాళి అంతా ఒకే కుటుంబమని భావించాము' అని అన్నారు. అంతకుముందు ప్రధాని మోడీ నాగపూర్‌లోని రషింబాగ్‌లో ఉన్న స్మృతిమందిర్‌లో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెగ్డేవార్ మెమోరియల్‌ను సందర్శించారు. దీక్షాభూమిని కూడా సందర్శించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. మోడీ తన ప్రసంగంలో ఆర్ఎస్ఎస్‌ను పదేపదే ప్రస్తుతించడం గమనార్హం.

సామాజిక సేవకు ఆ సంఘం స్తంభంలా నిలిచిందని ఆయన అన్నారు. 'భారత్‌ను సంపన్న దేశంగా చూడాలన్న సంఘ్ కలకు ఓ రూపం వస్తోంది. ఆ లక్ష్య సాధనలో వచ్చే సంవత్సరం మనం మైలురాళ్లను చేరుకోబోతున్నాము. రానున్న వెయ్యి సంవత్సరాల కాలానికి దేశ పురోగతి కోసం పునాది వేస్తాం' అని చెప్పారు. విపత్తు సాయం నుండి మతపరమైన కార్యక్రమాల సమయంలో భక్తులకు చేయూత అందించడం వరకూ ఆర్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అసమానమైనవని కొనియాడారు. వరదలు, భూకంపాలు సంభవించినప్పుడు వారు నిస్వార్థంగా సేవలు అందించారని, ఇటీవలి మహా కుంభమేళాలోనూ తమ వంతు పాత్ర పోషించారని చెప్పుకొచ్చారు. వలస పాలకుల కాలం నాటి అవశేషాలను తుడిచివేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని పునరుద్ఘాటించారు. బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహితను తీసుకొచ్చామని, ఢిల్లీలోని రాజ్‌పథ్‌ను కర్తవ్య పథ్‌గా మార్చామని గుర్తు చేశారు. అండమాన్ నికోబార్ ద్వీప సమూహంలోని ద్వీపాలకు జాతీయతావాదులైన వినాయక్ సావర్కర్, సుభాష్ చంద్ర బోస్ పేర్లు పెట్టామని తెలిపారు. జాతి నిర్మాణంలో యువత పాత్రను మోడీ నొక్కి చెబుతూ వికసిత్ భారత్‌కు వారు పథ నిర్దేశకులని చెప్పారు.

హామీలు అమలయ్యే దాకా విరమించను

రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్



శంభు : నవంబర్ 26 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న దల్లేవాల్ శుక్రవారం ఉదయం నీటిని స్వీకరించి నిరాహార దీక్షను విరమించారని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెప్పిన మరుసటి రోజే..రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రకటన జారీ చేశారు. తాను రైతుల కోసం పోరాటం చేస్తున్నానని, హామీలు అమలయ్యేదాకా నిరాహారదీక్ష విరమించనని స్పష్టం చేశారు. వ్యవసాయ సమూహం సంయుక్త కిసాన్ మోర్చా (నాన్-పొలిటికల్) అధిపతి దల్లెవాల్, పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉన్న ఖనౌరిలో నిరాహార దీక్ష చేస్తున్నారు.చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిన కనీస మద్దతు ధరల కోసం కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్‌ను అంగీకరించాలని పంజాబ్ వ్యవసాయ సంఘాలు చేస్తున్న విస్తృత ప్రచారంలో ఆయన సమ్మె భాగం. కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ఇవ్వాలని ప్రధాన డిమాండ్‌తో ఈ దీక్ష సాగుతోంది.

వాస్తవానికి కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 2024 నుంచి పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభు , ఖనౌరి వద్ద రైతులు నిరసన తెలుపుతున్నారు.

పంజాబ్ ప్రభుత్వం సమర్పించిన తర్వాత, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీని దాని అనుబంధ నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది.రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నవాబ్ సింగ్ నేతృత్వంలో, నిరసన తెలుపుతున్న రైతుల ఫిర్యాదులను పరిష్కరించడానికి సెప్టెంబర్‌లో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.పంజాబ్ ,హర్యానా ప్రభుత్వాలు క్షేత్రస్థాయి పరిస్థితిపై స్థితి నివేదికను దాఖలు చేయాలని కోర్టు కోరింది .సుప్రీంకోర్టు కూడా దల్లేవాల్ నిజమైన రైతు నాయకుడని అభివర్ణించింది.కనీస మద్దతు ధరలకు చట్టపరమైన హామీతో పాటు, భారతదేశంలో వ్యవసాయం కోసం ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ విస్తృత సిఫారసులను అమలు చేయాలని, రైతులు మరియు వ్యవసాయ కార్మికులకు పెన్షన్లు, వ్యవసాయ రుణ మాఫీ, 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించాలని మరియు 2021 లఖింపూర్ ఖేరీ హింస బాధితులకు న్యాయం చేయాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

యూపీలో కబేళాలు, మాంసం విక్రయాలపై నిషేధం

- ముస్లింలపై యోగి సర్కార్ మరిన్ని ఆంక్షలు



లక్నో : చైత్ర నవరాత్రుల పేరుతో ముస్లింలపై ఆంక్షలకు యోగి ప్రభుత్వం సిద్ధమైంది. కబేళాలను మూసివేయాలని, హిందూ మతపరమైన ప్రదేశాలకు 500 మీటర్ల పరిధిలో మాంసం విక్రయాలను నిషేధించాలని ఆదేశించింది. ఏప్రిల్ 6న రామనవమి సందర్భంగా ప్రత్యేక ఆంక్షలు విధించనున్నట్టు ప్రకటించింది. ఆసమయంలో జంతు వధ, మాంసం విక్రయాలు పూర్తిగా నిషేధించబడతాయని తెలిపింది.కబేళాలను వెంటనే మూసివేయాలని, మతపరమైన ప్రదేశాల సమీపంలో మాంసం అమ్మకాలపై ఆదేశించారని పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అమృత్ అభిజాత్ అన్ని జిల్లాల న్యాయాధికారులు, పోలీసు కమిషనర్లు,మునిసిపల్ కమిషనర్లను ఆదేశించినట్టు యూపీ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.2014, 2017లలో జారీ చేసిన ఆదేశాలను ఉటంకిస్తూ.. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మతపరమైన ప్రదేశాల అక్రమ జంతు వధ, మాంసం విక్రయాలను పూర్తిగా నిషేధించినట్టు స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి జిల్లా న్యాయాధికారుల అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలు ఏర్పడ్డాయి. వీరిలో పోలీసులు, కాలుష్య నియంత్రణ బోర్డు, పశుసంవర్ధక శాఖ,ఆరోగ్య శాఖ,ఆహార భద్రత పరిపాలన అధికారులు ఉంటారు.యూపీ మునిసిపల్ కార్పోరేషన్ చట్టం 1959 మరియు ఆహార భద్రతా చట్టం 2006, 2011 నిబంధనల ప్రకారం ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యోగి ప్రభుత్వం ఆదేశించినట్టు ప్రకటనలో తెలిపింది.

వికటించిన పోలీస్ మాక్ డ్రిల్

- జార్ఖండ్‌లో టియర్ గ్యాస్‌తో విద్యార్థినులకు అస్వస్థత



రాంచీ: మాక్ డ్రిల్‌లో పోలీసుల నిర్లక్ష్యం వల్ల స్కూల్ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. టియర్ గ్యాస్ వల్ల ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈ సంఘటన జరిగింది. శనివారం పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగాగా టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు.దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.

17 ఏండ్ల నాటి అవినీతి కేసులో ..

- పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నిర్దోషి : సీబీఐ కోర్టు





రాయ్‌గఢ్ : 2008 నాటి అవినీతి కేసులో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నిర్మల్ యాదవ్ సహ మరో ముగ్గురిని చండీగఢ్‌లోని ప్రత్యేక సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కోర్టు 17 ఏండ్ల తర్వాత నిర్దోషులుగా విడుదల చేసింది.యాదవ్‌తో పాటు, అదనపు సెషన్స్ న్యాయమూర్తి అల్కా మాలిక్ కూడా రవీందర్ సింగ్ భాసిన్, రాజీవ్ గుప్తా , నిర్మల్ సింగ్‌లను నిర్దోషులుగా ప్రకటించారు. మరో నిందితుడు, హర్యానా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ సంజీవ్ బన్సాల్ ఫిబ్రవరి 2017లో మరణించారు. దీంతో అతనిపై విచారణను రద్దు చేశారు.ఆగస్టు 13, 2008న, రూ. 15 లక్షల నగదుతో కూడిన బ్యాగ్‌ను మరో పంజాబ్ ,హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటికి తీసుకెళ్లారని ఆరోపణలు ఉన్నాయి. ఆస్తి ఒప్పందానికి సంబంధించిన కేసును ప్రభావితం చేయడానికి యాదవ్ కోసం ఈ నగదు ఉద్దేశించబడిందని ఆరోపించారు. అయితే, న్యాయమూర్తుల పేర్ల సారూప్యత కారణంగా దానిని పొరపాటున కౌర్ ఇంటికి తీసుకెళ్లారు.ఈ కేసులో ఆగస్టు 16, 2008న ప్రథమ సమాచార నివేదిక నమోదు చేయబడింది. పది రోజుల తర్వాత, కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)కు బదిలీ చేశారు, వారు ఆగస్టు 28, 2008న కొత్త ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.కేంద్ర దర్యాప్తులో బన్సల్‌కు చెందిన ఒక క్లర్క్ నగదును డెలివరీ చేశారని తేలింది. బన్సల్ కౌర్‌కు ఫోన్ చేసి బ్యాగ్ పొరపాటున ఆమెకు డెలివరీ అయిందని చెప్పాడని నివేదిక నివేదించింది.మార్చి 14న జరిగిన అగ్నిప్రమాదానికి అత్యవసర సేవలు స్పందించినప్పుడు జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో లెక్కల్లో లేని నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు వెలువడటం గమనార్హం.

కేంద్ర మంత్రులకు వ్యతిరేకంగా పోస్టులా ?

- సామాజిక మాధ్యమ వేదికలపై మోడీ సర్కార్ కన్నెర్ర
- తొలగించాలంటూ నోటీసులు





న్యూఢిల్లీ : గత సంవత్సర కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమ వేదికలకు, మెస్సేజింగ్ ఇంటర్‌మీడియరీలకు అనేక నోటీసులు జారీ చేసింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలంటూ ఆదేశించింది. హోం మంత్రిత్వ శాఖకు చెందిన సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) 'ఎక్స్' వేదికకు 66 నోటీసులు పంపింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే...వాటిలో సుమారు మూడో వంతు నోటీసులు 'కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు వ్యతిరేకంగా ఉన్న విషయాలను తొలగించండి' అన్న హెచ్చరికలతో కూడినవే. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఆయన కుమారుడు, ఐసీసీ ఛైర్మన్ జే షా, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు వ్యతిరేకంగా ఉన్న వ్యాఖ్యలు, విషయాలను తొలగించాలంటూ జారీ చేసిన నోటీసులే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయని ఢిల్లీ హైకోర్టు, కర్నాటక హైకోర్టు వద్ద ఉన్న రికార్డులు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో కేవలం ఎక్స్ మాత్రమే బాధితురాలు కాదు.

గత సంవత్సర కాలంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లకు కూడా ఇలాంటి తాఖీదులే అందాయి. 'చట్ట వ్యతిరేక సమాచారాన్ని' కలిగిన 1.1 లక్షల కంటెంట్లను తొలగించాలంటూ ఆయా సంస్థలకు నోటీసులు పంపారు. ఈ తరహా కంటెంట్లను డీప్‌ఫేక్స్, బాలల లైంగిక వేధింపుల సమాచారం, ఆర్థిక అవకతవకలు, తప్పుదోవ పట్టించేవి, తప్పుడు సమాచారంతో కూడినవి వంటి కేటగిరీల కింద చేర్చడం గమనార్హం. సాధారణంగా దేశ విదేశాలకు చెందిన రాజకీయ నాయకులు, మీడియా సంస్థలు, వ్యక్తుల నుండి ఈ సమాచారం సామాజిక మాధ్యమాలకు చేరుతుంటుంది. అవి వాటిని పోస్ట్ చేస్తుంటాయి. సమాచార చట్టంలోని సెక్షన్ 79 (3) (బీ)ని ప్రయోగించి కంటెంటును తొలగించాల్సిందిగా నోటీసులు పంపడాన్ని ఎక్స్ కార్పొరేషన్ కర్నాటక హైకోర్టులో సవాలు చేసింది. ఈ కంపెనీ ఎలన్ మస్క్‌కు చెందినదన్న విషయం తెలిసిందే. ఈ సెక్షన్ కింద జారీ చేసే ఆదేశాలను అమలు చేయడం కోసం 14సీ పోర్టల్ అయిన సహ్‌యోగ్‌ను ఉపయోగించడాన్ని కూడా సవాలు చేసింది. అది 'సెన్సార్‌షిప్ పోర్టల్' అని ఆరోపించింది. కంటెంటును తొలగించాలన్న ఆదేశాలను సవాలు చేసే హక్కు ఎక్స్‌కు లేదని విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వాదించింది. ఆ ఆదేశాలు సామాజిక మాధ్యమాలను అణచివేసేందుకు ఉద్దేశించినవి కావని, కేవలం హెచ్చరికలు మాత్రమేనని తెలిపింది.

సీట్ల పంపకాలపై ఎన్డీఏ భేటీ

- నితీశ్ నివాసంలో హాజరైన భాగస్వామ్యపక్షాలు
- రంగంలో దిగిన కేంద్రహోంమంత్రి అమిత్‌షా



పాట్నా : ఈ ఏడాది చివర్లో జరగనున్న బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకాలపై ఎన్డీఏ భేటీ అయింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ నివాసంలో ఆదివారం అగ్ర నాయకులతో జరిగిన సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు అన్ని భాగస్వామ్యపక్షాల నాయకులు పాల్గొన్నారు. ఆయా పార్టీవర్గాలు ఇచ్చిన సమాచారం ప్రకారం... ఈ సమావేశంలో భాగస్వామ్య పార్టీలు తాము క్లెయిమ్ చేసిన సీట్ల జాబితాను సీలు చేసిన కవరులో సమర్పించాయి.

ఇప్పుడు ఈ క్లెయిమ్ చేసిన సీట్ల విషయంలో బీజేపీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.ఎన్డీఏలో సీట్ల పంపకానికి ముందు ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణిస్తుంటే..మరోవైపు సీఎం నితీశ్ తీరుపై అక్కడి ఓటర్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అటు ఆర్జేడీతో జతకట్టి..ఆ తర్వాత బీజేపీతో కలిసి కీలకమైన వర్గాలకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం నితీశ్ కుమార్ నివాసంలో జరిగిన ఎన్డీఏ సమావేశంపై కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. ఇది రాష్ట్రానికి ఎన్నికల సంవత్సరం అని , సమావేశంలో అనేక విషయాలు చర్చించినట్టు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి పనులను ప్రజల ముందుకు ఎలా తీసుకెళ్లాలి..? ప్రతిపక్షాలను ఎలా ఎదుర్కోవాలి..అనే కీలక అంశాలను చర్చించినట్టు తెలిపారు.


ఎన్నికల నామసంవత్సరంగా..

బీహార్ సంకీర్ణంలో ఉన్న నితీశ్ సర్కారు పదవిలో నుంచి దిగటానికి ముందు ప్రాజెక్టులకు శిలాఫలకాలతో సిద్ధమైందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు. మరోవైపు అమిత్ షా రూ.8,000 కోట్లకు పైగా విలువైన కేంద్ర, రాష్ట్ర ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమాల్లో సీఎం నితీశ్ కుమార్‌తో వేదికను పంచుకున్నారు. గోపాల్‌గంజ్‌లో జరిగిన బీజేపీ ర్యాలీలో ప్రసంగించిన తర్వాత అమిత్ షా నేరుగా ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు.

రాష్ట్ర మంత్రులు సహ సీనియర్ జేడీయూ, బీజేపీ నాయకులతో పాటు, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత రెండు దశాబ్దాలుగా బీహార్‌లో నితీశ్ కుమార్ ఎన్డీఏకి ముఖంగా ఉన్నప్పటికీ, ఈసారి బీజేపీ తన నిర్ణయాన్ని పున్ణపరిశీలించవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

- పీ-4' కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు, పవన్



అమరావతి: సమాజంలో మార్పు తెచ్చేందుకే పీ-4 విధానం తీసుకొచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగాది రోజున ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతమవుతుందని, అందుకే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ' పీ-4' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పబ్లిక్, ప్రయివేట్, పీపుల్, పార్టనర్‌షిప్‌గా ఈ విధానాన్ని తీసుకొచ్చారు. తొలి దశలో దాదాపు 20 లక్షల మందికి లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు. వెలగపూడిలోని సచివాలయానికి సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ' మార్గదర్శి- బంగారు కుటుంబం' నినాదంతో పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళగిరికి చెందిన నరసింహ కుటుంబాన్ని తొలి బంగారు కుటుంబంగా, భవన నిర్మాణ కార్మికుడు ఇమ్మాన్యుయెల్ కుటుంబాన్ని రెండో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి, డీబీవీ స్వామి, కూటమి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నా జీవితం ప్రజలకే అంకితం: చంద్రబాబు

పేదరికం లేని సమాజం కోసమే కృషి చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. " నాకు ఏ కోరికలు లేవు. ప్రజలు, యువత భవిష్యత్తు బాగుండాలని ఆలోచించాను. సుపరిపాలనను, మంచి రాజకీయాలను నమ్మాను. నేను ఏ తప్పూ చేయలేదు.. భవిష్యత్‌లో చేయను. పని చేయడం తప్ప నాకు మరేమీ తెలియదు. 40 ఏండ్లుగా ప్రజలే జీవితంగా జీవించా. నా జీవితం ప్రజలకే అంకితం. పేదల సంక్షేమానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి..ఎన్టీఆర్. అన్ని విషయాల్లోనూ నాకు ఆయనే ఆదర్శం. మేం చేసిన అభివృద్ధి వల్ల తెలంగాణలో అత్యధిక తలసరి ఆదాయం వస్తోంది. అమరావతిని గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రజలకు ఏయే మంచి పనులు చేయాలనే నేను ప్రతిరోజూ ఆలోచిస్తా. ఇప్పుడు సాయం పొందిన వాళ్లలో అనేకమంది కోటీశ్వరులవుతారు.అని చెప్పారు. పీ-4 విధానం సమాజంలో గేమ్ ఛేంజర్ అవుతుంది. 2047 నాటికి తెలుగుజాతి ప్రపంచంలోనే నెంబర్‌వన్ కావాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

ఏపీ స్వర్ణాంధ్రగా మారుతుంది: పవన్ కల్యాణ్

'తెలుగు ప్రజలు బాగుండాలనేదే సీఎం చంద్రబాబు, నా ఆకాంక్ష' అని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైకాపా ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను అనేక ఇబ్బందులు పెట్టిందన్నారు. కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే చంద్రబాబుకు మద్దతిచ్చినట్టు చెప్పారు. " సమర్థ నాయకుడు కాబట్టే చంద్రబాబుకు మద్దతిచ్చాను. ఆయన సీఎం అయ్యాక కార్మికుల జీవితాల్లో మార్పు వచ్చింది. ఎదుగుతున్న క్రమంలో మంచి సలహా ఇచ్చేవారు ఉండాలి. అలా ఇస్తే యువత అద్భుతాలు చేస్తారు. మనమంతా చిన్నచిన్న గ్రామాల నుంచి వచ్చిన వాళ్లమే.అని చెప్పారు.

బెట్టింగ్ యాప్‌లతో బెంబేలు



బీజాపూర్‌లో 50మంది మావోయిస్టుల లొంగుబాటు

వారిపై రూ.68 లక్షల వరకు రివార్డు

ప్రభుత్వ విధానం, భద్రతా దళాల వ్యూహమే ప్రధాన కారణమన్న ఎస్పీ

నవతెలంగాణ-చర్ల

చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు, రోడ్డు నిర్మాణాలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై రూ.68 లక్షల రివార్డు గల 50 మంది మావోయిస్టులు లొంగిపోయారు. రివార్డు పొందిన 13 మంది మావోయిస్టులతో సహా 50 మంది ఆయుధాలను వదిలారని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ప్రభుత్వ విధానం, భద్రతా దళాల వ్యూహం ప్రభావంతోనే మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచిపెట్టి సమాజ స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. లొంగిపోయిన వారిలో నెంబర్ 1, 2, 7 పీఎల్‌జీఏ బెటాలియన్, నేషనల్ పార్క్ ఏరియా కమిటీకి చెందిన ముగ్గురు ఏరియా కమిటీ స్థాయి సభ్యులు, జనతా సర్కార్ అధ్యక్షులు, కేఏంఎస్ అధ్యక్షులు, సీఎన్‌ఎం సీఎన్‌ఎం సభ్యులు, మిలిషియా కమాండర్, మిలిషియా ప్లాటూన్ సభ్యుడు అనేక ఇతర మావోయిస్టు క్యాడర్లు ఉన్నారు. వీరిలో 13 మందిపై మొత్తం రూ.68 లక్షల రివార్డు ఉన్నట్టు తెలిపారు. ఆరుగురిలో ఒకొక్కరిపై రూ.8లక్షలు, ముగ్గురికి రూ.5లక్షలు, మిగిలిన నలుగురిపై ఒకొక్కరికి రూ.లక్ష రివార్డు ఉంది. వీరి లొంగుబాటులో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కీలకపాత్ర పోషించాయని అన్నారు. కాగా, మావోయిస్టుల సంస్థలో కొనసాగుతున్న అరాచకాలు, పెరుగుతున్న అంతర్గత విభేదాలు, భావజాలం పట్ల భ్రమలు, సురక్షితమైన కుటుంబ జీవితాన్ని గడపాలనే కోరిక లొంగిపోవడానికి ప్రధాన కారణాలని వారు పేర్కొన్నట్టు ఎస్పీ తెలిపారు. ఇది కాకుండా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పునరావాస విధానం, భద్రతా బలగాల కఠినమైన చర్యలు, ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా మావోయిస్టులు లొంగిపోవడానికి ప్రేరేపించాయని అన్నారు. అంతర్గత ప్రాంతాల్లో భద్రతా శిబిరాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, నీరు, విద్యుత్ లభ్యత, మెరుగైన రవాణా, ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాల వల్ల మావోయిస్టులు ప్రభావిత ప్రాంతాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. గ్రామస్తులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన సానుకూల సంభాషణ మావోయిస్టులను లొంగిపోయేలా చేసిందని ఎస్పీ వివరించారు.

విపరీతంగా ఆకర్షితులవుతున్న యువత

అప్పులు తీర్చలేక ఆత్మహత్యల పాలు

- బెట్టింగ్‌ల కోసం రకరకాల అబద్ధాలు
- ఫ్రెండ్స్, బంధువులనూ వంచన...
- తల్లిదండ్రుల తీవ్ర మానసిక క్షోభ
- ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపినా

ఇప్పటికీ కొన్ని చానల్స్‌లో ప్రమోషన్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"ప్రిడిక్షన్స్ ఫెయిల్ అయితే మార్కెట్ మొత్తం దెబ్బతిన్నదని.. నెక్ట్ మ్యాచ్‌లో ప్రతాపం చూపిద్దాం.. లాస్ మొత్తం కవర్ చేద్దాం.. మరింత ఎక్కువ డబ్బును సిద్ధం చేసుకోండి" అని మెసేజ్‌లు పెడుతుండటంతో అప్పులు చేసి తర్వాత మ్యాచ్ బెట్టింగ్‌కు యువత సిద్ధమవుతున్నారు. ఇలా వరుస వైఫల్యాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్స్‌పై చర్యలు తీసుకుంటున్నా.. ఇంకా ఈ దందా కొనసాగుతూనే ఉంది.

పేద, మధ్యతరగతి వర్గాల యువతే మోజు..

బెట్టింగ్‌లపై పేద, మధ్యతరగతి యువతే ఎక్కువగా మోజు చూపుతోంది. రూ.లక్షలు వెచ్చించి ఉన్నత చదువులు చదివిస్తే పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగానో ఇతరత్ర ఉద్యోగాల్లోనో స్థిరపడ్డాక బెట్టింగ్‌లకు పాల్పడుతూ బలవన్మరణాలకుపాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభ కలిగిస్తోంది. బాధితుల కుటుంబ సభ్యులందరూ ఈ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవడాన్ని ఆహ్వానిస్తున్నారు. అదే క్రమంలో అసలు ఈ యాప్‌లనే లేకుండా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



యువత బలవుతూనే ఉన్నారు. ఈ రెండు నెలల్లోనే ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఓ యువకుడు, కొత్తగూడెంకు చెందిన మరో యువకుడు, ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్పకు చెందిన ఇంకో యువకుడు బెట్టింగ్ యాప్‌ల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న ఈ ముగ్గురూ నెలకు రూ.40వేలకు పైగానే వేతనం తీసుకుంటున్నారు. ఆ డబ్బులు కూడా సరిపోకపోవడంతో స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు.. ఇలా ఎవరిదగ్గర పడితే వాళ్ల దగ్గర అప్పులు చేశారు. అవి కూడా సరిపోక లోన్ యాప్‌ల్లోనూ రుణాలు పొందారు. ఇటు అప్పుల వాళ్ల నుంచి ఇబ్బందులు.. అటు బెట్టింగ్ యాప్‌ల దగా.. తల్లిదండ్రులు ఎంత ప్రాధేయపడినా బెట్టింగ్ వ్యసనం నుంచి బయటప డలేక ఈ ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు బలవన్మరణానికి పాల్పడ్డా రు. ఇందులో వైఎస్ఆర్ కాలనీకి చెందిన యువకు డు అజీజ్ కు నెలకు రూ.40వేల వేతనం వస్తోంది. ఏడాది కాలంగా బెట్టింగ్‌లకు అలవాటుపడిన ఇతను రూ.19లక్షల కు పైగా అప్పులు చేశాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇతని తండ్రి అంతమొత్తం తీర్చలేని దుస్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో సెల్ఫీవీడియో తీసుకుంటూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను చేసిన అప్పులన్నీ తీర్చాలని ఆ వీడియో ద్వారా వేడుకున్నాడు.

అప్పుల కోసం అబద్ధాలు..

బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువత తమ జీతం సరిపోక అప్పుల కోసం రకరకాల అబద్ధాలు ఆడుతున్నారు. స్నేహితులు, బంధువులను మోసం చేశాక.. పరిచయస్తులు, క్లాస్‌మేట్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడా అప్పులు పుట్టని పరిస్థితుల్లో తాము పనిచేస్తున్న కంపెనీలోనో.. మరేదైనా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లోనో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.30వేల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఎంతకూ జాబ్ రాకపోవడంతో నిలదీస్తుండటంతో రకరకాల అబద్ధాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఇటీవలికాలంలో ఇటువంటి కేసులు అనేకం పోలీస్‌స్టేషన్ల వరకూ వెళు తున్నాయి. చేసేది లేక తల్లిదండ్రులు ఆ అప్పుల్లో కొన్నింటిని తీర్చుతున్నా.. వారి స్తోమతకు మించి అప్పులు చేయడంతో పిల్లలను ప్రాధేయపడుతున్నారు. ఉద్యోగం వద్దు ఇంటికి రమ్మని.. వేడుకుంటున్నా బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువకులు దాన్ని వదిలేసి రాలేని పరిస్థితి ఉంది. ఖమ్మంలో ఇలాంటి ఘటనలు అనేకం ఇటీవల వెలుగుచూస్తున్నాయి. కొన్ని పోలీసుస్టేషన్ల వరకు వస్తుండగా కొన్ని స్థానికంగానే సెటిల్ చేస్తున్నారు. బెట్టింగ్‌కు పాల్పడనని తనపై ప్రమాణం చేసిన కొడుకు తిరిగి అదే ఊబిలో కొట్టుమిట్టాడుతుండటంపై ఖమ్మం నగరంలోకి కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఓ తల్లి 'నవతెలంగాణ' ఎదుట కన్నీరుమున్నీరైంది. అన్నపురెడ్డిపల్లి రెసిడెన్షియల్ స్కూల్‌లో నెంబర్ వన్ స్టూడెంట్‌గా తన కుమారుడు చదువులో రాణించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డాక బెట్టింగ్ యాప్‌ల వ్యసనానికి లోనై అప్పులపాలవడంతో అందరూ ఇంటికి వచ్చి అడుగుతున్నారని ఆవేదన వెలిబుచ్చింది. తమ వంటి పేద, మధ్యతరగతికి మానసికక్షోభ మిగుల్చుతున్న బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని ఆ తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికీ కొనసాగుతున్న దందా..

తెలుగురాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్‌పై చర్యలు తీసుకుంటున్నా సరికొత్త రూపాల్లో ఈ దందా కొనసాగుతూనే ఉంది. ప్రిడిక్షన్స్ ఇవ్వటం ద్వారా లాభాలు సంపాదించండంటూ తమ చానల్‌ను, బెట్టింగ్ యాప్స్‌ను కొందరు ప్రమోట్ చేస్తున్నారు. ఇలా వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు ఓపెన్ చేస్తూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌ను అనేక మంది ఓ వృత్తిగా ఎంచుకున్నారు. ఫలానా యాప్స్‌లో గేమ్ ఆడితే ఎక్కువ లాభాలంటూ ఆశ చూపిస్తున్నారు. బెట్టింగ్ వైపు దృష్టి మరలేలా చేస్తున్నారు. ప్రమోషన్స్‌తో మొదలు పెట్టి కొందరు సొంతంగా బెట్టింగ్ యాప్‌లను నిర్వహించే స్థాయికి చేరుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌లపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపినా వేలల్లో సబ్‌స్క్రైబర్లు ఉన్న అనేక చానల్స్ వీటిని మాత్రం ఆపటం లేదు. సెలబ్రిటీలే కాకుండా టెలిగ్రామ్, వాట్సప్‌ల్లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు కోరుతున్నారు.

మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు?


గవర్నర్‌తో రేవంత్‌రెడ్డి సుదీర్ఘ మంతనాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సీఎం ఆదివారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. అనంతరం సీఎం, గవర్నర్‌తో చర్చించారు. మంత్రివర్గ విస్తరణ ఊహాగానాల నేపథ్యంలో గవర్నర్‌తో సీఎం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. క్యాబినెట్ విస్తరణ, మంత్రుల ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు చేసినట్టు తెలిసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కూడా మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం పెద్దలతో చర్చించిన విషయం తెలిసిందే. మంత్రివర్గ విస్తరణకు ఏఐసీసీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనీ, ఉగాది తర్వాత మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని ప్రభుత్వం లీకులిచ్చింది. ఈ నేపథ్యంలో గవర్నర్‌తో సీఎం భేటీ కావడంతో దీనికి బలం చేకూరుతున్నది. ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు 15 నెలలుగా క్యాబినెట్ విస్తరణ పెండింగ్‌లో ఉన్నది. సామాజిక సమీకరణాలు, మంత్రి ప్రాతినిధ్యం లేని ఉమ్మడి జిల్లాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేదు. మంత్రివర్గవిస్తరణలో ఈసారి ఆయా జిల్లాల ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ సామాజికతరగతికి చెందిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి దాదాపుగా మంత్రి పదవి ఖరారైపోయిందనే ప్రచారం జరుగుతున్నది. అలాగే... రెడ్డి సామాజికతరగతికి చెందిన ఇద్దరు నాయకులకు మంత్రిపదవులు దక్కుతాయనే చర్చ నడుస్తోంది. రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. బీసీ సామాజిక తరగతికి చెందిన ముదిరాజ్ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కే అకావకాశం ఉన్నట్టు వినికిడి. మిగతా ఇద్దరు ఎవరనేది ఇంకా నిర్ణయం కాలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.



పల్లీ-బటానీలు సామాజిక న్యాయానికి చోటేది?



ఇటీవల అలహాబాద్ హైకోర్ట్ జడ్జి రామ్ మనోహర్ మిశ్రా ఒక కోర్టు తీర్పులో చేసిన వ్యాఖ్యలు దేశంలో దుమారం లేపాయి. ఆడవారి 'రొమ్ములు పట్టుకోవటం, వారి పైజామా ముడి తాడు లాగటం' లైంగికదాడి ఉద్దేశం ఉన్నట్టు కాదని, దాని కిందకు రాదనేది ఆ జడ్జి గారి తీర్పు. అయన స్థానంలో ఒక మహిళా న్యాయమూర్తి కూర్చుని వుంటే ఇటువంటి వ్యాఖ్యలు చేసేవారా? ఆ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందనుకోండి. అది వేరే విషయం. ఆ తీర్పు సున్నితంగా లేదని, అమానుషంగా ఉన్నదని కూడా వ్యాఖ్యనించింది. ఈ తీర్పు ఏదో పొరపాటున ఇచ్చినట్టు లేదు. సమస్య పట్ల అవగాహనాలోపం కొట్టవచ్చినట్టు కనపడుతున్నది. హైకోర్టు స్థాయిలో వున్న న్యాయమూర్తికి సున్నితత్వంగా ఉండటం ఎవరు బోధించగలరు? ఈ న్యాయమూర్తులను నియమించేది, సుప్రీంకోర్టు కలోజియం సలహా మేరకు కేంద్ర ప్రభుత్వమే కదా.అసలు సమస్య అంతా ఇక్కడుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో వున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళా, మైనారిటీ రిజర్వేషన్లు హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో లేవు. ఎందుకు లేవు, ఎందుకు ఉండకూడదు అనే ప్రశ్న సుప్రీంకోర్టు తనకు తానే వేసుకుని ప్రజలకు సమాధానం ఇవ్వాలి. రాజ్యాంగం అటువంటి రిజర్వేషన్లు కల్పించలేదనే సాకు సరియైనది కాదు. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో కోర్టులే కొన్ని వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలని చెబుతుంటుంది.

ఇప్పుడు నడుస్తున్న పార్లమెంటు సమావేశాల్లో ఆర్జేడీ సభ్యుడు మనోజ్ కుమార్ మిశ్రా ఈ ప్రశ్న వేశారు. మొత్తం హైకోర్టు న్యాయమూర్తుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా, మైనారిటీ న్యాయమూర్తులు ఎంత మంది వున్నారు అనేది ఆ ప్రశ్న. ప్రభుత్వం తన దగ్గర అటువంటి డేటా లేదన్నది. అయితే జడ్జీల స్థానాలకు సిఫారసు చేసిన వారి సామాజిక నేపథ్య వివరాలు తీసుకోవటం 2018 నుంచి తప్పనిసరి చేశారు. దాని ఆధారంగా 2018 నుంచి జరిగిన హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలు 715 అయితే, 22 మంది (3 శాతం) ఎస్సీలు, 16 మంది (2.2 శాతం) ఎస్టీలు, 89 మంది ఓబీసీలు (12.4 శాతం) ఉన్నారు. 551 మంది అగ్రకులాల వారు. దాదాపు ఈ ప్రశ్న ప్రతీ ఏడాది పార్లమెంటులో రావ టంచూస్తూనే ఉన్నాం .వచ్చిన ప్రతీ సారి ఒకే రకమైన సమాధానమూ చూస్తు న్నాం. న్యాయమూ ర్తుల నియామకంలో వివిధ తరగతు లకు చోటు కల్పించా లనే మాట కూడా ప్రజలను మాయ పుచ్చటానికి ఉపయోగిస్తు న్నారు. హైకోర్టు న్యాయమూ ర్తుల నియామకాలు కొలీజియం ద్వారా సిఫారసు చేసే సుప్రీంకోర్టు పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. ప్రస్తుతము న్న 34 మంది సుప్రీంకోర్టు న్యాయమూ ర్తుల్లో ఇద్దరే మహిళా న్యాయమూర్తులు, ఇద్దరే ఎస్సీ న్యాయమూర్తులు, మైనారిటీ ఒకరు. ఎస్టీలు అసలు లేరు, 2002 నుంచి 2008 వరకు ఒకే ఒక్క ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన న్యాయమూర్తి ఉన్నారు. అంతటితో ఖతం. సామాజిక న్యాయానికి దేశ అత్యున్నత న్యాయస్థానంలోనే స్థానం కరువయితే, ఇక హైకోర్టుల్లో దొరుకుతుందా? అధికారంలో వున్న రాజకీయ పార్టీలు ఎన్నికలకు టిక్కెట్లు ఇచ్చేటప్పుడు అన్ని రకాల సామాజిక సమీకరణలు చూస్తారు. ఎక్కడ ఏ సామాజిక వర్గం బలంగా వుందో, ఏ కులానికి, ఏ మతానికి చెందిన వారికి టికెట్ ఇవ్వాలో తర్జనభర్జన పడతారు. అదే న్యాయాన్ని ఇక్కడ పాటించరు. రాజ్యాంగం అక్కడ రిజర్వేషన్లు కల్పించలేదంటారు, మెరిట్ చూస్తామంటారు. మెరిట్ చూస్తామన్న ప్రతీసారి అది కింది కులాలను, మైనారిటీలను, మహిళలను అవహేళన చేయటంగా వీరు ఎప్పుడు అర్థం చేసుకుంటారు? స్వతంత్యం వచ్చి 75 ఏండ్లు అయిన తరువాత కూడా ఈ పరిస్థితి వుంటే ఇక స్వాతంత్ర్యం ఎవరికి వచ్చినట్టు. అన్ని సామాజిక తరగతులకు అభివృద్ధిలో వాటా లేకపోతే దేశం ముందుకు అడుగేయగలదా? ఈ పద్ధతిలో న్యాయస్థానాలను ఉంచి, ఆ న్యాయ స్థానాల మీద నమ్మకం ఉంచాలని సుద్దులు చెబితే చెల్లుబాటవుతుందా? చట్టం తన పని తాను చేసుకుపోతుందంటే నమ్మేదెవరు?



ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి సారించాలి

- ఈ పంటకు ఉజ్వల భవిష్యత్తు ఉంది
- మద్దతు ధరకోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకుకావాలి
- జూన్ కల్లా గోదావరి జలాలతో సాగునీరు అందిస్తాం
- ఆగస్టు 15న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రాకపోకలు మొదలుపెడతాం : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వేంసూరు మండలం కల్లూరుగూడెంలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీకి శంకుస్థాపన

నవతెలంగాణ-సత్తుపల్లి/వేంసూరు

ఆయిల్‌ఫాం పంటకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ నేపథ్యంలో పామాయిల్ తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినాన ఖమ్మం జిల్లాలోని వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మంత్రి తుమ్మల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఆయిల్ ఫెడ్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డితో కలిసి ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తుమ్మల మాట్లాడుతూ.. పామాయిల్ పంటకు మద్దతు ధర కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయిల్ ఫెడ్ చైర్మెన్ రాఘవరెడ్డిని, ఎండీ యాస్మిన్‌బాషాను మంత్రి తుమ్మల కోరారు. వర్షాలతో సంబంధం లేకుండా వచ్చే జూన్ నాటికల్లా గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకించి చర్యలు తీసుకుంటామన్నారు. వేంసూరు మండల రైతులకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్టీఆర్ కాలువను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజీవ్ లింకు కెనాల్‌ను పూర్తిచేసి ఇటీవల వైరా నియోజకవర్గానికి గోదావరి జలాలను పారించామన్నారు. నాగార్జున సాగర్ నిండక పోయినా జూన్‌కల్లా సత్తుపల్లి నియోజకవర్గానికి గోదావరి జలాలను తీసుకొస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో 10లక్షల ఎకరాల్లో రెండు పంటలకు సాగునీరు అందేలా సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించేందుకు పెండింగులో ఉన్న పనులను పూర్తి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఆమోదం లభించిందని తెలిపారు. ఆగస్టు 15 నాటికల్లా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేసుకొని రాకపోకలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. దాంతో మవుతాయని, ఖమ్మం నుంచి సత్తుపల్లికి కేవలం 33 నిమిషాల్లోనే చేరుకోవచ్చన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ అన్నారు. కల్లూరుగూడెంలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ వచ్చే ఉగాది నాటికల్లా పూర్తవుతుందన్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల ఈ ప్రాంతంలో 100నుంచి 200మంది నిరుద్యోగ యువతకు ఉపాధి దొరుకుతుందని, పరోక్షంగా వేలాది మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ.. ఉగాది పర్వదినాన ఈ ప్రాంతంలో నాలుగో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎల్.రాజేందర్, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తెలంగాణ, ఆంధ్రా ఆయిల్‌ఫాం అధ్యక్షులు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్ర, జాతీయ కమిటీలు

- రాష్ట్ర ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు : బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలుగు సంవత్సరాది వేడుకల్లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బూత్, మండల, జిల్లా కమిటీల ఎన్నిక పూర్తయిందనీ, త్వరలోనే రాష్ట్ర, జాతీయ కమిటీల ఎన్నిక పూర్తవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని చేపట్టిన ప్రత్యేక పూజలు, హోమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..తెలుగు ప్రజలందరికీ శ్రీవిశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హిందూవుల ప్రతి పండుగలోనూ సైన్స్ కూడా ఉంటుందన్నారు. కులాలకతీతంగా ప్రజలందరూ సామూహికంగా కలిసి ఉండాలనే పండుగలు సూచిస్తాయన్నారు. రాష్ట్రం, దేశం సస్యశ్యామలంగా ఉండాలనీ, కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు.

ఎంజేపీ బీసీ గురుకుల దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 6, 7, 8, 9 బ్యాగ్ లాగ్ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువను వచ్చే నెల ఆరు వరకు పొడిగించినట్టు ఎంజేపీ కార్యదర్శివ బడుగు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం బ్యాగ్ లాగ్ సీట్లు 6,832 ఉండగా, ప్రవేశ పరీక్ష వచ్చేనెల 20 (ఆదివారం) ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు.మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఆరో తేదీలోగా www.mjptbcwreis.telangana.gov. in,ttps://mjptbcadmissions.org వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఈఎన్‌టీ.. ఇదేంటి..?

కొత్త భవన నిర్మాణమూ పెండింగ్ -రూ.35 కోట్లు మంజూరైనా ఊసే లేదు

- సిబ్బంది లేక రోగుల ఇబ్బంది
- ఇదీ కోఠి ఈఎన్టీ హాస్పిటల్ దుస్థితి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ కోఠిలోని చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) హాస్పిటల్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సిబ్బంది లేక సకాలంలో వైద్య సదుపాయాలు అందడం లేదు. అధికంగా సిబ్బంది కొరత వెంటాడుతుండటంతో సకాలంలో వైద్యమందించేవారు లేక రోగులు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న ఒక్కగానొక్క ప్రభుత్వాస్పత్రిలోని ముఖ్యమైన విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్న వారి మీద ఒత్తిడి పెరిగి శస్త్ర చికిత్సల సంఖ్య కూడా తగ్గుతోంది.

రోగుల తాకిడి, పని భారమూ ఎక్కువే..

ఈఎన్‌టీ ప్రభుత్వాస్పత్రికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్ర నుంచి సైతం రోగులు వస్తుంటారు. ప్రతి సోమవారం సుమారు 2వేల వరకు ఔట్ పేషెంట్లు వస్తుండగా, మిగతా రోజుల్లో 1500 వరకు వస్తుంటారు. ప్రతి రోజూ 125 మంది వరకు ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతుంటారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో సరిపడా సిబ్బంది లేక వైద్యం కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ మధ్య కాలంలో ఈఎన్‌టీ హాస్పిటల్‌కు వచ్చే రోగుల తాకిడి మరింత ఎక్కువైంది. ఇందుకు తగ్గ సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రేడియోగ్రాఫర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, ఒక్కటి కూడా భర్తీ చేయకపోగా.. ఒక్క కాంట్రాక్ట్ ఉద్యోగితో నెట్టుకొస్తున్నారు. 4 ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నా ఇక్కడా కాంట్రాక్ట్ ఉద్యోగితోనే కాలం వెల్లదీస్తున్నారు. ఇది నెలలుగా సాగుతున్నా.. సర్కార్ ఖాళీల ఊసే ఎత్తడం లేదు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారితోనే పని చేయించడం వల్ల పని ఒత్తిడికి గురవుతున్నారు. దీనికితోడు సత్వర వైద్యం అందక రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ప్రొఫెసర్ పోస్టులు 3, అసిస్టెంట్ ప్రొఫెసర్ 2, 11 నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలు, 28 నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలు, 2 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు, థియేటర్ అసిస్టెంట్ 2, ఒక ఆడియోలిస్ట్, ఆడియోలజీ టెక్నీషియన్ పోస్టులు 2, ఫార్మసిస్టు ఖాళీలు 4, డార్క్ రూమ్ 4, రెండు రేడియోగ్రాఫర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కొత్త భవనానికి మోక్షమెప్పుడో..?

కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ హాస్పిటల్ ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి 2022లో నాటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులకుగాను అప్పటి ప్రభుత్వం రూ.35 కోట్లు విడుదల చేసింది. గుత్తేదారు ఆ స్థలంలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు సైతం చేశారు. తీరా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు అటకెక్కాయి. అటు గుత్తేదారు పట్టించుకోక.. ఇటు సర్కార్ పర్యవేక్షణా కరువై కొత్త భవన నిర్మాణానికి మోక్షం కరువైంది.

పెచ్చులూడుతున్న పాత భవనం

ప్రస్తుతం ఉన్న ఈఎన్‌టీ భవనంలో పలుచోట్ల పెచ్చులూడటంతో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు హాస్పిటల్ ప్రాంగణంలోని ముందు భాగంలో నిర్మించేందుకు మొదట ప్రణాళికలు చేయగా, స్థానికుల నుంచి అభ్యర్థన రావడంతో వెనుక ప్రాంతంలో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. సుమారు రెండెకరాల స్థలంలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. నూతనంగా నిర్మించే ఈ ఐదంతస్తుల భవనంలో అత్యాధునిక పద్ధతుల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ), ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఐసీయూ పోస్ట్ ఆపరేషన్ వార్డు, ఔట్ పేషెంట్ సేవలు అందించేలా ప్రణాళికలు చేశారు. కాగా, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ పనులు పునాదుల వద్దే నిలిచిపోయాయి. ఈ పనుల కోసం హాస్పిటల్ వెనుక వైపు ఉన్న హాస్పిటల్ గేట్ మూసేయడంతో అత్యవసర చికిత్స కోసం వాహనాల్లో వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక హాస్పిటల్ భవనం కూడా పాతది కావడంతో ఏ క్షణంలోనైనా పెచ్చులూడే పరిస్థితి నెలకొనడంతో బిక్కుబిక్కుమంటూ అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది కాలం వెల్లదీయాల్సిన దుస్థితి ఏర్పడింది.



నవతెలంగాణ దర్వాజ 4
సోమవారం 31-3-2025 || హైదరాబాద్

మావుకు చిక్కని జెల్లపిల్ల



ముర్కశీల ఎల్లుదలకు
మావుకు చిక్కని జెల్లపిల్ల
మా ఆకేరు వాగు
మబ్బుపాలను తాగి
నురుసులు కుక్కుకుంట
వంకలు తిరిగి రంకెలేత్తది
పడుసు కోల్యాగకు
ముగుదాడేసినట్టు
ఆడాడ చెక్ డ్యాములున్నా
జోరుగాలంల నదిని తలపిత్తది
పరుగు పరుగున
పసుపు కుంకుమ
వాయినాలందుకొని
పోరలొదిలిన కాగితప్పడవలల్ల
షికారు జేత్తది
బట్టలనే కాదు
బండ్ల మరయంత్రాలు
మకిలి పట్టిన మనసులను
మైలతీత్తది
యాడాది పొడుగూత
వలకో గాలానికో చిక్కి
ఆదివారం పూట వాడకట్టున
నీసు వాసనైతది
దూరంగున్న మిట్ట పొలానికి
జలనాలమై సత్తువపంచి
పచ్చనిగంట కడుతది
సుట్టూ వందల ఊర్లకు
నోట్లె మెతుకు పోతాందంటే
దాని పేగుబంధపు దీవనార్తే
తల్లీ.. నీ పేరుజెప్పి
కొదుమగోర్రెను కోసి
దావత్ చేసుకుంటం
నువ్వు మా బతుకులల్ల
ఇట్లనే పచ్చగ పారాలె
ఎవడన్న పలుపచ్చుంబట్టి
నీ పరుగాపితె
మా ఎడమచేతి చూపుడేలుతో
వాని కుర్చీని కూలదోత్తం.

- దయాకర్ వడ్లకొండ, 9440427968

అమ్మ

మా అమ్మ రోకటి పోటుతోనే ...
మా ఊళ్ళో వెలుగు చుక్క పొడిచేది,
గురకొయ్యలు వాలంగ ..
జొన్నలు తొక్కి, అంబలి కాచి, బిడ్డలకు తాపి...
ఎవరో తరుముతున్నట్లే అడవికిపోయేది.
ఎర్రటి అగ్గిల దహనమై పోయి,
కంకికి కడివెడు నీళ్ళు తాక్కుంటూ..
సద్దకంకుల కోతతో నిలువెత్తు బతకమ్మయ్యేది .
ఆసామి అదిలించినా , పటేలమ్మ పండ్లు కొరికినా ...
ధుఖమంతా కడుపులోనే దాచుకునేది.
పెయ్యంతా భూమి పెనం మీద నల్లగా మాడ్చేసి,
పడమటి కొండల్లోకి సూరయ్య పారిపోయ్యాకనే ..
మా యమ్మ ఇంటి తోవ పట్టేది.
నడుస్తున్న కాలి మెట్టెలకు బిడ్డలు తగిలి..
గిన్ని ఊసబియ్యమో, గన్ని గోవింద గుగ్గిళ్ళో..
ఒళ్ళో పోసుకొని తెచ్చేది.
అమ్మ ఎండిన గుండెల మీద చెల్లి ఆకలితో తారాడుతుంటే ...
ఆమె వెచ్చని ఒడిలో పడుకొని మేము చెప్పే కబుర్లు వింటూ..
పావురంగా తల నిమిరేది.
తుంటరి పిల్లలు మమ్మల్ని ఏడిపించినప్పుడు ...
అమ్మ బ్రహ్మ రాక్షసే అయ్యేది .
మా యమ్మ గోడకు పట్టెలు తీరిస్తే,
కొండమీది కోనేటి రాయుడోచ్చి చూసి పోయేది.
అలికి వారలు తీస్తే..
ఆర్టిస్టులంతా అమ్మ దగ్గర విధ్యార్థులయ్యేది.
అంట్లు, బట్టలు, పేడ, పిండి ఎక్కడ చూసినా ..
అమ్మ కాళ్ళూ... చేతులే కనిపించేవి.
మా అమ్మ ఒక్క నాన్నకే కాదు...
అత్త మామలకూ...ఆడబిడ్డలకు కూడా బానిసే...
మాకు మాత్రం అమృత వల్లి, కోరినవి ప్రసాదించే కల్పవల్లి.
అమ్మ అనారోగ్యం పాలైతే...
ఏ డాక్టర్‌ను దరిచేరనీయక పోయేది.
వంటగదిలోని సొంటి, ఎల్లిపాయ, వామే పరామౌషదమయ్యేది.
అమ్మ తినేదెప్పుడో... నిద్ర పోయేదెప్పుడో తెలిసేదే కాదు .
పీడ కల తగిలి నిద్రలో ఉలిక్కిపడితే...
'నేనున్నాగా బిడ్డా...' అంటూ
చల్లని ఆప్త హస్తం ఒళ్ళు నిమిరేది.
మేము పెద్దగై, కొలువులు పట్టాక,
అమ్మ తనువంతా డస్సిపోయి ..
ఎండిన మానులా మిగిలి పోయింది .
ఎన్ని ప్రభుత్వ ప్రణాళికలు
అమ్మ కండ్ల ముందే కదిలి పోలేదూ...
కానీ.. ఒక్కటీ అమ్మ కన్నీరును తుడవలేదు.
వాళ్ళకు అమ్మొక ఓటు ముక్క గానే కనపడేది.
అమ్మ చేసిన త్యాగం తలుచుకుంటే ..
గుండెల్లోని దుఖ నది వరదలై పారేది .
మరో జన్మంటూ ఉంటే.. 'నీకు తల్లిగా పుట్టి ..
కన్న ఋణం తీర్చుకుంటానమ్మా' అని
కన్నీళ్లతో పాదాలను కడగాలని ఉంది .

- పుప్పాల కృష్ణ మూర్తి, 99123 59345

జీవితపు లోతుల్ని తెలిపే 'ఖుర్బాని'

జీవితం అన్నాక ఎన్నో రకాల మజిలీలు ఉంటాయి. రోజుకు ఒక కొత్త సమస్య వస్తుంది. వాటన్నింటినీ దాటాలంటే ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుంది. అది కుటుంబ పరంగానే కావచ్చు లేక జీవనోపాధి పరంగా కావచ్చు. మనిషికి మనిషికి మధ్య ఆప్యాయత, అనురాగాలు, అనుబంధాలు మెండుగా ఏర్పరచుకోవాలంటే ఎంతో కొంత మనలో త్యాగం అవసరం ఉంటుంది. ఆ త్యాగం భిన్నపార్శ్వాలలో ఎలా చూపవచ్చు అనేది "ఖుర్బాని" కథల పుస్తకంలో 'సయ్యద్ గఫార్' గారు కథల రూపంలో చూపించారు. ఈ పుస్తకంలో 13 కథలు ఉంటాయి. ప్రతి కథ ఒక ప్రత్యేకమైన జీవితపు మలుపులను తెలియజేస్తుంది.

సమాజంలోని అసమానతల గూర్చి తెలియజేస్తూ రాసిన కథె "హంస". ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు ఎన్నోకోట్లు వార్షిక బడ్జెట్లో విద్యపై ఖర్చు పెడుతుంటారు. కానీ అవి ఎంతవరకు సక్సెస్ అవుతున్నాయి అనేది మాత్రం ఇక్కడ ఒక ప్రశ్నగానే మిగిలిపోతుంది. దేశంలో ఎంతోమంది పేద ప్రజలు ఉన్నారు, సంచార జాతుల వారు ఉన్నారు. వీరిలో ఎవరికీ కూడా విద్య అన్నది ఒక అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. ఎందుకంటే వారి కుటుంబ పోషణ, వారి పోషణకే పొద్దున లేచిన నుండి పడుకునే వరకు ఏదో ఒక పని చేస్తూ ఉంటేనే వారి జీవితం గడిచిపోతుంది. మనసులో చదువుకోవాలని ఎంత ఉన్నా కడుపేదరికం వల్ల విద్యకు దూరమవుతు బతికీడుస్తున్న అనేకమందిని సమాజంలో చూస్తుంటాం. చదువుకొని మంచి ఉద్యోగం చేసి ఉన్నతంగా బ్రతకాలని 'హంస' పాత్ర మలచిన తీరు బావుంది.

'ప్రశ్నించే నీడ' ఈ కథ చదువుతుంటే ఆకలి మనిషిని ఏ పనైనా చేయడానికి సిద్ధపడుతుంది అని తెలియజేసే కథ. ఈ కథలో 20 సంవత్సరాలు ఉన్న ఒక స్త్రీ సరి అయిన వస్త్రాలు లేకుండా చేతిలో ఒక చిప్ప పట్టుకుని 'అన్నం పెట్టండి ఆకలవుతుంది, పుణ్యం వస్తుంది మీకు' అని ఎంతో దీనంగా అర్థిస్తూ ఇల్లు ఇల్లు తిరుగుతుంది. ఒక ఇంటి యజమాని ఆమెను కసురుకుంటూ నానా బూతులు తిడుతూ ఆమెను అక్కడి నుండి పంపించేస్తాడు. ఆ ఇంటి యజమాని వాళ్ళ ఆవిడ పుట్టింటికి వెళ్తుంది ఒకరోజు, అదే రోజు రాత్రి ఆ యజమాని ఒక స్త్రీని తీసుకుని వచ్చి ఇంటిలో తన కోరిక తీర్చుకుంటాడు. ఇదంతా ఇంటి పైన అద్దెకు ఉన్న అతను గమనిస్తుంటాడు. చివరికి ఆమె వెళుతుంటే ఎవరై ఉంటారని ఈ అద్దెకున్న అతను చూసేసరికి పొద్దున్నే గేటు ముందట ఆడుక్కోవడానికి వచ్చిన ఆ స్త్రీయే. హృదయాన్ని కలచివేసే కథ.

'నషా' ఈ కథ అందరి మనసులను ఆలోచింపజేసే కథ. తాగుడుకు బానిసైతే కుటుంబం ఎంత నష్టపోతుంది అదే తాగుడు బంద్ చేస్తే కుటుంబం ఎంత బాగుంటుంది అని తెలియజేసే కథ. ఈ కథను కుల మతాల చట్రంలో ఇరుక్కుని మత విద్వేషాలు పెంపొందించే వారికి కనువిప్పు కలిగించే విధంగా, అందరూ సమానమే అని తెలియజేస్తూ కులమతాల పట్టింపు లేకుండా కోపతాపాలు మరిచి



> కథలన్నీ తెలంగాణ యాసలోనే కొనసాగుతాయి. ప్రతి కథ మన చుట్టూరా జరిగిన సన్నివేశాలు మన కళ్ళ ముందు కదలాడినట్టు ఆ కథలో మనము ఉన్నట్టు అనిపిస్తుంది. కథలో ఎక్కడా కూడా వివక్షకు గాని మత విద్వేషాలు గానీ వాటి జోలికి పోకుండా మనుషుల మధ్య ప్రేమపూర్వకమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కొనసాగుతాయి.

మనుషుల్ని మనుషులుగా ప్రేమించాలి అని చాలా చక్కగా చెప్పే కథ.

కులాలు మతాలు ప్రాంతాలు కాదు మనిషిలోని మంచితనం గుర్తించడానికి. ఆపదలో ఉన్న వ్యక్తికి సహాయం చేయడమే మంచి కులం మంచి మతం అనిపించుకుంటుంది. దేవున్ని ఆరాధించడానికి వస్తువులో, మూగజీవాలనో లేక డబ్బునో సమర్పించడం కాదు కానీ పూర్ణ హృదయాన్ని దేవుని ముందట అర్పించడం. అదే కదా దేవునికి నిజమైన అర్పణ. మానవసేవయే మాధవసేవ అనే నానుడి నుండి చక్కని 'ఖుర్బాని' కథను రాశారు. ఈ కథలోని పాత్రలైనా బిలాల్, రాములమ్మ మరియు మల్లయ్య పాత్రలను చాలా చక్కగా ఎలివేట్ చేశారు. ఇంటి పక్కనే ఉన్న రాములమ్మను బిలాల్ సొంత అక్కలా భావిస్తాడు. రాములమ్మ బిడ్డ జయమ్మకు పురిటి నొప్పులు రావడంతో పెద్ద ఆసుపత్రికి వెళ్లి డెలివరీ చేయించుకోవడానికి డబ్బులు లేకపోవడంతో దీనంగా సాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో విషయం తెలుసుకున్న బిల్లాల్ తన దగ్గర డబ్బు లేకపోవడంతో బక్రీద్ కొరకు తీసుకొచ్చిన యాటపోతును అమ్మి మరికొంత డబ్బు తన దగ్గర ఉన్నది తీసుకొని బిలాల్, బిలాల్ భార్య తో కలిసి ఆటోలో రాములమ్మను మరియు జయమ్మను తీసుకొని పక్కన ఉన్న పటనానికి వెళ్లి ఆపరేషన్ చేపిస్తాడు. రాములమ్మ అన్న మల్లయ్య జరిగిందంతా తెలుసుకొని బిలాల్ చేసిన సహాయాన్ని గుర్తించి మంచి మనసుకు ఖుషీగా బిలాల్‌కి డబ్బిస్తాడు. ఇరువురు మధ్యన జరిగిన సంభాషణలు చదువుతున్నప్పుడు హృదయం ఎంతో బరువెక్కిపోతుంది. ఎంతో ఆర్ధత నిండిన కథ కుర్బానీ.



- గాజోజి శ్రీనివాస్, 9948483560

'ఉల్టా బాజా' కథలో గూడెంలో పుట్టి పెరిగి అనాథగా మిగిలిపోయిన మట్టన్న శవాన్ని దహన సంస్కారం చేయడానికి ఊర్లోని వారు ఎవరు కూడా ముందుకు రారు. తక్కువ కులంలో పుట్టాడని నెపంతో హిందూ స్మశాన వాటికలో కూడా బొంద పెట్టడానికి ఒప్పుకోరు ఊరి జనాలు. చివరికి చిన్ననాటి స్నేహితుడు గోరిమియా తన పొలంలోనే మట్టన్నకు ధహన సంస్కారాలు నిర్వహిస్తాడు. మట్టన్న పెంచుకున్న కుక్కపిల్ల మాత్రం మట్టన్న కోసం తల్లడిల్లడం చూస్తాం. ఈ కథలో కుక్కకున్న విశ్వాసం మనుషులకు లేదేమిటి అని ఎంతో చక్కగా కథనాన్ని నడిపించారు రచయిత.

పొట్టకూటి కోసం హిజ్రాలుగా మారుతున్న ఎంతోమంది గురించి, జీవనోపాధి కొరకు ఊరిలో సరియైన అవకాశాలు లేక నగరానికి వస్తున్న నిరుద్యోగ యువత, అనాథల జీవితాలను బేస్ చేసుకొని వ్యంగంగా రాసిన కథే 'మాసిపోని మరకలు'. మరో సామాజిక అంశం అయినా గూడెం బతుకుల గురించి రాసిన కతే 'పరిష్కారం'. గూడెంలో ఇప్పటికి ఆ గుడిసెల్లోనే ఎందుకు వారి జీవితాలు మగ్గిపోతున్నాయి అని, దీనంతటికీ సరియైన విద్య లేకపోవడం మరియు ఎలక్షన్లలో ఓటుకు నోటుకో లేదా మద్యానికో అమ్ముడుపోయి వారికి ఓట్లేయడమే కారణమంటూ బతుకులు మారాలంటే విద్య మరియు సరైన నాయకున్ని ఎన్నుకోవడమే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది అని మంచి సామాజిక అంశాన్ని ఎత్తుకొని కథను రాశారు.


"మూడో నెల" ఈ కథ భలే ఉంటది. మొదటగా సీరియస్ గానే కథ మొదలవుతుంది. లోకనాథం అలివేలుకి పెళ్లయి 15 సంవత్సరాలు అయినా పిల్లలు కాకుండా పోవడంతో ఇద్దరిలో పిల్లలు కాలేరు అనే బాధ ఉంటుంది. అలివేలు పక్కింటి ఆవిడతో ఒకరోజు మూడో నెల అని చెబుతుండడం విన్న లోకనాథం నాకు చెప్పకుండా పక్కింటి ఆవిడకి చెప్పిందని బాధకు గురవుతాడు. ఉన్నట్టుండి మూడు రోజులు లోకనాథం కనిపించకపోవడంతో అలివేలులో దుఃఖ%శీ% మొదలవుతుంది. చుట్టాలందరూ వచ్చి ఇంట్లో చేరుతారు. పోలీస్ స్టేషన్లో కూడా కంప్లైంట్ చేస్తారు. ఇంటినిండా చుట్టాలు తెలిసిన వారందరూ టెన్షన్ కి గురవుతుండగా దేవుని మాల వేసుకుని లోకనాథం ఇంటికి వస్తాడు. అందరూ ఆశ్చర్యపోయి ఎటు వెళ్ళావని లోకనాథం పై కోపంకి వస్తారు. జరిగినదంతా లోకనాథం అలివేలు చెప్పడంతో అందరి ముఖాలలో నవ్వులు పూస్తాయి. అసలు మూడో నెల అంటే ఆ మూడో నెల కాదు కానీ పోస్ట్ ఆఫీస్ లో 'సమృద్ధి యోజన పథకంలో' చేరి మూడు నెలలు అవుతుంది అని చెప్పడంతో సీరియస్ గా సాగుతున్న కథ, హాస్యభరిత కథగా ముగుస్తుంది. బండి కదిలింది, రంగుల వల, కలవరింత, ఒకనాటి మాట కాదు మొదలైన చాలా కథలు వైవిధ్యంగా వున్నాయి.

ఈ పుస్తకంలోని కథలన్నీ తెలంగాణ యాసలోనే కొనసాగుతాయి. ప్రతి కథ మన చుట్టూరా జరిగిన సన్నివేశాలు మన కళ్ళ ముందు కదలాడినట్టు ఆ కథలో మనము ఉన్నట్టు అనిపిస్తుంది. కథలో ఎక్కడా కూడా వివక్షకు గాని మత విద్వేషాలు గానీ వాటి జోలికి పోకుండా మనుషుల మధ్య ప్రేమపూర్వకమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కొనసాగుతాయి. సమాజాన్ని ఎంతో ఆలోచింప చేసే విధంగా ఈ కథలను రాసిన సయ్యద్ గఫార్‌కు అభినందనలు.

యువతకి మార్గ దర్శక 'కరచాలనం'

వారాల ఆనంద్ 'కరచాలనం', పేరుని సార్థకం చేసుకుంటూ ఇరవయి ఏడుమంది గొప్ప సాహితీవేత్తలతో మనం కూడా కరచాలనం చేసేలా చేస్తుంది. ఇందులో కొన్ని విన్న పేర్లు, కొన్ని తెలిసిన పేర్లు, కొన్ని అసలు తెలియని పేర్లు. విన్నవీ, తెలిసినవీ కూడా ఒక సినిమా డైరెక్టర్ అనో, ఒక నటి అనో, ఒక కవి అనో, ఒక గాయకుడు అనో మాత్రమే తప్ప, ఎవరి గురించీ లోతుగా తెలియదు చాలామందికి. ఈ 'కరచాలనం' ఆ పదానికే కొత్త అర్థాన్ని చెబుతూ అందరితోటీ కరచాలనం చేసేలా చేస్తుంది. మనం విన్న, తెలుసు అనుకున్న పేర్ల వెనుక ఇన్ని కథలున్నాయా, ఒక్కొక్కరిలో ఇంత ప్రత్యేకమైన, ఉన్నతమైన వ్యక్తిత్వం ఉంటుందా అనిపించింది ఈ పుస్తకం చదువుతున్నంత సేపు. ఎవరికీ వారే సాటి.

గుల్జార్ తన రచన 'Actually I Met Them' లో చెప్పినట్టు, ఆనంద్ actually met all these personalities he mentioned in his book. 'కరచాలనం అంటే చేతులు కలపటం మాత్రమే కాదు, కలవటం అనేది వ్యక్తిగతంగానే అవాలనీ లేదు. ఎంతో మంది వ్యక్తుల గురించి వ్యక్తిగతంగా కలువకుండానే మనం వింటూ ఉంటాం. మనకి ఇంట్రెస్టింగా అనిపించిన వారి గురించి తరచి చూసి మరెంతో తెలుసుకునే ప్రయత్నం చేస్తాం. వారి వ్యక్తిత్వానికి సలాం చేస్తాం. మనసులో ముద్రించుకుంటాం కూడా. గుల్జార్ ఇన్‌స్పిరేషనేనేమో తన పుస్తకాన్ని ఆనంద్ గుల్జార్ పరిచయం తోటే ప్రారంభించారు.



అలా తనకి నచ్చిన కవితలను అనువాదం చేస్తూ, అంత గొప్ప కవితలను రాసిన ఆ కవుల గూర్చి మరింత తెలుసుకుంటూ వారితో కరచాలనం చేసారు ఆనంద్. అక్కడితో ఊరుకోకుండా, ఈ పుస్తకం ద్వారా మన అందరితో కూడా కరచాలనం చేపించారు.

సాధారణంగా ఒక్కొక్కరు ఒక్కో రంగంలో నిష్ణాతులై ఉంటారు. ఈ 'కరచాలనం'లో పేర్కొన్న సాహితీవేత్తలందరు బహుముఖ ప్రజ్ఞాశాలులే. కవనం, కథనం, గానం, దర్శకత్వం, ఇలా ఎన్నో రంగాలలో నిపుణతకలిగినవారు కనపడతారు ఇక్కడ. కొంతమంది సినీ రంగంలో రాణించిన వారయితే, మరి కొంతమంది సాహిత్య రంగంలో రాణించినవారు. మరి కొందరు రెండు రంగాల్లోను పేరు గడించి, వివిధ రూపాలలో తమ సృజనను ప్రదర్శిస్తూ తమదైన ముద్ర వేసుకున్న వారు ఈ పుస్తకంలో కనపడతారు.



- అనురాధ బొడ్ల (సముద్రాల)
9989566696

ఇందులో ఒక్కొక్క సాహితీ వేత్తను గూర్చి చదువుతుంటే భూపేన్ హజారికాను గురించి చదవగానే.. 'దిల్ హూం హూం' అనకుండా ఉంటుందా! కవి ప్రదీప్‌ను గురించి చదవగానే.. 'చల్ చల్ రే నవ్ జవాన్' అంటూ కాళ్ళు లెఫ్ట్ రైట్ కొట్టకుండా ఉంటాయా! సాహిర్ లుధియాన్వీని గురించి చదవగానే "మై పల్ దొ పల్ కా షాయిర్ హూ" అని మది పాడకుండా ఉంటుందా!

భూపేన్ హజారికా, కవి ప్రదీప్, సాహిర్ లుధియాన్వీ ఇలా కొంతమందిని గురించి చదివినప్పుడు, ఎక్కడో జ్ఞాపకాలలో మరుగున పడ్డ పాటలు తలపునకు వచ్చి ఆ పాటలు వినాలనిపించింది. అలా ఒక రోజుకి ఒక కవిని మాత్రమే చదవగలిగాను.

అలాగే అమృతాప్రీతంను చదివితే... స్త్రీ పురుషుల మధ్య ప్రేమకు కొత్త నిర్వచనం వినపడుతుంది. దీప్తి నావెల్‌ను చదివితే, ఆమె జ్ఞాపకాల చిత్రణలో ఏ మొహమాటాలు లేని తన బాల్యం కనిపిస్తుంది.

మమంగ్ దాయి ని చదివితే, ఒక ట్రైబల్ జాతిలో జన్మించి, ఐ.ఏ.ఎస్ ను వదులుకుని సాహిత్యానికే పెద్ద పీట వేసిన ధీర వనిత కనిపిస్తుంది

'యుద్ధం వాయిదా వేస్తేనే మంచిది' అన్న సాహిర్ లుధియాన్వీ కవిత, 'తల్లి చిత్రం' అన్న మంగలేష్ దబ్రాల్ కవిత, ఇసుక - నురుగు అన్న ఖలీల్ జిబ్రాన్ కవిత అన్నీ ఆణిముత్యాలే.

వీరి అనువాదాలు నాకు ఇతర భాషా సాహిత్యాలను పరిచయం చేశాయి. ఆంగ్లంలో మంచి ప్రవేశం ఉండి కూడా మాతృభాషలోనే రాసిన సీతాకాంత్ మహాపాత్ర ఆశ్చర్యం కలిగిస్తారు. తన మాతృభాష డోగ్రీకి అధికారభాషగా గుర్తింపుకి కృషి చేసిన పద్మాసచ్ దేవ్ ప్రయత్నం అభినందనీయం. జానపద గేయాలను పాడుతూ ప్రకృతి కవిగా పేరుపొందిన హల్దార్ నాగ్, ఒక అద్భుతం. వీరందరిని గురించి తెలుసుకునే అవకాశం ఇచ్చింది ఈ 'కరచాలనం'.

ఇప్పటికీ కొన్ని కుటుంబాలలో స్త్రీ విద్యకి ప్రాముఖ్యం ఇవ్వకుండా అమ్మాయి పెద్దదైన వెంటనే వివాహం చేసేద్దాం అనుకునే కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాటిది, 50, 70, 80వ దశకంలోనే ఉన్నత విద్యను అభ్యసించి, సాహితీ కిరీటాలు ధరించిన అమృతా ప్రీతమ్, సుగతకుమారి, దీప్తినావల్ వంటి స్త్రీ మూర్తులూ కనపడతారు ఇక్కడ.

ఇరవయి ఏడుమంది గొప్ప సాహితీవేత్తలతో పాటు ఒడిస్సా వాసుల జీవన విధానం, బోడో జాతి తెగల వైవిధ్య జీవన విధానం, వారి జీవితాల చుట్టూ అల్లుకున్న సాహిత్యం గురించి కూడా ఇక్కడ పరిచయం చేసారు ఆనంద్.

అట్టడుగు వర్గం నుంచి వచ్చి, ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొంటు కూడా సాహితీ శిఖరాలను చేరుకున్నవారున్నారు. జీవితం అందరికీ ఒక పోరాటమే. మెకానిక్ షాపులో పని చేస్తూ, కిరాయికి పుస్తకాలు తెచ్చుకుని చదువుతూ ఎదిగిన గుల్జార్. మూడవ తరగతి వరకే చదువుకుని, తండ్రిని కోల్పోయి, చిన్నా చితకా పనులు చేస్తూ కూడా తరువాతి కాలంలో ఒరియా నేర్చుకుని, కోసలి భాషలో కవితా సృష్టి చేసిన హల్దార్ నాగ్. టి.బి వ్యాధితో ఆప్తులైనవారిని పోగొట్టుకున్న కున్వర్ నారాయణ్. ఇలాంటి చరితలు యువతకి మార్గ దర్శకమవుతాయి, మోటివేషనల్ స్పీకర్స్‌కి మంచి ఉదాహరణలు దొరుకుతాయి. అలా ఈ పుస్తకమొక ఒక మోటివేషనల్ గైడ్‌గా కూడా పని చేస్తుంది అనిపించింది నాకు.

కరచాలనం అన్న పదానికి విస్తృతమైన అర్థాన్ని సూచించిన ఈ పుస్తకం, భారత దేశానికి చెందిన, వివిధ కాలాల, వివిధ ప్రాంతాల భాషా సంస్కృతులను, వివిధ సాహితీకారుల వ్యక్తిత్వ చిత్రణనూ మన ముందు ఉంచింది. ఎందరో లివింగ్ లెజెండ్స్‌ని పరిచయం చేసింది.

జీవన గతులను సజీవంగా ఆవిష్కరించిన నవల



పేదింటి పిల్ల దుర్గ. ఆటలు, పాటల్లో మునిగే వయసు. తమ్ముడు అపూను తీసుకుని సంపన్నుల ఇంటి ముందుకు వెళ్లింది. నేతిలో పూరీలు వేయించి అమ్మేవాడు ఊళ్లోకి వచ్చాడు. వాడి దగ్గర ఆ ఇంటివాళ్లు పూరీలు కొంటున్నారు. నోరూరించే పూరీలు.. ఘుమఘుమలాడే పూరీలు.

దుర్గకీ, అపూకీ వాటిని తినాలని ఉంది. కానీ కొనాలంటే డబ్బేదీ? వాళ్లది కలిగిన కుటుంబం కాదాయె! తండ్రి హరిహరరాయ్‌కి వచ్చే కాసింత సంపాదనలో తల్లి సర్వజయ గుట్టుగా సంసారాన్ని లాక్కొస్తుంది. నలుగురు మనుషుల్ని పోషించడానికి అది ఏ మూలకి? ఇంక ఇలాంటి చిరుతిళ్లకు డబ్బులిమ్మంటే ఇస్తుందా? అందుకే ఆశగా ఆ ఇంటివారు తమను పిలిచి, తమకూ ఏమైనా పెడతారేమోనని చూస్తూ ఉన్నారు. ఆ పిల్లలు మరింత హెచ్చులు పోతూ లొట్టలేసుకుని తింటూ ఊరిస్తున్నారు.

పేదవారికి ఆరాటం.. కలిగిన వారికి చెలగాటం. ఈ పేద పిల్లల కళ్లు పడి దిష్టి తగులుతుందని అనుకుందో ఏమో, ఆ ఇంటి పెద్దావిడ ఒక్కసారిగా గట్టిగా కసిరింది. పిల్లలు లోపలికి వెళ్లారు. ఆ గసిరింపు తమకేనని అర్థమయ్యే వయసు అపూకు లేదు. కానీ దుర్గకి అర్థమైంది. అక్కడి నుంచి లేచి వచ్చేసింది. చిన్నబుచ్చుకున్న తమ్ముణ్ని సముదాయించాలనుకుంది.

'ఆ పూరీలు ఒట్టి నాసిరకం సరుకు. ఈసారి పండగకు నాన్ననడిగి రెండ్రూపాయలు తీసుకుంటాను. ఎంచక్కా మిఠాయిలు కొనుక్కొని తినొచ్చు' అంది. ఆ మాట వింటే తన తమ్ముడి మనసులో బాధ పోయి, ముఖంలో నవ్వు మెరుస్తుందని ఆ పిచ్చిపిల్ల ఆశ. అక్క చెప్పిన మాట వినగానే అపూ ముఖంలో కొంత వెలుగు కనిపించింది. అక్కతో కలిసి అడుగులేస్తూ కాసింత దూరం పోయాక 'పండగ ఎప్పుడొస్తుందక్కా?' అని అమాయకంగా అడిగాడు. నాకు చాలా ఇష్టమైన 'పథేర్ పాంచాలీ' నవలలో ఒక సన్నివేశం ఇది. 1929లో బెంగాలీ రచయిత బిభూతి భూషణ్ బందోపాధ్యాయ రాసిన నవలను మద్దిపట్ల సూరి తెలుగులోకి అనువదించారు. ఆయన అనువాదం ఎంత బాగుంటుందంటే, ఇది బెంగాలీ అనువాద నవల అని అనడానికి మనకు మనసు రానంత. 'పథేర్ పాంచాలీ' అంటే 'బాట పాడిన పాట' అని అర్థం.



స్వాతంత్ర్య పూర్వం బెంగాల్ ప్రాంతంలో నిశ్చిందిపురం అనే ఊరిలో ఓ నిరుపేద కుటుంబం కథే ఈ నవల. హరివంశరాయ్, భార్య సర్వజయ, పిల్లలు దుర్గ, అపూ.. ఇవీ వారి కుటుంబం. ఆ పిల్లల మేనత్త ఇందిర కూడా ఈ నవలలో కనిపిస్తుంది. అపూ పుట్టిన కొంతకాలానికి వృద్ధాప్యంతో ఆమె కాలం చేస్తుంది. దారిద్ర్యం కారణంగా ఆ ఇంటి మనుషులు పడ్డ ఇబ్బందులు, వారి ప్రేమలు, వారికి పరిచయమయ్యే మనుషులు, వారికి ఎదురైన అనుభవాలు ఇవన్నీ ఈ నవలలో బిభూతి భూషణ్ పొందుపరిచారు. పల్లెజీవనాన్ని, అక్కడి ప్రజల మనస్తత్వాలను గమనించడానికి ఈ నవల కొంత తోడ్పడుతుంది.



దుర్గ, అపూ.. ఇద్దరూ చిన్నపిల్లలు. బీదరికం వారి కుటుంబానికే కానీ, వారి ఆశలకు, ఆకాంక్షలకు కాదు. ఆ చిన్నఊరే వారి ప్రపంచం. అక్కడ నేర్చుకున్న విషయాలే వారికి లోకజ్ఞానం. అపూ, దుర్గలకు జరిగే ప్రతి అనుభవాన్ని రచయిత ఎంత చక్కగా రాశారంటే, ఇప్పటికిప్పుడు వెళ్లి వారిని చూడాలన్న ఆరాటం మనసులో చెలరేగుతుంది. డబ్బు లేని ఒకే ఒక్క కారణంతో మనసులోనే వారు దాచుకున్న ఆశలను తెలుసుకొని బాధగా అనిపిస్తుంది. రైలు చూడాలన్న కోరిక తీరకుండానే, జ్వరంతో దుర్గ మరణించిన సన్నివేశం చదువుతూ ఉంటే దు:ఖం పొంగుకొస్తుంది. అంత ఆపత్కాలంలో దుర్గ తండ్రి ఆ ఇంట్లో లేకపోవడం, దుర్గకు మందుమాకూ ఇప్పించలేక తను మరణించడం తల్చుకున్నప్పుడల్లా మనసు వేదనతో నిండిపోతుంది.

మనసును మెలిపెట్టే అంశాలతోపాటు హృదయాన్ని ఉల్లాసపరిచే అంశాలు కూడా ఈ నవలలో ఉన్నాయి. జీవితమంటే కన్నీళ్లు, నవ్వులు ఉన్నట్టే, ఈ నవల కూడా రెండింటినీ మిళితం చేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఇక ఆ ఊరిలో జీవించలేక హరిహరరాయ్, సర్వజయ, అపూ కాశీకి వెళ్లడం, అక్కడ అనారోగ్యంతో హరిహరరాయ్ మరణించడం, ఆ తర్వాత ఓ ధనవంతుల ఇంటికి సర్వజయ వంటమనిషిగా వెళ్లడం, తల్లి వెంట అపూ వెళ్లడం, అక్కడి అనుభవాలతో నవల ముగుస్తుంది. ఈ నవలకు కొనసాగింపుగా 1932లో బిభూతిభూషణ్ 'అపరాజితో' అనే నవల రాశాను. అపూ పెద్దవాడైన తర్వాత జరిగిన అనుభవాలతో కూడిన కథ అందులో ఉంటుంది.

ఈ నవల ఇప్పటికి ఓ 30 సార్లు చదివి ఉంటాను. చదివిన ప్రతిసారీ కొత్తగా అనిపిస్తుంది. కొత్త విషయమేదో కనిపిస్తుంది. వారి జీవితాల్లోని వేదన, ఆనందం, అవమానం, ప్రేమ, ఆప్యాయతలు హృదయాన్ని పరిపూర్ణం చేస్తుంటాయి. సర్వమానవులను ప్రేమించి, ఆదరించే గుణాన్ని తట్టి లేపుతాయి. నా ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దిన నవల ఇది. అందుకే ఈ పుస్తకం అంటే నాకు చాలా ఇష్టం.

- వి.సాయివంశీ

కపిలవాయి లింగమూర్తి పురస్కారాలు

కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం నిర్వహణలో డా॥ కపిలవాయి లింగమూర్తి పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈరోజు హైదరాబాద్ రవీంద్రభారతి సెమినార్ హాల్లో సాయంత్రం 5.30 గంటలకు జరుగుతుంది. కపిలవాయి లింగమూర్తి మీనాక్షమ్మల సాహిత్య పురస్కార గ్రహీతలు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి (2023), డా. కొల్లోజు కనకాచారి (2024), కపిలవాయి కిశోర్ బాబు భార్గవీ దేవీల సాహిత్య పురస్కార గ్రహీతలు వల్లభాపురం జనార్దన (2023), వనపట్ల సుబ్బయ్య (2024).

- కపిలవాయి అశోక్ బాబు

బీసీ వాద కవిత్వానికి ఆహ్వానం

బీసీ అస్తిత్వ, సాంస్కృతిక, రాజకీయవాదాన్ని బలపరుస్తూ బీసి కవుల నుండి వచన కవితలకు ఆహ్వానిస్తున్నాం. కవితలను 15, ఏప్రిల్ 2025 లోపు bcsahityavedika2025@gmail.com వాట్సప్ నెంబర్ 9492765358కు పంపించగలరు. బీసీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి బీసీ సాహిత్య సదస్సులో సంకలనంగా ప్రచురించి ఆవిష్కరిస్తాం.

- వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్

ధనాధన్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఐపీఎల్18లో వరుసగా రెండో పరాజయం ఎదురైంది. టాప్ ఆర్డర్ వైఫల్యంతో మరోసారి స్వల్ప స్కోరుకు పరిమితమైన సన్‌రైజర్స్.. విశాఖ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో 7 వికెట్ల తేడాతో ఓటమి చెందింది. మిచెల్ స్టార్క్ (5/35), కుల్దీప్ యాదవ్ (3/22) ఎనిమిది వికెట్ల మాయజాలం సన్‌రైజర్స్‌ను చిత్తు చేసింది. విశాఖలో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది.

స్టార్క్, కుల్దీప్ మాయ

- సన్‌రైజర్స్‌కు వరుసగా రెండో ఓటమి
- అనికెత్ వర్మ ధనాధన్ ఇన్నింగ్స్ వృథా

7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు

నవతెలంగాణ-విశాఖపట్నం

టాప్ ఆర్డర్ వైఫల్యం. స్వల్ప స్కోరుకు పరిమితం. ఖాతాలో మరో ఓటమి. ఇదీ సన్‌రైజర్స్ హైదరాబాద్ కథ. బిగ్ హిట్టర్లు అభిషేక్ శర్మ (1), ఇషాన్ కిషన్ (2), నితీశ్ కుమార్ రెడ్డి (0) సహా ట్రావిశ్ హెడ్ (22, 12 బంతుల్లో 4 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (32, 19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) అంచనాలను అందుకోలేదు. యువ బ్యాటర్ అనికెత్ వర్మ (74, 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) సూపర్ అర్థ సెంచరీతో కదం తొక్కటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ మిచెల్ స్టార్క్ (5/35) ఐదు వికెట్ల ప్రదర్శనతో విజృంభించగా.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/22) మూడు వికెట్లతో మాయ చేశాడు. ఛేదనలో డుప్లెసిస్ (50, 27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (38, 32 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పోరెల్ (34 నాటౌట్, 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా 16 ఓవర్లలోనే ఢిల్లీ క్యాపిటల్స్ 166/3 పరుగులు చేసింది. 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో జీషాన్ అన్సారీ (3/42) మూడు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్18లో మూడు మ్యాచుల్లో సన్‌రైజర్స్‌కు రెండో పరాజయం కాగా.. రెండు మ్యాచుల్లో క్యాపిటల్స్‌కు ఇది రెండో విజయం. ఐదు వికెట్ల వీరుడు మిచెల్ స్టార్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అలవోకగా..

164 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు మెక్‌గుర్క్ (38), డుప్లెసిస్ (50) తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించారు. డుప్లెసిస్ అర్థ సెంచరీతో మెరువగా.. మెక్‌గుర్క్ నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో దూకుడు ప్రదర్శించాడు. పదో ఓవర్ వరకు ఒక్క వికెట్ కోల్పోని క్యాపిటల్స్ మ్యాచ్‌ను గుప్పిట్లోకి తీసుకుంది. ఓపెనర్లు సహా కెఎల్ రాహుల్ (15) నిష్క్రమించినా.. అభిషేక్ పోరెల్ (34 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (21 నాటౌట్, 14 బంతుల్లో 3 ఫోర్లు) లాంఛనం ముగించారు. కొత్త బంతితో పాట్ కమిన్స్ (0/31), మహ్మద్ షమి (0/27) నిరాశపరిచారు. ఆరేండ్ల తర్వాత ఐపీఎల్‌లో ఆడుతున్న జీషన్ అన్సారీ మూడు వికెట్లతో మెరిసినా.. అప్పటికే మ్యాచ్ క్యాపిటల్స్ చేతుల్లోకి వెళ్లిపోయింది. మరో 24 బంతులు ఉండగానే ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది.

టాప్ లేచింది

మిచెల్ స్టార్క్ మరోసారి సన్‌రైజర్స్‌ను



కకావికలం చేశాడు. కొత్త బంతితో నిప్పులు చెరిగిన స్టార్క్ ముగ్గురు కీలక బ్యాటర్లను సాగనంపాడు. తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (1) రనౌట్‌తో నిరాశపరచగా.. ఇషాన్ కిషన్ (2), నితీశ్ కుమార్ రెడ్డి (0), ట్రావిశ్ హెడ్ (22)లు స్టార్క్ ట్రాప్‌లో పడ్డారు. లోకల్ హీరో నితీశ్ కోసం అభిమానుల కేకలు వేసినంత సేపు సైతం అతడు క్రీజులో నిలువలేదు. 4.1 ఓవర్లలో 37/4తో సన్‌రైజర్స్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది.

నిలబెట్టిన అనికెత్, క్లాసెన్

ప్రతికూల పరిస్థితుల్లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడు మంత్ర వీడలేదు. యువ బ్యాటర్ అనికెత్ వర్మ (74)తో జతకట్టిన హెన్రిచ్ క్లాసెన్ (32) ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నిర్మించాడు. 42 బంతుల్లో 77 పరుగులు జోడించారు. ఈ ఇద్దరు క్రీజులో ఉండగా 9.1 ఓవర్లలోనే సన్‌రైజర్స్ 100 పరుగుల మార్క్ చేరుకుంది. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో మెరిసిన అనికెత్ వర్మ అర్థ సెంచరీతో ఆకట్టుకున్నాడు. క్రీజులో కుదురుకున్న క్లాసెన్ విధ్వంసం ఆరంభం అవుతుండగానే.. వికెట్ కోల్పోయాడు. దీంతో సన్‌రైజర్స్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాయతో అభినవ్ మనోహర్ (4), పాట్ కమిన్స్ (2) సహా అనికెత్ వర్మ నిష్క్రమించారు. వియాన్ ముల్డర్ (9), హర్షల్ పటేల్ (5) నిరాశపరిచారు. 18.4 ఓవర్లలోనే సన్‌రైజర్స్ 163 పరుగులకు కుప్పకూలింది. మిచెల్ స్టార్క్, కుల్దీప్ యాదవ్‌లు 46 బంతుల్లో 57 పరుగులిచ్చి ఏకంగా 8 వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్‌ను దారుణంగా దెబ్బతీశారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్ : 163/10 (అనికెత్ వర్మ 74, హెన్రిచ్ క్లాసెన్ 32, మిచెల్ స్టార్క్ 5/35, కుల్దీప్ యాదవ్ 3/22)

ఢిల్లీ క్యాపిటల్స్ : 166/3 (డుప్లెసిస్ 50, మెక్‌గుర్క్ 38, అభిషేక్ పోరెల్ 34, జీషన్ అన్సారీ 3/42)



హార్దిక్‌కు జరిమానా

స్లో ఓవర్‌రేట్ ఫలితం

అహ్మదాబాద్ : ఐపీఎల్18లో వరుస పరాజయాలతో సతమతం అవుతున్న ముంబయి ఇండియన్స్.. స్లో ఓవర్‌రేట్ కారణంగా జరిమానా ఎదుర్కొంది. గత సీజన్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఈ ఏడాది తొలి మ్యాచ్‌కు దూరమైన ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య.. సారథిగా తొలి మ్యాచ్‌లోనే మళ్లీ అదే పద్ధతి కొనసాగించాడు. అహ్మదాబాద్‌లో శనివారం గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ నిర్ణీత సమయంలో 20 ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. దీంతో కెప్టెన్‌పై ఐపీఎల్ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నాడు. ఐపీఎల్ నియమావళి ప్రకారం హార్దిక్ పాండ్యకు మ్యాచ్ ఫీజులో రూ.12 లక్షల జరిమానా విధించారు. శనివారం మ్యాచ్‌లో తొలుత టైటాన్స్ 196/8 పరుగులు చేయగా.. ముంబయి ఇండియన్స్ 160/6 పరుగులే చేసింది.

ఇదిలా ఉండగా తొలి రెండు మ్యాచులను ప్రత్యర్థి వేదికలపై ఆడిన ముంబయి ఇండియన్స్.. సీజన్లో తొలిసారి సొంతగడ్డపై సమరానికి సిద్ధమవుతోంది. నేడు ముంబయి వాంఖడే స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్‌తో ముంబయి ఇండియన్స్ తలపడనుంది. కోల్‌కత నైట్‌రైడర్స్ రెండు మ్యాచుల్లో ఓ విజయం సాధించగా.. ముంబయి ఇండియన్స్ రెండు పరాజయాలు చవిచూసి తొలి విజయం కోసం ఎదురుచూస్తుంది.

రాయల్స్ మురిసింది

సూపర్‌కింగ్స్‌పై రాజస్థాన్ విజయం



గువహటి : చెన్నై సూపర్‌కింగ్స్‌కు మరో ఓటమి తప్పలేదు. పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో ఐదు సార్లు చాంపియన్ వరుసగా రెండో మ్యాచ్‌లో భంగపడింది. 183 పరుగుల ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులే చేసింది. రాజస్థాన్ రాయల్స్ 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఐపీఎల్18లో మూడు మ్యాచుల్లో చెన్నైకి ఇది రెండో ఓటమి కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు ఇదే తొలి విజయం. నితీశ్ రానా (81, 36 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్స్‌లు), రియాన్ పరాగ్ (37, 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో తొలుత రాయల్స్ 182/9 పరుగులు చేసింది. ఛేదనలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (63, 44 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (32 నాటౌట్, 22 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్) రాణించినా ఆ జట్టుకు నిరాశ తప్పలేదు. ఆఖరు ఓవర్లో విజయానికి 20 పరుగులు అవసరం కాగా ఎం.ఎస్ ధోని (16) వికెట్ కోల్పోయిన సూపర్‌కింగ్స్ 13 పరుగులే చేసింది.

మహిళల సింగిల్స్ వరల్డ్ నం.1 అరీనా సబలెంక (బెలారస్) మయామీ ఓపెన్ చాంపియన్‌గా అవతరించింది. 26 ఏండ్ల సబలెంక ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అమెరికా క్రీడాకారిణి జెస్సికా పెగులా (31)పై వరుస సెట్లలో విజయం సాధించింది. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన సబలెంక మయామీలో తొలిసారి టైటిల్ సొంతం చేసుకుంది.

చాంపియన్ సబలెంక

- ఫైనల్లో జెస్సికా పెగులాపై గెలుపు
- మయామీ ఓపెన్ టెన్నిస్ 2025

మయామీ (యుఎస్ఏ)



బెలారస్ భామ, మహిళల సింగిల్స్ వరల్డ్ నం.1 అరీనా సబలెంక మయామీ ఓపెన్‌లో తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్, ఇటీవల ముగిసిన ఇండియన్‌వెల్స్ మాస్టర్స్ ఫైనల్స్‌లో పరాజయం చవిచూసిన అరీనా సబలెంక.. మయామీ ఓపెన్‌లో ఆఖరు పంచ్ గట్టిగా ఇచ్చేసింది. నాల్గో సీడ్, అమెరికా స్టార్ జెస్సికా పెగులాపై వరుస సెట్లలో విజయం సాధించింది. మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం చేసుకుంది. 7-5, 6-2తో జెస్సికా పెగులాపై విజయం సాధించిన సబలెంక కెరీర్ 19వ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. వరుస ఫైనల్స్‌లో భంగపడిన సబలెంకకు మయామీ ఓపెన్‌లోనూ గట్టి సవాల్ ఎదురైంది. అమెరికా అమ్మాయి జెస్సికా పెగులా తొలి సెట్లోనే ఏకంగా మూడుసార్లు సబలెంక సర్వ్‌ను బ్రేక్ చేసింది. అయినా, నిలదొక్కుకుని పుంజుకున్న అరీనా సబలెంక అదరగొట్టే ప్రదర్శన చేసింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ మార్సెలో, పావిచ్ జోడీ గెలుపొందింది. 7-6(7-3), 6-3తో ఆరో సీడ్ బ్రిటన్ ఆటగాళ్లపై గెలుపొంది టైటిల్ సాధించారు.

నువ్వా.. నేనా

మహిళల సింగిల్స్ ఫైనల్స్ ఉత్కంఠగా సాగటం అరుదుగా చూస్తాం. అందులో మయామీ ఓపెన్ టైటిల్ పోరు ఒకటి. రెండో సెట్‌లో సబలెంక ఆధిపత్యం కనిపించినా.. తొలి సెట్లో జెస్సికా పెగులా అద్భుతంగా పోరాడింది. అరీనా సబలెంక బలమైన సర్వీస్‌కు పెట్టింది పేరు. అటువంటిది, సబలెంక సర్వ్‌ను ఏకంగా మూడు సార్లు బ్రేక్ చేసింది పెగులా. సబలెంక 6-5తో ఉండగా.. కీలక సర్వ్‌ను బ్రేక్ చేసింది. తొలి సెట్లో సబలెంక సైతం మూడు బ్రేక్ పాయింట్లు సాధించింది. ఒత్తిడితో కూడిన రెండో సెట్లో జెస్సికా పెగులా పోరాడినా ఫలితం లేకపోయింది. ఓ బ్రేక్ పాయింట్‌తో మెరిసినా.. సబలెంక ఏకంగా నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. 6-2తో రెండో సెట్‌ను, మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 3 ఏస్‌లతో మెరిసిన సబలెంక పాయింట్ల పరంగా 74-55తో పెగులాపై పైచేయి సాధించింది. 'అంతిమంగా ఫైనల్లో నా ఉత్తమ ప్రదర్శన చేయగలుగుతున్నాను. నా ఆట, ప్రదర్శన పట్ల ఎంతో సంతోషంగా ఉన్నాను. మరో ఫైనల్లో ఓటమి చవిచూడాలని అనుకోలేదు. టైటిల్ పోరులో రన్నరప్‌గా నిలువటం అంత సులువు కాదు' అని సబలెంక తెలిపింది.

వంద కొడతాడా?

పురుషుల సింగిల్స్ ఫైనల్లో నొవాక్ జకోవిచ్ రికార్డు టైటిల్ ముంగిట నిలిచాడు. కెరీర్ 100వ ఏటీపీ టైటిల్‌కు జకోవిచ్ అడుగు దూరంలో ఉన్నాడు. నేడు మయామీ ఓపెన్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ ఆటగాడు జాకుబ్ మెన్సిక్‌తో జకోవిచ్ తలపడనున్నాడు. మయామీ ఓపెన్‌లో 37 ఏండ్ల జకోవిచ్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ప్రత్యర్థికి ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫైనల్‌కు చేరుకున్న జకోవిచ్‌ను నేడు జాకుబ్ మెన్సిక్ ఏ మేరకు నిలువరిస్తాడో చూడాలి. మయామీ ఓపెన్‌లో జకోవిచ్ టైటిల్ సాధిస్తే... టెన్నిస్ చరిత్రలోనే 100 టైటిళ్లు సాధించిన మూడో ఆటగాడిగా సెర్బియా యోధుడు నిలువనున్నాడు.

నవచిత్రం

చిరు, అనిల్‌రావిపూడి సినిమా షురూ..



అగ్ర కథానాయకుడు చిరంజీవి నటించిన సోషియో-ఫాంటసీ 'విశ్వంభర' విడుదలకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన దర్శకుడు అనిల్ రావిపూడితో ఓ సినిమా చేయబోతున్నారు.

ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌ను ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం అధికారికంగా పూజా కార్యక్రమంతో లాంచ్ చేశారు. చిరంజీవిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు హీరో వెంకటేష్ క్లాప్ ఇవ్వగా, నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో నిర్మాత నాగ వంశీ, యువి క్రియేషన్స్ విక్రమ్, దర్శకులు వశిష్ట, శ్రీకాంత్ ఓదెల, బాబీ, శివ నిర్వాణ, వంశీ పైడిపల్లి, మైత్రి నవీన్, రవి, శిరీష్, అశ్విని దత్, రామ్ ఆచంట, శరత్ మరార్, విజయేంద్రప్రసాద్, కెఎస్ రామారావు, కెఎల్ నారాయణ, సురేష్ బాబు, వెంకట సతీష్ కిలారు, జెమిని కిరణ్, చుక్కపల్లి అవినాష్, నిమ్మకాయల ప్రసాద్ వంటి చిత్ర పరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

హిలేరియస్ కామెడీ, ఫ్యామిలీ బేస్డ్ బ్లాక్‌బస్టర్‌లను రూపొందించే అనిల్ రావిపూడి హ్యూమర్ అండ్ హై ఎనర్జీతో కూడిన యాక్షన్ కంప్లీట్ ఎంటర్ టైనర్‌ని అందించడానికి సిద్ధమైయ్యారు. చిరంజీవిని ఫ్రెష్ అండ్ డైనమిక్ అవతార్‌లో ప్రెజెంట్ చేసే అద్భుతమైన స్క్రీన్‌ప్లేని స్వయంగా అనిల్ రావిపూడి రాశారు. నవ్వులు, భావోద్వేగాలను బ్లెండ్ చేసి మెమరబుల్ ఎంటర్ టైనర్‌ని అందించబోతున్నారు. ఇందులో శంకర్ వరప్రసాద్ అనేది చిరంజీవి పాత్ర పేరు. ఈ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - అనిల్ రావిపూడి, సంగీతం - భీమ్స్ సిసిరోలియో, డీవోపీ - సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ - ఎఎస్ ప్రకాష్, ఎడిటర్ - తమ్మిరాజు, రైటర్స్- ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - ఎస్ కృష్ణ.



పవర్‌ఫుల్ కథతో కొత్త చిత్రం

డైరెక్టర్ పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి వంటి డిఫరెంట్ క్రేజీ కాంబినేషన్‌లో ఓ పాన్ ఇండియా సినిమా తెరకెక్కనుంది. యూనిక్ స్టోరీ, గ్రిప్పింగ్ కథనంతో పూరి జగన్నాధ్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్. చార్మికౌర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. తెలుగువారికి ప్రత్యేకమైన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకి సంబంధించి అధికారిక ప్రకటన చేశారు.

ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్ ఫుల్ కథని రాశారు. ఇందులో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్, డిఫరెంట్ అవతార్‌లో చూడబోతున్నారు ఆడియన్స్.

ఈ మూవీ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్, చార్మి కౌర్ త్రయం ఆనందం, ఉత్సాహం సినిమా పట్ల వారి ఎగ్జైట్‌మెంట్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభమవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ పాన్-ఇండియా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

పూరి జగన్నాథ్ సినిమాలన్ని చాలా విభిన్నంగా ఉంటాయి. ఆయన తన సినిమాల్లోని హీరోలను చూపించే తీరు కూడా చాలా వైవిధ్యంగా ఉంటుంది. విజయ్‌సేతుపతి లాంటి విలక్షణ నటుడిని సైతం ఆయన తనదైన మార్క్‌తో సిల్వర్‌స్క్రీన్ మీద ప్రజెంట్ చేయబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అనగానే అందరిలోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది. కథ, కథనం, డైలాగ్స్‌తోపాటు విజువల్స్, మ్యూజిక్ పరంగా కూడా ఈ సినిమా ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. ఓ పవర్‌ఫుల్‌కథతో తెరకెక్కబోతున్న ఈ సినిమాని ఎక్కడా రాజీపడకుండా నిర్మించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో నటించే నటీనటులు, పని చేసే సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, నిర్మాతలు: పూరి జగన్నాథ్, చార్మి కౌర్, సీఈఓ: విషు రెడ్డి.

సరికొత్త లుక్‌లో శర్వానంద్



శర్వానంద్ తన మొట్టమొదటి పాన్ ఇండియా ప్రాజెక్ట్ (శర్వా 38)ని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. సంపత్ నంది దర్శకుడు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

1960ల చివరలో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో సెట్ చేయబడిన ఈచిత్రం ప్రేక్షకులకు మరపురాని అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రం హై-స్టేక్స్ పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది. శర్వా పాత్రను ప్రత్యేకంగా నిలబెట్టడానికి, టీమ్ బాలీవుడ్ స్టైలిస్టులు ఆలిమ్ హకీమ్, పట్టణం రషీద్‌ల నైపుణ్యాన్ని ఉపయోగించుకుంది. శర్వా మేకోవర్ ఇప్పటికే సంచలనం సృష్టిస్తోంది. తన న్యూ, బోల్డ్ హెయిర్ స్టయిల్ సినిమా1960ల కాలపు స్టయిల్‌ని ప్రజెంట్ చేస్తోంది.

ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషలలో సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: సంపత్ నంది, డిఓపీ: సౌందర్ రాజన్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె.



అభిషేక్ నామా

విజువల్ వండర్‌గా 'సేతు'

అద్భుతమైన కథలను ప్రేక్షకులు ముందుకు తీసుకురావడంలో నిర్మాత అభిషేక్ నామ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. తాజాగా ఆయన 'సేతు' అనే చిత్రాన్ని నిర్మించేందుకు సిద్ధమయ్యారు. దర్శకుడు హరికృష్ణ ఈ చిత్రానికి మరొక ప్రత్యేకతను జత చేస్తూ, ప్రేక్షకులను అలరించేలా మాత్రమే కాకుండా అద్భుతమైన క్యాలిటీతో విజువల్ వండర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

'పుష్ప, దసరా' వంటి బ్లాక్‌బస్టర్లకు తన అద్భుతమైన గ్రాఫిక్స్‌తో పాపులర్ విజువల్ ఎఫెక్ట్స్ ఆర్టిస్ట్‌గా హరికృష్ణ పేరొందారు. ఆయన ఈ సినిమాతో దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. రామాయణ కథా ప్రపంచాన్ని అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో బ్లెండ్ చేస్తూ ఒక కొత్త అనుభూతిని అందించబోతున్నారు. 'సేతు' భారతీయ పురాణాలలో ప్రసిద్ధమైన సంఘటనల ఆధారంగా రూపొందినా, ఇప్పటివరకూ వినని కల్పిత కథ. రామాయణంలోని యుద్ధాలు, వీర గాథలు, త్యాగం, ధర్మబద్ధత వంటి అంశాలను ఈ కథలో ప్రతిబింబించనున్నారు. యుద్ధ దృశ్యాలు, విస్తృతమైన ప్రకృతి దృశ్యాలు, పురాణ గాధల స్ఫూర్తిని అందించే విలక్షణమైన పాత్రలతో ఒక గొప్ప అనుభూతిని ఈ సినిమా ఇవ్వనుంది.

అదే వైష్ణవి చైతన్య ప్రత్యేకత..

తెలుగు సినీ పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకి అవకాశాలు రావడమే పెద్ద విడ్డూరంగా భావిస్తుంటారు. వాస్తవానికి అది నిజం కూడా. అందం, అభినయం ఉన్నప్పటికీ ఎందుకో చాలామంది తెలుగమ్మాయిలు హీరోయిన్లుగా రాణించలేకపోయారు. అయితే కొంతమంది తెలుగు అమ్మాయిలు కష్టపడి, పనిచేసి అవకాశాలు పొందడమే కాకుండా తక్కువ సమయంలో స్టార్స్‌గా కూడా ఎదిగారు. అలాంటి అతి తక్కువ మంది హీరోయిన్లలో వైష్ణవి చైతన్య కూడా ఒకరు.


కెరీర్ ప్రారంభంలో 'లవ్ ఇన్ 143 అవర్స్', 'ది సాఫ్ట్‌వేర్ డెవలపర్', 'అరెరె మానస', 'మిస్సమ్మ' వంటి షార్ట్ ఫిల్మ్స్‌తో నటిగా గుర్తింపు తెచ్చుకున్న అమె ఆ తర్వాత 'అల వైకుంఠపురములో', 'వరుడు కావలెను' వంటి క్రేజీ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసే అవకాశం దక్కించుకున్నారు. ఆ సినిమాల్లో చేసినవి చిన్న పాత్రలే అయినప్పటికీ వాటితో కూడా యూత్‌ను



వైష్ణవి చైతన్య

మెప్పించారు. అందువల్ల 'బేబీ' సినిమాలో వైష్ణవికి మెయిన్ హీరోయిన్ ఛాన్స్ వరించింది. 'బేబీ' లో ఇద్దరు హీరోలు ఉన్నప్పటికీ సినిమా కథ మొత్తం హీరోయిన్ వైష్ణవి పాత్ర చుట్టూనే తిరుగుతుంది. ఆమె నటన సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచింది. ఆ సినిమా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంలో వైష్ణవి పాత్ర ఎంతో ఉంది. 'బేబీ'తో యూత్‌లోనే కాదు.. ఫ్యామిలీ ఆడియన్స్‌లో కూడా బోలెడంత క్రేజ్ సంపాదించుకున్నారు. అదే వైష్ణవి చైతన్య ప్రత్యేకత కూడా. ఇప్పుడు ఆమె నటిస్తున్న 'జాక్' సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇందులో ఆమె ద్విపాత్రాభినయంతో అలరించనున్నారు. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర' బ్యానర్ పై బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో పాటు 'నైన్టీస్ ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్ సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో కూడా ఆనంద దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటించనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ నాగవంశీ ఈ సినిమాని నిర్మించబోతున్నారు.

వెండితెరపై జగ్గారెడ్డి జీవితం..



జగ్గారెడ్డి

ఉగాది పండగ నేపథ్యాన్ని పురస్కరించుకుని మాస్ లీడర్, జననేత జగ్గారెడ్డి సినిమా ఆఫీస్ లాంఛనంగా ప్రారంభించడంతోపాటు 'జగ్గారెడ్డి' టైటిల్‌తో సినిమాని ఆయన కుమార్తె జయలక్ష్మీ రెడ్డి , భరత్ సాయి రెడ్డి ప్రారంభించారు. విద్యార్థి నాయకుడిగా ప్రయాణం మొదలు పెట్టి అంచెలంచెలుగా రాష్ట్ర నాయకుడిగా ఎదిగిన జగ్గారెడ్డి రాజకీయాల్లో అందరికీ ఆదర్శం. ఆయన సినిమా రంగంలోకి అడుగుపెడుతూ, కథలో టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. ఈ సందర్భంగా మూవీ గ్లింప్స్‌ని చిత్ర బృందం రిలీజ్ చేసింది.

ఈ సందర్భంగా మాస్ లీడర్ జగ్గారెడ్డి మాట్లాడుతూ, 'దర్శకుడు రామానుజం చూపించిన 'జగ్గారెడ్డి వార్ ఆఫ్ లవ్' పోస్టర్‌కి బాగా ఎట్రాక్ట్ అయ్యా. అతర్వాత అయన చెప్పిన కథ నాకు నచ్చింది. అందులో నా పాత్ర నాదే. ఎవరో రాసిన మాటలు, పాత్రలుగా నేను ఉండను. అంతా ఒరిజినల్. మీకు తెలిసిన జగ్గారెడ్డిని తెరమీద చూస్తారు. విద్యార్థి నాయకుడిగా మొదలైన నా ప్రయాణం రాష్ట్ర నాయకుడి వరకూ వచ్చిందంటే అందులో చాలా మలుపులున్నాయి. కుట్రలు, కుతంత్రాలు, హత్యా ప్రయత్నాలను దాటుకుని ఇంతవరకూ చేరిన నా ప్రయాణం ఈ కథలో కనపడుతుంది' అని అన్నారు.

'సంగారెడ్డికి వెళ్లి జగ్గారెడ్డి గురించి తెలుసుకున్నాను. ఇందులో జగ్గారెడ్డి పాత్రతో పాటు మంచి ప్రేమకథ కూడా ఉంటుంది. జగ్గారెడ్డి పాత్ర అద్దంలా ఉంటుంది. కానీ దాన్ని పగుల కొడితే అది ఒక ఆయుధం అవుతుంది. అదే ఆయన పాత్ర' అని దర్శకుడు వడ్డి రామానుజం చెప్పారు. నిర్మాత జయలక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ,'మా నాన్న జగ్గారెడ్డి జీవితంలో కొన్ని సంఘటనలు విన్నాను. వాటిని తెరమీద చూడబోతున్నాం అనే ఆలోచనే నన్ను ఎగ్జైట్ చేస్తుంది. సినిమా కూడా అందరికీ నచ్చే విధంగా ఉంటుంది' అని తెలిపారు.



దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి :

బీసీ సంక్షేమ సంఘం ఉద్యమానికి సీపీఐ(ఎం) మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనీ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు జరపాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో చట్టరూపంలో తేవాలని చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధివర్గం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులను ఎంబీ భవన్‌లో కలిసింది. ఈ రెండు అంశాలపై జరుగుతున్న పోరాటానికి, ఏప్రిల్ రెండో తేదీన ఢిల్లీలో జరిగే మహాధర్నాకు మద్దతు తెలపాలని శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను వ్యతిరేకిస్తున్నది. కానీ, కులగణనకు, రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్రంలో బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండిసంజయ్ తదితరులు ఇలాంటి ద్వంద్వ వైఖరితో మాట్లాడుతుండటాన్ని బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం వున్నది. అగ్రకుల ఆధిపత్యంతో కూడుకుని ఉన్న పార్టీగా, మనువాద ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించే పార్టీగా బీజేపీ వున్నది. మతోన్మాద రాజకీయాలను, కులరాజకీయాలను ప్రేరేపిస్తూ, పెంచి పోషిస్తున్నది. అందువల్ల సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో కులగణన అనేది అత్యంత అవసరం. ఇలాంటి అంశాలపై ఉద్యమిస్తున్న సంఘాలు, పార్టీలకు పూర్తిగా సీపీఐ(ఎం) మద్దతు ఉంటుంది' అని జాన్‌వెస్లీ వారికి హామీనిచ్చారు.

విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి..

- అక్రమ అరెస్టులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- హెచ్‌సీయూ భూముల్లో జేసీబీలను, బుల్డోజర్లను వెనక్కి పంపాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఆందోళన చేపట్టిన యూనివర్సిటీ విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారనీ, వారిని వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల అరెస్టులకు నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేసిందనీ, నియంతృత్వాన్ని, అహంకారాన్ని ప్రదర్శించిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అంతకంటే ఎక్కువగా రాష్ట్రంలో నిర్బంధాన్ని , అహంకారన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీలో దింపిన పోలీస్ బలగాలను వెనక్కి పిలిపించాలనీ, జేసీబీ, బుల్డోజర్లను అక్కడి నుండి ఖాళీ చేయించాలనీ, హెచ్‌సీయూకు చెందిన భూముల వేలాన్ని అపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బేషరతుగా విడిదల చేయాలని లేని పక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అరెస్టైన వారిలో ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు లెనిన్, పంకజ్ నాయకులు మోహిత్, అనన్య, అభయ్, యూనివర్సిటీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి నిహాద్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ గ్రీన్ మొబిలిటీ విజన్‌లో భాగమైన 'విజ్జీ'

- 200 ఈవీ బైక్స్‌ను ప్రవేశపెట్టిన 'విజ్జీ' సంస్థను అభినందించిన ప్రభుత్వ ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్ మొబిలిటీ విజన్‌లో భాగంగా డెలివరీ పార్ట్‌నర్ సంస్థ 'విజ్జీ' పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం తగ్గించేందుకు తన వంతుగా తమ రైడర్లకు ఇంధన వాహనాలకు బదులుగా ఈవీ బైక్‌లను అందించింది. గచ్చిబౌలిలోని కపిల్ టవర్స్‌లోని 'విజ్జీ' ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ రైడర్లకు తాళాలను అందించి, జెండా ఊపి ఈవీ బైక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేష్ మాట్లాడుతూ ఈవీ వాహనాల విప్లవంలో తెలంగాణ ముందుందని, ప్రభుత్వం ఈవీ వాహనాలకు అనేక రాయితీలను ఇస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఈవీ విప్లవంలో 'విజ్జీ' భాగమైనందుకు జయేష్ అభినందించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల్లో 'విజ్జీ'కు 15 వేల మందికి పైగా రైడర్లు ఉన్నారు. తొలి దశలో భాగంగా 200 ఈవీ బైక్‌లను రైడర్లకు 'విజ్జీ' అందించింది. విజ్జీ సీఈఓ బి.రవిచందర్ రెడ్డి, సీఎస్ఓ కంకణాల అభిషేక్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అపార్టుమెంట్‌లో చెలరేగిన మంటలు

- రూ.30 లక్షల ఆస్తి నష్టం
- ఖమ్మంలోని బుర్హాన్‌పురం పిన్ని ఎలైట్ హోమ్ అపార్టుమెంట్‌లో ఘటన



నవతెలంగాణ-ఖమ్మం

ఓ అపార్టుమెంట్‌లో పండగ రోజు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురైన సంఘటన ఖమ్మం నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. నగరంలోని బుర్హాన్‌పురం పిన్ని ఎలైట్ హోమ్ అపార్టుమెంట్‌లోని మూడో ఫ్లాట్‌లో దట్టమైన పొగలతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. అపార్టుమెంట్ సమీపంలో ఉన్న మరో అపార్టుమెంట్‌లోని వారు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా నూతన అపార్టుమెంట్ కావడంతో ఆ ఫ్లాటులో యజమాని ఉండటం లేదు. దాంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని ఫ్లాటు యజమాని సత్తిరెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో ఫ్లాటులోని తలుపులు, సీలింగ్, క బోర్డులు, గోడలు మొత్తం పూర్తిగా తగులబడిపోయాయి. సుమారు రూ.30 లక్షలపైగా ఆస్తినష్టం జరిగిందని యజమాని తెలిపారు.

హెచ్‌సీయూ రణరంగం

వేలం వేసే భూమి చదును చేసేందుకు ప్రభుత్వం కసరత్తు

సెలవులు చూసుకుని రంగంలోకి దిగిన ప్రభుత్వ యంత్రాంగం

జేసీబీ, ట్రక్కులను అడ్డుకున్న విద్యార్థులు, పోలీసుల దాడి

విద్యార్థినుల జుట్టు పట్టి లాక్కెళ్ళిన పోలీసులు

వేరే రాష్ట్రం విద్యార్థులు కావడంతో బూతులు తిడుతూ

విచక్షణ కోల్పోయిన వైనం

అడవిని నాశనం చేస్తున్నారంటూ విద్యార్థుల ఆందోళన

విద్యార్థుల అరెస్టు, పోలీస్‌స్టేషన్లకు తరలింపు

భూముల వేలం ఆపాల్సిందే.. : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఐక్య కార్యాచరణ కమిటీ



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మరోసారి రణరంగంగా మారింది. యూనివర్సిటీ భూముల వేలానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో దీనిపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వరుసగా ఆందోళనలు చేస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో భూముల వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సెలవు దినం కావడంతో ఇదే అదనుగా ప్రభుత్వ యంత్రాంగం.. వేలం వేసే 400 ఎకరాల భూమిలో చదును చేసేందుకు పూనుకుంది. జేసీబీలు, ట్రక్కులతో అధికారులు భూముల్లోకి వెళ్లారు. పోలీసుల సహకారంతో చదును చేసే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు ఒక్కసారిగా ర్యాలీగా భూముల వద్దకు వచ్చారు. జేసీబీలు, ట్రక్కులను అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విద్యార్థులను అరెస్టు చేసి వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు.

విద్యార్థులపై పోలీసుల దాడి

యూనివర్సిటీ భూములు వేలం వేయొద్దని, ఆ భూములను కాపాడాలని నినాదాలు చేస్తూ విద్యార్థులు జేసీబీలు, ట్రక్కులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. యూనివర్సిటీ ఈస్ట్ వైపు భారీగా బలగాలను మోహరించారు. ఈ క్రమంలో విద్యార్థుల పట్ల పోలీసులు చాలా దురుసుగా ప్రవర్తించారు. కనీస మానవత్వం మరిచి.. ఇష్టానుసారంగా వ్యవహరించారు. విద్యార్థులను లాక్కెళ్లి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారు. విద్యార్థినులని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాక్కెళ్ళి వ్యాన్‌లో పడేశారు. వేరే రాష్ట్రాల విద్యార్థులు కావడంతో విద్యార్థులు ఏం చెప్తున్నారో కనీసం అర్థం చేసుకోనంత స్థితిలోకి పోలీసు యంత్రాంగం వెళ్లింది. ఈ సందర్భంగా స్వల్ప లాఠీచార్జి జరిగినట్టు తెలుస్తోంది. ఆందోళన చేస్తున్న విద్యార్థులందరినీ అరెస్టు చేసి గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో తమను ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పడం లేదని, పోలీసులు తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని విద్యార్థులు సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియోలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారాయి. పోలీసుల తీరు పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల అరెస్టును, ప్రభుత్వ తీరును ఖండించారు. ఇదిలా ఉంటే అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం రాత్రి విద్యార్థులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ క్రమంలో కూడా విద్యార్థులను పోలీసులు అడ్డుకోగా పలువురు గాయపడి ఇప్పటికే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

భూముల వేలం ఆపాల్సిందే.. : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఐక్య కార్యచరణ కమిటీ

సెంట్రల్ యూనివర్సిటీ భూములు వేలం వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, భూముల వేలం ఆపాల్సిందేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూముల వేలం విషయంలో ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల పట్ల ఇష్టానురీతిగా మాట్లాడటం సరికాదన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారని తెలిపారు. ఒకవైపు ఫ్రెండ్లీ పోలీస్ అంటూనే నిరసన తెలుపకుండా పూర్తిగా పోలీస్ రాజ్యంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం బయటకు ప్రకటనలు ఒకలాగా చేస్తూ తమ భూమిని పూర్తిగా పెద్ద, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు అనునిత్యం పని చేస్తోందని విమర్శించారు. విద్యార్థుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన పోలీసులపై విచారణ జరిపించాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై అన్నీ పార్టీల నాయకులను కలిసినట్టు తెలిపారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఢిల్లీ వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. యూనివర్సిటీలో జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేయొద్దని, అడవిని కాపాడాలని డిమాండ్ చేశారు.

మాదాపూర్ పీఎస్ ఎదుట సీపీఐ(ఎం), ఎస్ఎఫ్ఐ ఆందోళన

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టు నిరసిస్తూ మాదాపూర్ పీఎస్ ఎదుట సీపీఐ(ఎం), ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేశారు. విద్యార్థుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరును ఖండించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి యాదయ్య మాట్లాడుతూ.. విద్యార్థులను అరెస్టు చేయడం సరికాదన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డులు తీసుకోవడం, మళ్లీ ఆందోళనలో పాల్గొనబోమని విద్యార్థుల నుంచి వీడివీడిగా ఒక్కొక్కరి వీడియోను తీసుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈ.నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు రుద్రకుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలి: సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అక్రమంగా అరెస్టు చేసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే ప్రయత్నాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులను అరెస్టు చేయటం దుర్మార్గమని పేర్కొన్నారు. దీన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. 400 ఎకరాల్లో పర్యావరణం, అటవికి సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేయటానికి జేసీబీలను, బుల్డోజర్‌లను తీసుకురావటమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారనీ, గత రెండు దశాబ్దాలుగా కేంద్రీయ యూనివర్సిటీ భూములు అనేక కారణాల చూపిస్తూ ప్రభుత్వం అన్యాక్రాంతం చేస్తున్నదని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూముల వేలం ప్రక్రియను ఆపాలనీ, జేసీబీ బుల్డోజర్లను, పోలీసు బలగాలను వెనక్కి రప్పించాలనీ, అరెస్టయిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర బడ్జెట్ షడ్రుచుల సమ్మిళితం

భట్టి, నేను జోడెద్దుల్లా పని చేస్తున్నాం

అన్నింటికీ బడ్జెట్‌లో కేటాయింపులు చేశాం : సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ షడ్రుచుల సమ్మిళితంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ తాను, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం జోడెద్దుల్లా పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ విశ్వావసు నామ సంవత్సరం సంతోషాలను అందించాలనీ, సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లల్లో ఉండాలనీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ అభివృద్ధికి, పేదలకు విద్య అందించేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమం అన్నిటికీ బడ్జెట్ లో నిధులు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. దేశంలో తెలంగాణ ఒక వెలుగు వెలగాలి, దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలవాలన్నారు. దేశంలో కొత్త నగరాల నిర్మాణం జరగాల్సిన అవసరముందంటూ, అందులో భాగంగానే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి తెలంగాణ శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పెట్టుబడుల నగరంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దేశంలోనే ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను తీసుకొచ్చి పేదలకు ఆకలి దూరం చేసేందుకు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు పేదలకు సన్నబియ్యం అందించే పథకానికి ఉగాది రోజున శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందుభాగంలో నిలిచిందని వెల్లడించారు. రైతులు పండించిన సన్న ధాన్యాన్ని పేదలకు అందించబోతున్నామని తెలిపారు. ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. ఇది రాజకీయాలు చేసే సందర్భం కాదనీ, అభివృద్ధి చేసే సందర్భమని తెలిపారు. తమ ఆలోచనలో, సంకల్పంలో స్పష్టత ఉందనీ, తెలంగాణ రైజింగ్-2050 ప్రణాళికతో దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలబెడతామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ అంటే కేవలం ప్రజలు నివసించే నగరమే కాదనీ, అది పెట్టుబడుల నగరమని చెప్పారు. ఈ సిటీతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. శ్రీ సీతామచంద్ర స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవ ఆహ్వాన రాజపత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భద్రాచలం దేవస్థానం ఈవో, అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, శంకరయ్య, మల్ రెడ్డి రంగా రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ రంగంలో పరుగులే
పంచాంగ శ్రవణంలో బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి

ఉగాది వేడుకల్లో పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. "రియల్ ఎస్టేట్ రంగం తెలంగాణలో ఈ ఏడాది పరుగులు పెడుతుంది. తెలంగాణ రాష్ట్రం మిథున రాశి, పునర్వసు నక్షత్రంలో ఆవిర్భవించింది. పాలకుల మధ్య పోటీతత్వం పెరుగుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పాలకులు పోటీపడి పరుగులుపెట్టి పాలిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పాలన చేస్తారు. తెలంగాణలో వర్షాలకు ఇబ్బంది లేదు, పంటలు అద్భుతంగా పండుతాయి. ఎర్రరేగడి భూములు, ఎర్రటి ధాన్యాలు మంచి ఫలితాలిస్తాయి. శాంతి భద్రతల విషయంలో నిరంతరం పోలీసులు జాగతంగా ఉండి పనిచేస్తారు. రాష్ట్రంలో పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి. తుఫాన్లు, భూకంపాలు అప్పుడప్పుడు పలకరించవచ్చు. ఆర్థిక భారం ఎక్కువగానే ఉంటుంది. ప్రజలకు డబ్బు బాగానే సిద్ధిస్తుంది. ఈ ఏడాది ప్రజలు అత్యంత సంతోషంగా ఉంటారు. రాష్ట్రానికి రావాల్సిన డబ్బు రాకపోవడంతో కొంత ఇబ్బంది ఉంటుంది. పొరుగు రాష్ట్రాలతో నీటి విషయంలో ఇబ్బందులు వస్తాయి.. వాటిని ముఖ్యమంత్రి అధిగమిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. విద్య, వైద్యంపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. అనుకోని ఇబ్బందుల వల్ల అన్ని కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇవ్వకపోవచ్చు. పాలకులు ప్రజాహిత కార్యక్రమాలకు ప్రజాధనాన్ని వెచ్చిస్తారు. విదేశీ పెట్టుబడులు ఎక్కువగా తెచ్చే ప్రయత్నం చేస్తారు. రాష్ట్ర ఆదాయం బయటకు పోకుండా కాపాడే ప్రయత్నం చేస్తారు. ఈ సంవత్సరం వర్షం బాగా పడుతుంది.. కానీ పంటలు కాపాడుకోవాలి" అని సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణంలో పేర్కొన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉగాది పండుగ రోజు సహితం కుటుంబాలకు దూరంగా ఉంటూ సహాయక చర్యల్లో ఉన్న సిబ్బందిని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి ప్రత్యేకంగా అభినందించారు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీసులో సహాయక బృందాల ఉన్నత అధికారులతో ఆదివారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహాయక బృందాలకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా నిష్ణాతులైన సిబ్బందిని, సాంకేతికతను ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. మొదటి రోజు నుంచే టన్నెల్ లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయగల ఆర్మీ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్, రోబోటిక్.. సహా అన్ని రకాల నిష్ణాతులను, సాంకేతికతను ఉపయోగించుకుంటూ టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. వివరించారు. నిర్విరామంగా డీ - వాటరింగ్ ప్రక్రియను చేపడుతూ, సహాయక పనులకు ఆటంకంగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ బయటికి తరలిస్తున్నామని తెలిపారు. సొరంగం లోపల అత్యధికంగా ఉన్న మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, సింగరేణి రిస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య దక్షిణ, మధ్య రైల్వే అధికారి నేటి చంద్ర, హైడ్రా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అందరూ సోదరభావంతో మెలగాలి

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

జపాల్‌లో ఇఫ్తార్ విందుకు హాజరు

నవతెలంగాణ-మంచాల

గ్రామాల్లో అందరూ సోదర భావంతో మెలగాలని, అన్నీ పండుగలు అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జపాల్ గ్రామంలో కో-ఆప్షన్ మాజీ సభ్యులు ఓరుగంటి భాస్కర్‌గౌడ్ ముస్లిం సోదరులకు శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జాన్‌వెస్లీ, జిల్లా నాయకులు హాజరై ముస్లీం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం కర్జూర తినిపించి.. ఉపవాసం విడిపించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ప్రతి రోజూ ఉపవాసం నిర్వహించడం వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. కుల, మతాలకు అతీతంగా ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతిక అని అన్నారు. ప్రజలు ఐక్యమత్యంతో ఉండాలన్నారు. ముస్లీంల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, వారి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. రాష్ట్రంలో మతకలహాలకు తావు లేదని, ఇక్కడి ప్రజలు మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉంటారని చెప్పారు. ఒకరి పండుగను మరొకరు గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు. ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన ఓరుగంటి భాస్కర్‌గౌడ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, అబ్బాస్, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, పార్టీ మండల కార్యదర్శి రావుల జంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాస్ రెడ్డి, నాగిల్ల శ్యామ్ సుందర్, మండల కమిటీ సభ్యులు యాట జగన్, అన్నారం లెనిన్, గ్రామ కమిటీ కార్యదర్శి కుకుడాల పాపిరెడ్డి, మాజీ ఎంపీటీ లట్టుపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఆవుల నరసింహ, యాట సత్యం, సయ్యద్ రజాక్ పాషా, సయ్యద్ రావుఫ్, పేర్మండ్ల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

చెరువులో పడ్డ పిల్లలను రక్షించబోయి..

ముగ్గురు పిల్లలతో సహా తల్లీ మృతి

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ గ్రామంలో ఘటన


(ఫైల్)

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

దుస్తులు ఉతికేందుకు తల్లీతో పాటు వెళ్లిన ముగ్గురు పిల్లలు.. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోగా.. వారిని కాపాడబోయిన తల్లి సైతం నీట మునిగి మృతిచెందారు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో జరిగింది. ఎల్లారెడ్డి సీఐ రవీందర్, ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం భిక్కనూరు గ్రామ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన లింగయ్యకు కళ్యాణి గ్రామానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుర్లు, ఒక్క కుమారుడు ఉన్నారు. ఆమె కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. దాంతో ఆయన మౌనిక(26)ను రెండో వివాహం చేసుకున్నాడు. మౌనిక, ముగ్గురు పిల్లలు మైతిలి(10), అక్షర(9), వినయ్(7)తో కలిసి శనివారం మధ్యాహ్నం పొలం పనుల నిమిత్తం వెళ్లారు. పనులు పూర్తయిన అనంతరం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి మౌనిక దుస్తులు ఉతుకుతుండగా.. ముగ్గురు పిల్లలు స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. కాగా.. చెరువులో భారీ గుంత ఉండటంతో పిల్లలు అందులో మునిగిపోవడంతో అరుపులు కేకలు వేశారు. వారిని గమనించిన తల్లి మౌనిక కాపాండేందుకు వెళ్లి ఆమె కూడా నీట మునిగింది. ఈత రాకపోవడంతో నలుగురూ చెరువులో నీట మునిగిపోయారు. సాయంత్రం అయినా నలుగురూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా.. దుస్తులు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి తర్వాత వినయ్ మృతదేహం నీటిపై తేలింది. దాంతో మిగతా వారికోసం గాలించగా ఆదివారం ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. దాంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది.

ముఖ్యమంత్రిని కలసిన జక్కిడి శివచరణ్ రెడ్డి



నవతెలంగాణ -హయత్‌నగర్

విశ్వా వసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా సామ రంగారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - హయత్‌నగర్

అర్బన్ రంగారెడ్డి జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మన్సూరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. తర్వాత శాలువాలు, పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

వాకర్స్‌కు మౌలిక వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి వినతి

నవతెలంగాణ-హయత్‌నగర్

మహావీర్ హరిణ వనస్థలి డీర్ పార్క్ వాకర్స్‌కు మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్కు నందు ఓపెన్ జిమ్, వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా వసతులు కల్పించాలని అన్నారు. పార్క్ నందు యోగ కోసం యోగ షెడ్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తప్పకుండా మీరు అడిగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లో పార్క్‌ను సందర్శిస్తానని తెలిపారు. వినతి అందజేసిన వారిలో అధ్యక్షులు జగదీష్ యాదవ్, జనరల్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, యోగ సాధన అధ్యక్షులు లింగారెడ్డి, గుత్తా లక్ష్మారెడ్డి, సునీల్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో హాస్యకు బంగారు పతకం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర విశ్వవిద్యాలలో ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఆర్చరీ పోటీలలో హయత్‌నగర్‌కు చెందిన మామిడిపల్లి శ్రీధర్ కూతురు హాస్య తెలంగాణ తరపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. హాస్య ప్రతిభను గుర్తించిన హయత్ నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం ఉగాది సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా హయత్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకిటి బాలరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, వారికి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని అన్నారు. హాస్య తన క్రీడా నైపుణ్యం పెంచుకొని ఒలంపిక్‌లో పాల్గొని దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిడుగు సురేష్, లింగం శ్రీనివాస్, గుడాల మల్లేష్, నీరుడు రాజు, లింగం సందీప్, గొడుగు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘంలో పంచాంగ శ్రవణం..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని హయత్‌నగర్‌లోని ముదిరాజ్ సహకార సంఘంలో ఆదివారం పంచాంగ శ్రవణంను పురోహితులు శేఖర్ శర్మ పంచాంగ పఠనం చేసి విశ్వావసు నామ సంవత్సర కాలమాన వివరాలను తెలియజేశారు. సూర్య గురు గ్రహాలు అనుకూలంగా ఉన్నందున ఈ ఏడాది అన్ని రాశుల వారికి శుభం కలుతుందని ఆయన తెలిపారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకిటి బాలరాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిడుగు సురేష్, నీరుడు ధన్పాల్, గొడుగు రమేష్, శ్రీకాంత్, రమేష్, లింగం దశరథ, సందీప్ గొడుగు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సహారా స్టేట్స్ కాలనీలో ఈత కొలను ప్రారంభం



నవతెలంగాణ-హయత్‌నగర్

సహారా స్టేట్స్ లో ఈత కొలనును జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆదివారం స్థానిక కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా సహారా స్టేట్స్ కాలనీ వాసులు సేద తీరడానికి ఈత కొలనును మంచి ఆలోచనతో కాలనీ సంక్షేమ సంఘ నాయకులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, సుదర్శన్ రెడ్డి, శేఖర్ మహేష్, చందర్ రావు, వెంకటాద్రి, రాఘవేందర్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సాహిత్యం సమాజ మార్పుకి దోహదపడాలి'



నవతెలంగాణ-చంపాపేట్

సాహిత్యం సమాజాన్ని మార్చడానికి, సమాజంలోని ఎత్తు పల్లాలను సరి చేయడానికి, సామాజిక ఒడిదుడుకులను, సామాజిక రుగ్మతలను నయం చేయడానికి ఉపయోగపడాలని, అలాంటప్పుడే అది అభ్యుదయ సాహిత్యంగా పరిగణించబడుతుందని డాక్టర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం తెలంగాణ సాహితీ- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్కె) సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం హైదరాబాద్ జిల్లా యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని ఐ.ఎస్. సదన్ చౌరస్తా వద్ద ఆలం ఖుంద్ మీరి భవన్ ఉగాది కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాహిత్యం అనేక రకాలుగా ఉంటుందని, అందులో భావం, శిల్పం కేవలం మానసిక ఉల్లాసాన్ని కలిగించేదిగా ఉంటే సరిపోదని, మనిషికి చైతన్యాన్ని కలిగించేదై ఉండాలని అన్నారు. మరో అతిథి కవి, రచయిత, సాహిత్య అనువాదకులు డాక్టర్ ఎలనాగ సాహిత్యం ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉన్నప్పుడే అది అనువాదానికి పురిగొల్పుతుందని అన్నారు. ఒక వచ్చిన సాహిత్యం మరో భాషలో అనువాదం చేయాలంటే దాని భావాన్ని శిల్పాన్ని పట్టుకోవాలన్నారు. మూల భాష, అనువాదం చేయాలనుకునే భాష ఆ రెండింటిపైన సమానపట్టు ఉండాలని అప్పుడే అది అనువాద సాహిత్యానికి న్యాయం చేయగలుగుతుందని సూచించారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కటుకోజ్వల ఆనందాచారి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాల కాలం ముందున్న సాహిత్యానికి నేటి సాహిత్యానికి చాలా తేడా ఉంటుందని అన్నారు. నేడు రాస్తున్న సాహిత్యంలో సాంకేతిక పదజాలం ఇమిడి వస్తుందని, దాంతో సాహిత్య మూలాల్లో అనేక మార్పులు గమనించవచ్చని అన్నారు. ఒక రచన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై ప్రభావం చూపించగలిగినప్పుడే దానికి సార్థకత ఉంటుందని అన్నారు. ఈనాటి అధునాతన సాంకేతిక యుగంలో సనాతన ధర్మం పేరుతో కుల విశ్వాసాలను మత విశ్వాసాలను ప్రభుత్వాలు స్వయంగా పెంచి పోషించడం సాహిత్య విలువలను, సాంకేతిక విలువలను నిర్వీర్యం చేయడమేనని అన్నారు. శాస్త్రజ్ఞులు అనేక ప్రయోగాల ద్వారా చంద్రుడిపై వెళ్లి వస్తే శివ శక్తి అని ఆ స్థలానికి పేరు పెట్టడం విడ్డూరమన్నారు. విశ్వంలో నెలల తరబడి తిరుగుతూ, ప్రయోగాలు చేస్తూ, భూమియేతర గ్రహాలపై నివాసాలు ఏర్పాటు చేసేంత గొప్ప ఆవిష్కరణలు జరిపేటువంటి సాంకేతిక జ్ఞానాన్ని సైతం ఒక ధర్మానికి పరిమితం చేయడం జ్ఞానాన్ని, సృజనను, అను సృజనను, అనుకరణను బయటికి రాకుండా తూర్పేయడమే ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్లాంటి సందర్భంలో ప్రజా సాహిత్యాన్ని, ప్రజల సాహిత్యాన్ని సృష్టించడం అంత సులువైన పని ఏమి కాదని అన్నారు. మరోవైపు సోషల్ మీడియా అభివృద్ధి అయిన తర్వాత పుస్తకాలు ఎవరు చదువుతున్నారు, పుస్తకాలు చదివే వారు లేనే లేరు అని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని, అయినా అది సరైనది కాదని నేటి కవులు రచయితలు రుజువు పరుస్తున్నారని, ఇది హర్షించదగ్గ విషయమని కొనియాడారు. మహేష్ దుర్గే అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో చగా రేఖా రెడ్డి, కొండ రవీందర్ కవి సమ్మేళనం నిర్వహించారు. తంగిరాల చక్రవర్తి, గజవెల్లి దశరథ రామయ్య, సీతారపు వెంకటనారాయణ, షేక్ సలీమా, సయ్యద్ ముజాహిద్ అలీ, గడ్డం సులోచన, ఎం.జి సరస్వతి దేవి, వంశీకృష్ణ, దేవరశెట్టి రవికుమార్, విజయశ్రీ, పద్మా రెడ్డి, 35 మంది కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు.

దిష్టి బొమ్మల్లా.. చార్జింగ్ పాయింట్స్



లక్ష్యం మంచిదే కానీ.. నిరుపయోగంగా ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ పాయింట్లు

నవతెలంగాణ- నాగోల్

పర్యావరణ పరిరక్షణతో పాటు పెరుగుతున్న ఇంధన ధరలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈవీ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల అలసత్వంతో నగరంలోని కొన్ని ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ పాయింట్లు ప్రారంభాలకు, మరమతులకు నోచుకోక నిరుపయోగంగా మిగిలిపోతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయలను వెచ్చించి ప్రతి చార్జింగ్ పాయింట్‌కు ప్రత్యేకంగా ఒక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ను కేటాయించి వాహనదారులు తమ వాహనాలకు చార్జింగ్‌ను పెట్టుకునేలా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. కానీ చార్జింగ్ పాయింట్ల స్థలాల ఎంపిక అనాలోచిత విధానాల వలన జన సంచారం లేని, చార్జింగ్ పెట్టుకోవడానికి వాహనాల పార్క్‌కు స్థలం లేని చోట్లలో ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. దీంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్యాన్ని నియంత్రించడంలో ఎలక్ట్రిక్ వాహనాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో రోజు రోజుకూ నగరంలో ఎలక్ట్రిక్ (ఈవీ) ద్విచక్ర, మధ్య తరహా, భారీ వాహనాల సంఖ్య పెరిగిపోతుంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ కింద జీహెచ్ఎంసీ మరియు తెలంగాణ రాష్ట్ర ఇంధన పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలో మూడు ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఉప్పల్, ఎల్బీనగర్ ప్రధాన రహదారిలో ఆర్టీవో కార్యాలయం సమీపంలో, విజయ గార్డెన్ కాలనీలో, బండ్లగూడ జి.ఎస్.ఐ సంస్థ కార్యాలయం సమీపంలో మూడు ఈవీ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఉప్పల్ ఎల్బీనగర్ ప్రధాన రహదారి ఆర్టీవో కార్యాలయం ఉన్న ఈవీ చార్జింగ్ పాయింట్‌లో ప్రధాన రహదారి కావడంతో అక్కడ ఉన్న ఈవీ చార్జింగ్ పాయింట్‌ను వినియోగిస్తున్నారు. మిగిలిన విజయ గార్డెన్ కాలనీలో ఉన్న ఈవీ చార్జింగ్ పాయింట్ మరియు బండ్లగూడ జి.ఎస్.ఐ సంస్థ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీ చార్జింగ్ పాయింట్లు చెట్ల చాటున, జన సంచారం లేని వాహనదారులకు అందుబాటులో లేకుండా ఉండడంతో అవి నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి.

అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఈవీ చార్జింగ్ పాయింట్లపై ఇప్పటి ప్రభుత్వం వాటిపై దృష్టి సాధించకపోవడం, సంబంధిత అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించకపోవడంతో, కనీసం సూచికల బోర్డులను కూడా ఏర్పాటు చేయక పోవడంతో దిష్టి బొమ్మల్లా మారే పరిస్థితి ఏర్పడింది. చార్జింగ్ ఫాయింట్ ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఈవీ చార్జింగ్ పాయింట్లు జన సంచారం లేని చోటు, పార్కులు, నగరశివారు ప్రాంతాలలో ఏర్పాటు చేయడంతో అవి వినియోగానికి నోచుకోక నిరుపయోగంగా మిగిలిపోయి మద్యం సీసాలు, చెత్త చెదారంతో దుమ్ము ధూళితో నిండిపోతున్నాయి. విజయ గార్డెన్ కాలనీలో ఉన్న ఈవీ చార్జింగ్ పాయింట్ పనిచేయక మాసాలు గడిచిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో అక్కడి వచ్చి తిరిగి వెళ్లాల్సి వస్తుందని వాహనదారుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనవాసాల వద్ద ఏర్పాటు చేయకుండా ప్రజలకు అందుబాటులో లేని ప్రాంతం లో ఏర్పాటు చేశారు.

నాగోలు ఆర్టీవో కార్యాలయంలో సమీపంలో ఉన్న ఈవీ చార్జింగ్ పాయింట్ కొంత మేరకు పనిచేస్తున్నది. జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణ లేక పోవడంతో మిగిలిన రెండు పాయింట్లు నిరుపయోగంగా ఉండి దుమ్ము, ధూళీతో నిండిపోయి పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పని చేయని వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి ఈవీ చార్జింగ్ పాయింట్లపై అవగాహన సదస్సులు నిర్వహించి, ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయో వాటికి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.



సక్రమంగా వినియోగించకపోతే శిథిలావస్థకు చేరుతాయి

ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ పాయింట్లు ఆలనా పాలన లేక అవి సక్రమంగా పనిచేయట్లేదు. కానీ వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ఎంతో ఉపయోగపడుతున్న ఈ ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ పాయింట్లపై అలసత్వం వహించడం సరైనది కాదు. వాటిని సక్రమంగా వినియోగించకపోవడం వలన అవి నిరూపయోగంగా మారి శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. ఎప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నగరంలోని ఈవీ రీచార్జింగ్ పాయింట్లను వినియోగించేలా వాహనదారులకు అందుబాటులో తేవాలి.

- సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ

నిర్వహణ లోపం ఎక్కువ..



ప్రభుత్వ ఇంధన వనరుల శాఖ నిర్వహించే ఎలక్ట్రికల్ వెహికల్స్ చార్జింగ్ స్టేషన్లు హైదరాబాదు నగరంలో చాలా చోట్ల ఉన్నప్పటికీ నిర్వహణ లోపం ఎక్కువగా ఉంది. కొన్ని పనిచేయవు. కంప్లైంట్ ఇచ్చినా పట్టించుకునే దిక్కు లేదు. ప్రైవేటు యాజమాన్యం నిర్వహించే ఈవీ స్టేషన్లో రేటు ఎక్కువ. కనుక చాలా మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈవీ స్టేషన్ల మీదే ఆధారపడతారు. 24 గంటల పాటు వీటిని పర్యవేక్షించగల యంత్రాంగం ఉంటే ఎంతో బాగుంటుంది.

- షహనాజ్ షేక్, మన్సూరాబాద్, హైదరాబాద్

పలు చోట్ల ఘనంగా ఉగాది సంబురాలు



నవతెలంగాణ-నాగోల్

విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉగాది వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరానికి శుభా రంభంగా ప్రజలందరూ ఆయు రారోగ్యాలు, ఆనందం, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చేదు అనుభవాలన్నీ మర్చిపోతూ ఆత్మీయత అనుబంధాల్ని పెంచుకుంటూ ఆనందమయ క్షణాలను మదినిండా నింపి కష్టసుఖాలను కలగలిపిన జీవితంలో షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనం తెలియజెప్పే ఉగాది పండగ అంతర్యం అని పేర్కొన్నారు. మామిడి పువ్వుకి మాట వచ్చింది, కోయిల గొంతుకి కూత వచ్చింది, వేప కొమ్మకి పూత వచ్చింది, పసిడి బెల్లం తోడు వచ్చింది, గుమ్మానికి పచ్చని తోరణం వచ్చింది, పాల బుగ్గల పసిపాపల బోసి నవ్వుల్లో వెలుగు వచ్చింది, ఉగాది పండుగ మన ముందుకొచ్చింది, ఉత్సవం గౌరవం ఆనందం, ధనం, ఐశ్వర్యం ఇవన్నీ ఎల్లప్పుడూ మీతోమాతో పాటే ఉండాలని పాత ఏడాది నేర్పిన పాఠాలు గుర్తుపెట్టుకుందాం కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలుకుదాం అన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్

సీనియర్ సిటిజన్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, అన్నదానం అభినందనీయమని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. ఆదివారం యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీ వద్ద శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది పండుగ పురస్కరించుకొని సీనియర్ సిటిజన్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం సీనియర్ సిటిజన్ సర్వీసెస్ ట్రస్ సెక్రటరీ ప్రసాద్ రావు, ట్రస్ట్ మెంబర్ శేషగిరి రావు పాల్గొన్నారు.





నవతెలంగాణ - చంపాపేట్

ఆర్యవైశ్య సంఘం లాల్ దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం గౌలిపుర బతుకమ్మ వద్ద అధ్యక్షుడు శ్రీరామ్ కోటయ్య అధ్యక్షతన వేద బ్రాహ్మణులు సుధీర్ కుమార్ ఆచార్యులు పంచాంగ పట్టణం గావించడమైనది. అనంతరం వచ్చిన సభ్యులకు పంచాంగం పంపిణీ చేశారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వినాయక్ హిల్స్ కాలనీలోని లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలలో చైర్మెన్ సిద్ధాల బీరప్ప ఆధ్వర్యంలో ఉగాది పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, డీన్ సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్‌లోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బాలాపూర్ గ్రామ వాస్తవ్యులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



కుమారులు (శివ కాంత్ రెడ్డి దంపతులు) (ఓంకాశిరెడ్డి దంపతులు) తెలుగు నూతన సంవత్సర ఉగాది సందర్భంగా రామలింగేశ్వర స్వామి అలంకరణ కోసం రూ.1 లక్ష 50 వేల విలువైన వెండి నాగాభరణం మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహారెడ్డి సమక్షంలో ఆలయ కమిటీ చైర్మెన్ టేకుల శశిధర్ రెడ్డి, కమిటీ సభ్యులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి,నాయకులు ఇక్కే శ్రీనివాస్, పగడాల ఉమేష్, నరహరి గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయి

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజలకు దాహం తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ చౌరస్తా, గౌతమ్ నగర్ చౌరస్తాలలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చలివేంద్రాలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు..

● తెలిపిన సంబు ప్రభాకర్



నవతెలంగాణ-మేడ్చల్

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ ఆదివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డికి తెలుగు నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంబు ప్రభాకర్ మాట్లాడుతూ చేదు, వగరు, తీపి, పులుపులాగా ప్రజలందరూ ఏది ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంటోన్మెంట్ మాజీ కౌన్సిలర్ నళిని తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



● రాజ్యాంగ పీఠికను చదివిన సభ్యులు

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు వ్యవహరించారు. తెలుగు నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ స్ఫూర్తి గ్రూపు నాయకులు అల్లూరి శారద షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ..తెలుగువారి నూతన సంవత్సరం ప్రారంభంలో భారత ప్రజానీకానికి సమాన అవకాశాలు కల్పించిన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పీఠికను చదివి అర్థం చేసుకోని వాటిని ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. ప్రజాతంత్ర నాయకులు కోమటి రవి మాట్లాడుతూ.. రాజ్యాంగం భారత ప్రజలను ఐక్యంగా నిలబెట్టడం కొరకు తోడ్పడుతుందన్నారు. అసమానతలు లేని, వివక్ష లేని సమాజం రూపొందించేందుకు రాజ్యాంగం తోడ్పడుతుందని, దానిని అందరూ చదవాలని కోరారు. రాజ్యాంగ పీఠికను చదువగా సభ్యులు ఆకళింపు చేసుకన్నారు. స్ఫూర్తి గ్రూపు నాయకులు జయరాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ అనేక వివక్షలకు గురై అత్యంత ఉన్నతమైన చదువులు చదివిన తర్వాత రాజ్యాంగం రాయటానికి అవకాశం దొరికిందన్నారు. ఆయన రచించిన రాజ్యాంగాన్ని ఆచరణలో పెట్టాలని చెప్పారు. నేడు పాలకులు ఆ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. దాన్ని ఎదుర్కొని రాజ్యాంగాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని స్ఫూర్తి గ్రూపు యువ నాయకులు గిరీష్ కోరారు. అనంతరం అల్లూరి శారద, శివన్నారాయణ, పాషా, కృష్ణమాచారి ప్రసంగించారు. రాజ్యాంగ పీఠికను, రాజ్యాంగంలోని లక్ష్యాలను ప్రతి విద్యార్థికి తెలియజేసే విధంగా పాఠ్యపుస్తకాలలో ముద్రించాలని, ప్రజలందరికీ రాజ్యాంగం అర్థమయ్యే విధంగా పాలకులు విరివిగా అందుబాటులో ఉంచాలని కోరారు. ఉగాది రోజున రాజ్యాంగాన్ని అర్థం చేసుకోడానికి చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.శివరామకృష్ణ, శ్రీనివాసరావు, కృష్ణమాచార్యులు, గిరీష్, పాష, శారద, కోమటి రవి, గొడుగు యాదగిరిరావు, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండగ శాంతి, సహనానికి ప్రతీక



నవతెలంగాణ-కాప్రా

రంజాన్ పండుగ శాంతి సహనానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింలు 30 రోజులు కఠోర ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేసి పండుగ జరుపుకుంటారని కాంగ్రెస్ నాయకులు పాకాల రాజన్న అన్నారు. ఆదివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని జై జవాన్ కాలనీలోని తన నివాసంలో మస్జిద్-ఎ-నూర్-ఎ-ఇలాహి ముస్లింలు షేక్ మొహిద్దీన్ సాహెబ్, ఎస్.ఎ. రహీమ్, అబ్దుల్ సత్తార్, ఖాదర్ వలి, ఖాసీం అలీ, తాహెర్ పాషా, మెహబూబ్ పీర, అల్లా బక్ష్, దస్తగిరి, అక్బర్, హుస్సేన్ అలీ, జాకీర్ పాషా, సర్వర్, అఫ్జల్ లను మెహరుమాతో సన్మానం చేశారు. ఉపవాసం విడువడానికి ఫ్రూట్ బాక్స్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్ రాములు, నాయకులు ఎం బాల్ నర్సింహ, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

148వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం 148వ వారానికి చేరింది. ఈ ఆదివారం జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్.ఎ.రహీమ్, నర్సింహ్మా చారి, రవి నాయక్, సింగం రాజు, వెంకటయ్య, మెకానిక్ కొండల్, నాగేష్, రాంబాబు, సతీష్ తదితరులు మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



● నాగారం మున్సిపల్ మాజీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నాగారం మున్సిపల్ మాజీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి సేవా సమాజం 18వ వార్షిక చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో బాటసారుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ , మాజీ కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్ , అన్నం రాజు సురేష్, మాజీ వార్డ్ మెంబర్ సాయినాథ్ గౌడ్, రెడ్యానాయక్, నాగరాజు, చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, ఉమాశంకర్, నిరంజన్ బాబు, సదల అశోక్,కాలనీ అసోసియేషన్ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2 నుంచి సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు

● జయప్రదం చేయండి

● సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శ్రీనివాసులు

నవతెలంగాణ - చర్లపల్లి

సీపీఐ(ఎం) ఆల్ ఇండియా 24వ మహాసభలు తమిళనాడులోని మధురైలో ఏప్రిల్ 2 నుండి ప్రారంభమవుతున్నాయని, ఈ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు నాచారం పార్టీ కార్యాలయం నుండి బస్సులో 40 మంది సభ్యులు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. శ్రీనివాసులు జెండా ఊపి కార్యకర్తలు వెళ్తున్న బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన పార్టీ విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తుందన్నారు. మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.గణేష్, లింగస్వామి, శంకర్, కిష్టప్ప, నర్సింగరావు, చంద్రశేఖర్, కృష్ణా నాయక్, బాలపీరు, సరోజ తదితరులు ఉన్నారు.



దప్పిక తీరుస్తున్న 'ఆర్వీ ఫౌండేషన్'

● తొమ్మిదేండ్లుగా జనసంద్రాలు ఉన్న చోట చలివేంద్రాలు ఏర్పాటు

● అభినందనలు తెలిపిన వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

మండుతున్న ఎండల నుండి ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా గత తొమ్మిదేండ్లుగా 'ఆర్వీ ఫౌండేషన్' సామాజిక సేవలో ముందంజలో నిలుస్తున్నది. పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగ తుర్తి రవి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్వీ ఫౌండేషన్ కార్పొ రేషన్ పరిధిలో జన సందోహం అధికంగా ఉండే చోట చలివేంద్రాల ఏర్పాటు చేస్తుంది. రోజు వారిగా స్వచ్ఛ మైన మంచినీటిని నింపడం, ప్రతి రోజూ శుభ్రం చేయ డం లాంటి జాగ్రత్తలు తీసుకుంటు ప్రజల దాహం తీర్చడంలో ముందంజలో ఉంటున్నారు.

ఉగాది సందర్భంగా చలివేంద్రం ప్రారంభం

ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి మేడిపల్లి పోలీసు స్టేషన్, హనుమాన్ దేవాలయం వద్ద నిత్యం జన సందోహం అధికంగా ఉండే చోట ఈ ఏడాది తొలి చలివేంద్రాన్ని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవా చేయాలంటే పదవులే అవసరం లేదని, మంచి మనస్సు ఉంటే చాలన్నారు. తొమ్మిదేండ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'ఆర్వీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



సేవా కార్యక్రమాలే సంతృప్తి ఇస్తాయి

-తుంగతుర్తి రవి



ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు చేయడమే నిజమైన సంతృప్తిని ఇస్తాయని కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు, ఆర్వీ ఫౌండేషన్ నిర్వాహకుడు తుంగతుర్తి రవి అన్నారు. వ్యాపార రంగంలో ఉన్నా, రాజకీయాల్లో ఉన్నా వాటితో సంబంధం లేకుండా ప్రజలకు సేవలు అందించడంలో నిజమైన సంతృప్తి ఉందన్నారు. వివిధ పనుల మీద రోడ్లపైకి వచ్చే ప్రజలకు కడుపునిండా స్వచ్ఛమైన మంచినీరు అందించే అవకాశం కలగడం ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఆర్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు విద్య అందించడం, పలుమార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే ఇతర కార్యక్ర మాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

ఉచితాలు..అభివృద్ధికి అవరోధాలు



● అంబేద్కర్ అశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

నవతెలంగాణ-బోడుప్పల్

ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకొని, ఓట్లు రాబట్టు కొనేందుకు రాజకీయ పార్టీలు సంక్షేమం పేరుతో అంతు లేని ఉచిత పథకాలను ప్రకటిస్తున్నారని, ఉచితాలు అభివృద్ధికి అవరోధాలని అంబేద్కర్ అశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ అంబేద్కర్ విగ్రహం వద్ద జ్ఞానమాల 319 వారం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ నేడు ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ పార్టీలు ఒకరికి మించి మరొకరు ఎవరికి తోచిన విధంగా వారు మ్యానిఫెస్టోల్లో ఉచితాలు గుప్పిస్తున్నారని అన్నారు. నేడు పార్టీలన్నీ ప్రలోభాలతో నే ప్రభంజనాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయన్నా రు. ప్రభుత్వాలు జనాన్ని ఉచితాల ఆశలతో తాత్కాలిక లబ్ధి కలిగించే పథకాలతో ఏమార్చుతున్నాయని చెప్పారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ప్రకటించే ఈ పథకాలు రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో విధిగా జరగాల్సిన అభివృద్ధి పనులను కుంటుపరుస్తాయనే విషయాన్ని పాలకులు విస్మరిస్తున్నారని వాపోయారు. సమాజ పురోగతికి దోహదపడే నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను గాలికొదిలేసి, కొన్ని వర్గాలకు తాత్కాలిక ప్రయోజనాలను కల్పిస్తే అది అభివృద్ధి అవుతుందా అని ప్రశ్నించారు. ప్రజలు విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రహదారుల వంటి మౌలిక వసతులు కరువై నానా ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. పాలకులు వీటిపై దృష్టి సారించకుండా కేవలం ఉచిత పథకాలకే ప్రాధాన్యం కల్పించడం ఎంతవరకు సబబు అని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కోసం మాత్రమే ఖర్చు చేస్తే భవిష్యత్తులో నాణ్యమైన విద్య, వైద్యం అందుతాయన్నారు. కార్యక్రమంలో భూరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, శ్రీరాములు, అంజయ్య, యాకయ్య, సాయి బండారి,యేసు రాజు, నాగేందర్, శ్రీశైలం, బయన్న, సతీష్ తదితరులున్నారు.

శీతల పానీయాలు మానేద్దాం.. సహజ సిద్ధ పానీయాలు తాగుదాం

● బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ రాములు

● జానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ

నవతెలంగాణ-కాప్రా

శీతల పానీయాలకు దూరంగా ఉండి, సహజ సిద్ధమైన పానీయాలను తాగాలని జన విజ్ఞాన వేదిక ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా పిలుపునివ్వడం అభినందనీయమని బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ రాములు అన్నారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈసీఐఎల్ క్రాస్ రోడ్‌లో ఉగాది సందర్భంగా శీతల పానీయాలకు దూరంగా ఉండి, సహజ సిద్ధమైన పానీయాలను తాగాలని ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కుషాయిగూడ ఎస్ఐ రాములు, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలు హాజరై ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదిక శీతల పానీయాల వల్లన కలిగే నష్టాలను ప్రజల అవగాహన కల్పిస్తూ.. ఉగాది పచ్చడి కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షనీయం అన్నారు. జనవిజ్ఞాన వేదిక మునమందు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే తాము అన్ని రకాల సహకరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ముప్పా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈసారి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చెప్పారు. ఎండలకు ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి శీతల పానీయాలని మానేసి మన పెద్దలు నేర్పించిన సహజసిద్ధ పానీయాలను సేవించి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్నీ మాట్లాడుతూ ఉగాది, శ్రీరామనవమి పండుగల సందర్భంగా సహజ సిద్ధమైన పానీయాలు సేవిస్తే ఆరోగ్యానికి మంచిదన్నారు. కానీ నేటితరం మనుషులు కూల్డ్రింక్స్‌కు అలవాటుపడటం వల్లన వారి ఆరోగ్యాలు పాడవుతున్నాయని చెప్పారు. పానకం, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, షర్బత్, రాగిమాల్ట్ లాంటి సహజ పానీయాలు తాగాలని సూచించారు. దీనిలో భాగంగా ఉగాది పచ్చడి వితరణ పదేండ్లుగా ఈసీఐఎల్ క్రాస్ రోడ్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రభాకర్, సోమయ్య చారి, శేషు, రమణారెడ్డి, వెంకయ్య, దుర్గాచారి, కరుణాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రవణ్ కుమార్, వలీ, తాహిర్, ఉజ్మా, శ్రీమన్నారాయణ, రామ్మోహన్ రావు, పి. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

● ఓవర్ లోడ్‌ను తగ్గించేందుకు అదనపు ఫీడర్ల ఏర్పాటు

● టీజీఎస్ పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూక్

నవతెలంగాణ-ఉప్పల్

వేసవిలో ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఓవర్ లోడ్‌ను తగ్గించేందుకే కొత్తగా అదనపు విద్యుత్ ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నామని టీజీఎస్ పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూక్ అన్నారు. ఉప్పల్ హెచ్ఎండీఏ ల ేఅవుట్‌లోని మినీ శిల్పారామం వద్ద రూ. 8.5 కోట్ల వ్యయంతో నిర్మించిన భగాయత్ ఫేజ్-2 సబ్ స్టేషన్, కొత్తగా ఆరు అదనపు విద్యుత్ ఫీడర్లను సీఎంజీ కామేష్, డైరెక్టర్ సాయిబాబా, హబ్సిగూడ సూపరిండెంట్ ఇంజనీర్ బ్రహ్మం, డిప్యూటీ ఇంజనీర్ (టెక్నికల్) సూర్యనారాయణ, ఏడీఈ రవీందర్, అసిస్టెంట్ ఇంజనీర్ బి.కిరణ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముషారఫ్ ఫరూక్ మాట్లాడుతూ డిమాండ్‌కు తగ్గట్టుగా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాను వినియోగదారులకు అందించేందుకు సంస్థ, అధికారులు వ్యూహంతో వెళుతున్నట్టు తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడంతోపాటు ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. హబ్సిగూడ సూపరిండెంట్ ఇంజనీరు బ్రహ్మం మాట్లాడుతూ సీఎండీ ముషారఫ్ ఫరూక్ సంపూర్ణ సహకారంతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.147 కోట్ల నిధులు వెచ్చించి కొత్తగా సబ్ స్టేషన్లతో పాటు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. వినియోగదారులు తమ సమస్యలపై 1912 టోల్-ఫ్రీ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. అందుబాటులో ఉన్న సంస్థ యాప్‌ను వినియోగదారులు వినియోగించుకోవాలని చెప్పారు.



మతసామరస్యానికి ప్రతీక రంజాన్

కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

రంజాన్ పండగ మతసామరస్యానికి ప్రతీక అని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. చిల్కానగర్ డివిజన్‌లో శనివారం పెద్ద మసీదులో, బీరప్ప గడ్డ, కల్యాణపురి, ఇందిరానగర్ కాలనీ దర్గాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ పండుగని, ముస్లింలు రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో చేస్తారని తెలిపారు. పేద ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి పుణ్యకార్యాన్ని చేపడతారని కొనియాడారు. ఉప్పల్ ప్రాంతంలో హిందూ, ముస్లింలు గంగా జమున తహసీబ్ వాలే కలిసి మెలిసి సోదర భావంతో ఉండే సాంప్రదాయం ఉన్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫోటో బాలు, శ్యామ్, మసీద్ కమిటీ సభ్యులు యూసుఫ్, హనీఫ్, గౌస్, ఫరూక్, మగ్గం, బాబా, అసద్, ఓబేద్, మక్బూల్, అక్రమ్, ఇర్షాద్, తదితరలు ఉన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్



నవతెలంగాణ-మేడ్చల్

రంజాన్ మాసం సందర్భంగా గత నెల రోజులుగా ఎంతో నియమనిష్ఠలతో ఉప వాస దీక్షలు చేసి నేడు ముగిస్తున్న మేడ్చల్ మున్సిపల్ ముస్లిం సోదర, సోదరీమణుల కు మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా ఆశీస్సులతో ముస్లింలందరూ సుఖ సంతోషాలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.


ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళా మృతి

నవతెలంగాణ-ఉప్పల్



ఉప్పల్ రింగ్ రోడ్ కూడలి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెంది న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోడుప్పల్ జ్యోతి నగర్‌కు చెంది న మాగంటి స్వరూప రాణి(58) శంషా బాద్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో స్టోర్ కీపర్‌గా ఉద్యోగం చేస్తుంది. శనివారం ఉదయం ఉద్యోగ రీత్యా శంషా బాద్‌కు వెళ్లి విధులు ముగించుకొని బోడుప్పల్ వెళ్లడానికి ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద బస్ దిగి రోడ్డు దాటుతున్న సమయం లో ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో స్వరూప రాణి అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు ఒక కుమారుడు అమెరికాలో ఉంటాడు. విషయం తెలుసుకున్న ఆయన ఇండియాకు బయలుదేరాడు. స్వరూప రాణి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సీలింగ్ ఫ్యాన్స్ అందజేత



నవతెలంగాణ -శామీర్‌పేట

మూడు చింతలపల్లి మండల కేంద్రంలోని వీర బ్రహ్మేంద్ర స్వామిని ఆలయంలో విశ్వకర్మ మండల కమిటీ అధ్యక్షులు బాలకృష్ణాచారి ఆధ్వర్యంలో ఆలయ చైర్మెన్ మహంకాళి ఆంజనేయులు చారి నిర్వహించిన ప్రత్యేక పూజలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జర్నలిస్టు క్యాతం రవి, కాంగ్రెస్ నాయకులు జెగ్రిపోతుల నర్సింహులు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీలింగ్ ఫ్యాన్ అందజేశారు. ఆలయాభివృద్ధికి సహకరించినందుకు ఆలయ కమిటీ తరపున దాతలకు బాలకృష్ణాచారి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటేష్ చారి, శ్రీనివాస్ చారి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బాచుపల్లి సాయి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు స్థానిక మైనార్టీలకు తోఫాను అందజేశారు. స్థానిక సాయి నగర్ యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, మల్లికార్జున్‌లు ఆదివారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి చేతుల మీదుగా మైనార్టీలకు తోఫాను అందించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలను రాజశేఖర్ రెడ్డి, నయీమ్, సంతోష్ గౌడ్,శేఖర్, మేడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-నిజాంపేట్



మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా.. మూసాపేట జమా మసీదులో, ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూమువేణు, రాఘువేంద్ర, శైలేష్, సంతోష్, శివ చౌదరి, చున్ను పాషా, మోసిన్, నయీమ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

మ్యాన్ హెూల్స్ పైకప్పులు మార్చండి..



నవతెలంగాణ-నిజాంపేట్

బాచుపల్లి నందనవనం కాలనీలో మ్యాన్ హెూల్స్ పైకప్పులు మార్చండి అని కాలనీ వాసులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి నందనవనం కాలనీలో 9 నెలలుగా మ్యాన్ హెూల్స్ పైకప్పులు మూసికపోవడంతో స్థానిక ప్రజలకు రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని కాలనీవాసులు అధికారులకు తెలిపారు. నూతన సిమెంట్ రోడ్డును వేసి, మూడు మ్యాన్ హెూల్స్ నాసిక రకంగా వేయడంతో అవి ఇబ్బందిగా తయారై వాహన దారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. కొన్ని నెలలుగా అధికారులను వేడుకున్నా ఒక్క మ్యాన్ హెూల్ మాత్రమే సరిచేసి, మరో రెండిటిని అలాగే వదిలేశారని కాలనీ వాసులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి సంవత్సరం కాలనీలోని మున్సి పల్ కార్పొరేషన్ అధికారులు ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. కానీ తమకు చిన్నచిన్న సమస్యలు ఉంటే కూడా పరిష్కరించకుండా రేపు, మాపు అంటూ తిప్పుతుండడం ఇబ్బంది కరంగా ఉందని నందనవనం కాలనీవాసులు అధికారులకు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చొరవ తీసుకొని మ్యాన్ హెూల్స్‌ను మార్పించి, సమస్య పరిష్కరించాలని పలువురు బస్తీ వాసులు కోరారు.

రంజాన్ పండుగ శుభాకాంక్షలు

- **బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రంజాన్ పండుగను పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ రాష్ట్రంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్యాగం, ఉపవాసం, సహనం, దయ, సేవా భావం వంటి మహెూన్నతమైన విలువలకు రంజాన్ ప్రతీక అన్నారు. మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తూ శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత అనే సందేశాన్ని విస్తరించాలని తెలిపారు. ఒక నెల పాటు ఉపవాసం పాటిస్తూ భగవంతుని సంకల్పాన్ని పాటించడం, ఇతరుల కష్టాలను అర్థం చేసుకోవడం, పేదవారిని ఆదుకోవడం వంటి ఆధ్యాత్మిక స్ఫూర్తిని మానవాళికి మానవతా విలువలను ప్రతిబింబించే పవిత్రమైన రంజాన్ మాసం అన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం..

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్ అన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్ రెడ్డి నగర్‌లోని శ్రీ మారుతి సాయి ఉమా సంగమేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ... అనంతరం ఉగాది పర్వదినాన కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేని ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, హెూ జగద్గిరి గుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మెన్ వేణు యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు పప్పిరెడ్డి సురేందర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదర సోదరీమణులకు
రంజాన్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రంజాన్ పర్వదిన సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముస్లిం సోదర సోదరీ మణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు కటిక ఉపవాస దీక్షలు ఉండి, రంజాన్ పర్వదినాన అల్లాను ప్రార్థిస్తూ, ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించుకుంటారని తెలిపారు. అల్లా దయతో అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధి లోని భరత్ నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలోని శ్రీ వెంకటేశ్వరుని దర్శిం చుకుని విశ్వసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా పండితులచే పంచాంగ శ్రవణంలో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ భరత్ నగర్ కాలనీ వాసులకు ఉగాది పచ్చడి విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, సీనియర్ నాయకుడు కన్నయ్య, సురేందర్ నాయు డు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బాలానగర్

అంబీర్ చెరువును కాపాడాలి..



- **బీఆర్ఎస్ నేత ఉప్పు జస్వంత్**

నవతెలంగాణ-నిజాంపేట్

ప్రగతి నగర్ అంబీర్ చెరువుని కాపాడాలని బీఆర్ఎస్ ప్రగతి నగర్ ఆరో డివిజన్ అధ్యక్షుడు ఉప్పు జస్వంత్ అన్నారు. అంబీర్ చెరువులో కోళ్ల, చేపల వ్యర్థ పదార్థాలను అక్రమంగా డంపు చేస్తూ.. చెరువు సుందరీకరణను దెబ్బతీస్తున్నారని ఉప్పు జస్వంత్ ఆరోపించారు. ఆదివారం ఆయన చెరువు పరిసరాల్లో కోళ్ల, చేపలు, చికెన్ వ్యర్థాలను డంపు చేస్తున్న వారిని అడ్డగించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓవైపు పాలక కాంగ్రెస్ పార్టీ చెరువుల పరిరక్షణకు తాము ఎంతో కృషి చేస్తున్నామని చెప్పుకుంటుండగా స్థానిక అంబీర్ చెరువులో వ్యర్థాలను పారపోస్తున్న వారికి స్థానిక మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చినట్టు తెలుస్తుందని అయన విమర్శించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ వారి సహకారంతో అంబీర్ చెరువుని కాపాడాలని ప్రయత్నిస్తుండగా స్థానిక అధికారులు మాత్రం చెరువుని దాని సుందరీకరణను పూర్తిగా దెబ్బతీసే పనులకు పూనుకోవడం దారుణమన్నారు. అంబీర్ చెరువుని, ఆ పరిసర ప్రాంతాల్ని ప్రకృతిని పూర్తిగా దెబ్బతీస్తున్న వ్యక్తులపై మున్సిపల్ కమిషనర్ కఠిన చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని ఆయన కోరారు.

చలి వేంద్రాలు దాహాన్ని తీరుస్తాయి..



- **పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

చలి వేంద్రాలు బాటసారులు, వాహనదారుల దాహాన్ని తీరుస్తాయని పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని ఉషాముళ్ళపూడి కమాన్ వద్ద క్షత్రియ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయనతో పాటు కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం చల్లని మజ్జిగను కాలనీ వాసులకు, బాటసారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఉగాది పర్వదినం రోజున చలివేంద్రం ఏర్పాటు చేసుకోవడం చాలా అభినందించదగ్గ విషయం అని అన్నారు. నగరంలో రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రజలు ఎండలకు నీళ్లకు ఇబ్బంది పడకుండా ఉండటానికి ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. చలివేంద్రంను ఏర్పాటు చేయడం చాలా అభినందించదగ్గ విషయం అన్నారు. అన్ని దానల కన్నా నీటి దానం చాల గొప్పదన్నారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలి వేంద్రలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశాల్, క్షత్రియ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి ఆలయంలో
పంచాంగ శ్రావణం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉగాది పర్వదినం సందర్భంగా మాత యోగ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో జగన్ గురూజీ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రదీప్ జోషి ద్వారా నిర్వహించిన పంచాంగ శ్రవణంలో నాయకులు గొట్టిముక్కల దేశాల్ పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా మీకు, మీ కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధి కలగాలని కోరుకుంటూ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

సుఖ సంతోషాలతో ఉండాలి



- **కార్పొరేటర్ రావుల శేషగిరి**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు సంవత్సరాది ఉగాది(విశ్వావసు నామ సంవత్సరం)లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజుల రామారం డివిజన్‌లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. ఆదివారం ఉగాది పురస్కరించుకొని గాజులరామారం డివిజన్ పరిధిలోని గాజులరామారం చౌరస్తాలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం (గాజులరామారం) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఉరవడితో, కొత్త కొత్త ఆలోచనలతో ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్, యాదిరెడ్డి, భరత్ కుమార్, రాధాకృష్ణన్, నాగభూషణం, దనుంజయ, నాగేశ్వర్ రావు, కూరెళ్ళ శ్రీనివాస్, వాసవి సంఘం సభ్యులు పాల్గొన్నారు. శ్రీ వాసవి మాత కృపకు పాత్రులు కావాలని కోరారు.

సహజ పానీయాలు తాగుదాం..



- **జేవీవీ బాచుపల్లి మండల ఉపాధ్యాక్షులు కృష్ణయ్య**

నవతెలంగాణ-నిజాంపేట్

సహజ పానీయాలు తాగుదాం- శీతల పానీయాలు మానేద్దాం అని జేవీవీ బాచుపల్లి మండల ఉపాధ్యాక్షులు కృష్ణయ్య అన్నారు. జన విజ్ఞాన వేదిక బాచుపల్లి మండలం ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతి నగర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రవళిక ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి స్థానికులు హాజరై 'ఉగాది పచ్చడి'ను స్వీకరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలో పాశ్చాత్య దేశాలు పంపిస్తున్న శీతల పానీయాలు విక్రయం చాలా పెరిగిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా విపరీతమైన రోగాల బారిన ప్రజలు పడుతున్నారని తెలిపారు. సహజమైన మజ్జిగ లాంటి ద్రవ పదార్థాలను తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయన వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు సి.హెచ్.ఎం. చారి, సోషల్ మీడియా జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ మధుకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.శంకర్రావు, అమీర్ భాష, బాచుపల్లి మండల అధ్యక్షుడు జి.అనంత కుమార్, రాఖీ అనంత కుమార్, తదితర నాయకులు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


విగ్రహాల స్థాపనకు భూమి పూజ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి రామాలయంలో ఆదివారం, గరుత్మంతుడు, శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం కొరకు ఎమ్మెల్యేకి ఒక లక్ష రూపాయలు చెక్కును రాజేష్ కుమార్ రెడ్డి విరాళంగా అందించారు. కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ రూ. 10వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజా దేవి రంగారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, ఆలయ చైర్మెన్ తులసీరావ్, కూకట్‌పల్లి శివాలయం మాజీ చైర్మెన్ నాయినేని సూర్యారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో
ప్రాబ్లమ్ సొల్యూషన్ ఫిట్ , ప్రొడక్ట్ పై కార్యక్రమం..



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో "ప్రాబ్లమ్ సొల్యూషన్ ఫిట్ ప్రొడక్ట్ మార్కెట్ ఫిట్" అనే అంశంపై సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత స్పీకర్ అనీష్ ఆంటోనీ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఆయన భారత వైమానిక దళం (ఐఏఎఫ్) వింగ్ కమాండర్‌గా టిహబ్ మాజీ కో మైగేట్ సహ వ్యవస్థాపకులుగా అనేక రంగాల్లో సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక విద్యార్థులు ఎంటర్ ప్రెన్యూర్స్‌గా ఎదగడానికి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థి సమయం చాలా విలువైనది అని చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇచ్చేలా, వ్యాపార ఆలోచనలను మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దుకునే విధానాన్ని స్పష్టంగా వివరించారు. అభ్యుదయ భావనలకు దోహదపడే ఈ కార్యక్రమం విద్యార్థులకు గొప్ప మార్గదర్శకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పిఆర్ఓ రవి సుధాకర్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కేవైఎఫ్ వారిని అభినందించిన ఎర్రబెల్లి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

క్షత్రియ యూత్ ఫెడరేషన్ (కేవైఎఫ్) ఆధ్వర్యంలో.. శ్రీ అల్లూరి సీతారామ రాజు పేరు మీద, వేసవి కాలంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజున చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం అని కొని యాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారిని ఎర్రబెల్లి సతీష్ రావు అభినందించారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా..



- **ప్రధాన కార్యదర్శి ఆర్ కె.రాజు పటేల్**

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు రామ్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కెరాజు పటేల్ ఎన్నికయ్యారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా కమిటీ సభ్యులతో కలసి వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆర్ కె రాజు పటేల్ మాట్లాడుతూ నవజీవన్ నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. స్థానికంగా కాలనీలలో ప్రధానంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సహాయ సహకారాలతో పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్, కోశాధికారి దయాసాగర్ , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
హైదరాబాద్
సోమవారం | మార్చి 31, 2025 | www.navatelangana.com



గోల్నాక డివిజన్ దుర్గా నగర్‌లో గల శ్రీ దుర్గా మైసమ్మ దేవాలయంలో శ్రీ విశ్వ వాసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం గావించారు. దేవాలయ ప్రధాన కార్యదర్శి ఎనుగంటి నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కే.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి శంకర్, బస్తీ అధ్యక్షుడు అంజయ్య, రాములు తదితరులు

నవతెలంగాణ-అంబర్‌పేట



ఉగాది పండుగను పురస్కరించుకొని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌ని డివిజన్ అధ్యక్షులు ఎం. సిద్ధార్థ ముదిరాజ్ కార్పొరేటర్‌ను కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు నజయ్ ముదిరాజ్, నరేంద్ర ముదిరాజ్, దశరథ్, కాశిరెడ్డి, సాయి తెలిపారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి

- సోషలిస్ట్ భావాల వ్యాప్తి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి
- గోషామహల్‌లో భగత్ సింగ్ వర్ధంతి వారోత్సవ సభలో డీవైఎఫ్ఐ రాష్ట్ర నేత రమేష్

నవతెలంగాణ-ధూల్‌పేట్

భగత్ సింగ్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలని డీవైఎఫ్ఐ (డెమోక్రాటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. తన 23 ఏండ్ల వయస్సులోనే భారత దేశంలో సోషలిజం తీసుకు రావాల్సిన అవసరాన్ని గుర్తించిన మహా యువనేత 'భగత్ సింగ్' అని భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత నిరంతరం కృషి చేయాలన్నారు. గోషామహల్ చూడి బజార్‌లోని లోహియా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వరయంలో భగత్ సింగ్ సింగ్ 94వ వర్ధంతి వారోత్సవ ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగత్ సింగ్ భారత దేశంలోని యువతపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. నేడు ప్రజల్ని సమస్యలపై ఐక్యం కాకుండా పాలకవర్గాలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటికి లొంగకుండా కర్తవ్య సాధనకు కృషిచేయడం సుఖదేవ్, భగత్ సింగ్,రాజ్ గురులకు మనం అర్పించే నిజమైన నివాళి ఆయన సూచించారు. డీవైఎఫ్ఐ హైదరాబద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఏ.కృష్ణ అధ్యక్షత వహించారు. స్థానిక మాదిగ బందు మిత్ర సంఘం నేతలు ఆర్.సుమన్ కుమార్,



సీహెచ్ నాగరాజు, స్థానిక సీఐటీయు, ఇతర ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, ఎం.డి.అయూబ్ ఖాన్, డి.శంకర్, ఎన్.శ్రీ రాములు, ఎన్.గోపాల్, కే జంగయ్య, ఏ శ్రీను, పి.నాగేశ్వర్, ఎస్.చిన్న రాము, ఎం మహేంద్ర్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

సౌత్ జిల్లా మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం జంగం మెట్ డివిజన్‌లో ఉగాది పండుగను పురస్కరించుకొని ఉగాది పచ్చడి చేశారు. ఈ సందర్భంగా ఐద్వా సౌత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.లక్ష్మమ్మ శశికళ మాట్లాడుతూ.. ఉగాది పండుగ ప్రజల యొక్క జీవితంలో ముఖ్యమైనటువంటి అంశంగా ఉందన్నారు. ప్రధానంగా ప్రజలు ఈ పండుగను పురస్కరించుకొని తీపి, చేదు, వగరు జీవిత ఎదురయ్యే అంశాలను ధైర్యంగా ఎదుర్కోవడం కోసం ఉగాది పండుగని జరుపుకోవడం జరుగుతుందన్నారు. తెలుగు వాళ్లకు ఉగాది అనేది సంవత్సరానికి ప్రారంభంగా భావిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క గృహంలో గృహిణులందరూ కూడా పచ్చడి తయారు చేసి పంపిణీ చేసుకోవడం, ఈ పచ్చడిలో కలిపే ప్రతిపదార్థం కూడా జీవితంలో మనుషులు ఎదురయ్యే అంశాలకు సంబంధించిన ఉంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభు



త్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కొంత మంది పెట్టుబడిదారులు ఆనందంగా ఉన్నారని మిగతా 90 శాతం మంది ప్రజలు కష్టాల్లో బాధల్లో ఉన్నారన్నారు. అలాంటి వారికి ప్రభుత్వాలు సహాయం చేసే పద్ధతిలో ఆలోచించాలని అప్పుడే ప్రజల జీవితాల్లో నిజమైన ఉగాది పండుగ చిగురుస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చాంద్రాయణ గుట్ట జోను అధ్యక్ష, కార్యదర్శులు కవిత, సుజాత, స్థానిక జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పండుగలను కాపాడుకుందాం..



- ప్రజానాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎన్.మారన్న

నవతెలంగాణ-ధూల్‌పేట్/మెహిదీపట్నం

తెలుగు పండుగలను కాపాడుకుందామని, అది ప్రతి ఒక్కరి భాధ్యత అని ప్రజానాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎన్.మారన్న అన్నారు. ప్రజానాట్యమండలి నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా ఉగాది పచ్చడి కార్యక్రమం శివాజీ నగర్ భోజగుట్టలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిందాబాద్ నగర కార్యదర్శి కె.వీరయ్య హాజరై మాట్లాడుతూ.. మన తెలుగు పండుగలు కనుమరుగవుతున్నాయన్నారు. తెలుగు పండుగలను కాపాడుకునే బాధ్యత మన అందరిదని, విదేశీ సంస్కృతి మోజులో మన యువత మన ఆచార వ్యవహారాలను పండుగలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. యువత ఆ మోజులో నుండి బయటికి రావాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు పండుగల తియ్యదనం, ఆ నేపథ్యం ఎంతో మధురమైనదన్నారు. ఆ రుచుల కలయికలే మన తెలుగు పండుగల ప్రతిబింబాలని వాటిని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేష్, సీహెచ్ వెంకటస్వామి, బి.శంకర్, పి.కళ్యాణ్, విజయనిర్మల, ఎస్.దినేష్, ఎస్ మనస్వి, వీరేశం, శివాజీ నగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ బులుసు అపర్ణ అష్టావధానం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విశ్వావసు నామ ఉగాది సందర్భంగా ఆదివారం రస తరంగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ప్రముఖ అవధాని డాక్టర్ బులుసు అపర్ణ అష్టావధానం చేశారు. పృచ్ఛకులుగా డాక్టర్.ఆచార్య ఫణీంద్ర, మరుమాముల దత్తాత్రేయ శర్మ, వీవీ.సత్యప్రసాద్, డా. వారిజరాణి, డా.వాసుదేవ రావు, సరస్వతీ రామశర్మ సాధన నరసింహాచార్య, డాక్టర్. అవుసుల భాను ప్రకాశ్ వ్యవహరించారు. బులుసు అపర్ణ అష్టావధానం అందర్నీ ఆకట్టుకుంది. ప్రవచకులు డాక్టర్.



టీకే చూడామణి సంచాలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రసతరంగిణి అధ్యక్షులు చిలకమర్రి కిషోర్, కార్యదర్శి టీకేఎల్ఎన్ ఆచార్యులు, కోశాధికారి వంగల రంగనాథ్ పెద్ద ఎత్తున ప్రేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల పంచాంగ శ్రవణం..











నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట, చీర్యాల లక్ష్మి నృసింహ్మ స్వామి ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సరం పంచాంగం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాంగం వేడుకల్లో కీసరగుట్ట ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ, చీర్యాల లక్ష్మి నృసింహ్మ స్వామి ఆలయ చైర్మెన్ మల్లరపు లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఉప్పల్

హృదయ భారతి స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ స్వర్ణపుష్పం మాసపత్రిక చీఫ్ ఎడిటర్ డాక్టర్ మక్కపాటి మంగళ ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వావసు నామ ఉగాది పంచాంగం అదే విధంగా స్వర్ణ పుష్పం మాసపత్రికను ఆదివారం రామంతపూర్‌లో ప్రణవ ఆశ్రమం పీఠాధిపతి సత్యానంద స్వామి ప్రముఖ కవులు కసిరెడ్డి వెంకటరెడ్డి మసన చెన్నప్పలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిథి వారం నక్షత్రం కరణం యోగం ఈ ఐదు భాగాలు కలయకే పంచాంగమన్నారు. డాక్టర్ మంగళ మక్కాపాటిని వారు అభినందించారు. అనంతరం ప్రముఖ జ్యోతిష్య పండితుడు వాసం పాండు పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు బ్రహ్మచారి, కపిల్తేశ్వర్, విశాలాక్షి, శివ, గణేష, ప్రభాకర్ చారి, దేవాదినం , తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-శామీర్‌పేట

తూముకుంట మున్సిపాలిటీ శామీర్ పేట, మండలం మూడు చింతలపల్లి మండలాల వ్యాప్తంగా తెలుగు నూతన సంవత్సరం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పెద్దమనుషుల సమక్షంలో బ్రాహ్మోత్తములు నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడి వితరణ చేయగా భక్తులు స్వీకరించారు. మూడు చింతలపల్లి మండలం లోని లక్ష్మాపూర్ గ్రామంలో హనుమాన్ టెంపుల్ లో పంచాంగ శ్రవణం అనంతరం శ్రీరామ నవమి సందర్భంగా రాముల గుట్ట నందు నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణ మహెూత్సవం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, రాములగుట్ట చైర్మెన్ ఎల్లగౌని చిత్తయ్య ప్రధాన కార్యదర్శి లగిశెట్టి అరుణ్, గ్రామ పెద్దలు క్యాతం మధుక్రిష్ణ, బండి జగన్నాథం, మర్యాల వీరేశం, కిసరి నర్సిములు, యువకులు కటికెల గోపి, లక్ష్మణ్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చర్లపల్లి

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని మల్లాపూర్, నాగలక్ష్మి నగర్ కాలనీలోని శ్రీ నందీశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. పండితులు శేష సాయి శర్మచే పంచాంగ శ్రవణ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీజీ సుదర్శన్, శ్రీహరిగౌడ్, రాపోలు సతీష్, కృష్ణారెడ్డి, ఉపేందర్ రావు, అనంత రామ్, ప్రవీణ్, తండా వాసుగౌడ్, దయాకర్ రెడ్డి, మల్లారెడ్డి, కోయకొండ రాజేష్, నర్సింగ రావు, కృష్ణ, శ్రీశైలం, రఘు, కృష్ణ, శ్రీనివాసరావు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలు, నిరాశ్రయుల మధ్యలో స్కై ఫౌండేషన్ ఉగాది వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

నూతన తెలుగు విశ్వావసు సంవత్సరం సందర్భంగా రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న నిరాశ్రేయలు, అనాథలకు ఉగాది పచ్చడి, బక్షాలు, పులిహెూర, దద్దోజనం, అరటిపండ్లు, నీళ్ల ప్యాకెట్స్ స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సేవ సభ్యులు అంజనేయులు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వావసు నమః ఉగాది పండుగ సందర్భంగా బాపూజీ నగర్, భోలక్‌పూర్ డివిజన్‌లలో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాగేష్ ముదిరాజ్ ఈ సందర్భంగా వారు నిర్వాహకులు లడ్డూ ఆధ్వర్యంలో ప్రజలకు పచ్చడి, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చక్రం, రాజు, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు. నవతెలంగాణ-ముషీరాబాద్



ఉగాది పంచాంగం వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి

నవతెలంగాణ-అంబర్‌పేట

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన తెలంగాణ శేఖర్‌చారి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ బీసీ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ శేఖర్ చారి..





పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేసిన పీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరి గౌడ్, డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కైలాష్ పతి గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ మామిడాల రాజకిరణ్ తదితరులు నవతెలంగాణ-అంబర్‌పేట



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కి ఉగాది శుభాకాంక్షలు తెలియజేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్ ధాత్రిక్ బాబ్జి

నవతెలంగాణ-అంబర్‌పేట

రాజ్యాంగాన్ని పల్లె పల్లెన ప్రచారం చేయాలి

- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్ర, రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ముషీరాబాద్

భారత రాజ్యాంగం పది కాలాల పాటు పదిలంగా వర్ధిల్లాలంటే పల్లె పల్లెన కళాకారులచే ప్రచారం చేయాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో మంచికి శ్రీకారం ఉగాది పండుగ రోజున భారత రాజ్యాంగ శ్రవణం చేశారు. జి. నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగం అంటే శాస్త్రీయ విజ్ఞానం ప్రామాణిక గ్రంథం. నేటికీ రాజ్యాంగమే దేశానికి రహదారి అని కొనియాడారు. జ్యోతిష్యానికి శాస్త్రీయ ప్రమాణాలు లేవు ముందు జరగబోయేది ఎవ్వరూ చెప్పలేరు.. పంచాంగాలు ప్రపంచ గతిని మార్చలేదు విజ్ఞానం పరిశోధన ఆచరణే మార్గదర్శకాలని అన్నారు. కళాకారుల జేఏసీ చైర్మెన్ మురళీధర్ దేశ్ పాండే మాట్లాడుతూ ఉగాది కాంతి



కళాకారుల కేక్కడ? కోకిల రాగాలు తప్ప కాంగ్రెస్ హామీ లెక్కడ? కళాకారుల సంక్షేమం పచ్చడి ఎవ్వరికీ పోశారన్నారు. కళాకారుల కడుపు కొట్టిన సర్కారు మరో పదేండ్లు కాదు అర్ధాంతరంగా ముగిస్తుందని హెచ్చరించారు. భావి భారత పౌరుడి చేతిలో భారత రాజ్యాంగాన్ని పట్టించి భారత రాజ్యాంగం పై ప్రమాణం చేశారు. ఉగాది కవితలు చదివి వినిపించారు. ఈకార్యక్రమంలో టీపీఎస్‌కే నాయకులు పి. నాగేశ్వరరావు, మహేష్ దుర్గే డప్పు స్వామి, రాజయ్య గౌడ్ యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్స్, బ్రాహ్మణి, వెంకట్ కోన తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 జనరల్ ఫలితాలలో సివిక్ సెంటర్ ఐఏఎస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రూప్ వన్ జనరల్ ఫలితాలలో సివిక్ సెంటర్ ఐఏఎస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. అకాడమి చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ చోళ దార్శనికతతో 2025 ఉగాది విడుదల చేసిన తెలంగాణ గ్రూప్ 1(2024) జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ లో మొదటి 10 ర్యాంకులలో మూడు ర్యాంకులు, మొదటి 50 ర్యాంకుల్లో 14 ర్యాంకులు, మొదటి 100 ర్యాంకులలో 26 ర్యాంకులు, మొదటి 200 ర్యాంకులలో 48 ర్యాంకులతో ఫలితాల మొత్తం 1490 ర్యాంకులతో ప్రభంజనం సృష్టించింది. అలాగే ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 2 ఫలితాల యందు కూడా సివిక్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటి టాప్ 100 యందు 38 విద్యార్థులు నిలిచారు. అలాగే కొంత మంది విద్యార్థులు గ్రూప్ యందు కూడా వారి ప్రతిభ చాటారు.

సాహిత్యం సమాజ మార్పునకు దోహదపడాలి

- డాక్టర్ కొలకలూరి ఇనాక్

నవతెలంగాణ-ధూల్‌పేట్

సాహిత్యం సమాజాన్ని మార్చడానికి, సమాజంలోని ఎత్తు పల్లాలను సరి చేయడానికి, సామాజిక ఒడిదుడుకులను, సామాజిక రుగ్మతలను నయం చేయడానికి ఉపయోగపడాలని, అలాంటప్పుడే అది అభ్యుదయ సాహిత్యంగా పరిగణించబడుతుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలంగాణ సాహితి- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం ఆలం ఖుంద్ మీరి భవన్, ఐఎస్ సదన్ చౌరస్తా, సంతోష్ నగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యం అనేక రకాలుగా ఉంటుందని, అందులో భావం, శిల్పం కేవలం మానసిక ఉల్లాసాన్ని కలిగించేదిగా ఉంటే సరిపోదని మనిషికి చైతన్యాన్ని కలిగించేలా ఉండాలన్నారు. మరో అతిథి కవి, రచయిత, సాహిత్య అనువాదకులు డాక్టర్ ఎలనాగ సాహిత్యం ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉన్నప్పుడే అది అనువాదానికి పురిగొల్పుతుందన్నారు. ఒక భాషలో వచ్చిన సాహిత్యం మరో భాషలో అనువాదం చేయాలంటే దాని భావాన్ని, శిల్పాన్ని పట్టుకోవాలన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కటుకోజ్వల ఆనందాచారి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాల కాలం ముందున్న సాహిత్యానికి నేటి సాహిత్యానికి చాలా తేడా ఉంటుందన్నారు. ఒక రచన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై ప్రభావం చూపించగలిగినప్పుడే దానికి సార్ధకత ఉంటుందన్నారు.శాస్త్రజ్ఞులు అనేక ప్రయోగాల ద్వారా



చంద్రుడిపై వెళ్లి వస్తే శివ శక్తి అని ఆ స్థలానికి పేరు పెట్టడం విడ్డూరమన్నారు. మరోవైపు సోషల్ మీడియా అభివృద్ధి అయిన తర్వాత పుస్తకాలు ఎవరు చదువుతున్నారు. పుస్తకాలు చదివే వారు లేనే లేరని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అది సరైనది కాదని నేటి కవులు రచయితలు రుజువు పరుస్తున్నారని, ఇది హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి మహేష్ దుర్గే అధ్యక్షత వహించగా రేఖా రెడ్డి, కొండ రవీందర్ కవి సమ్మేళనం నిర్వహించారు. తంగిరాల చక్రవర్తి, గజవెల్లి దశరథ రామయ్య, సీతారపు వెంకటనారాయణ, షేక్ సలీమా, సయ్యద్ ముజాహిద్ అలీ, గడ్డం సులోచన, ఎం.జి సరస్వతి దేవి, వంశీకృష్ణ, దేవరశెట్టి రవికుమార్, విజయశ్రీ, పద్మా రెడ్డి, 35 మంది కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు.

రామ్ ప్రదీప్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-కాప్రా

బీజేపీ రాష్ట్ర ఉపాధక్షలు, ఉప్పల్ మాజీ ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ 59వ జన్మదిన సందర్భంగా మౌలాలి వాత్సల్య సింధులో ఉన్న పిల్లలకు బీజేపీ హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పూసల బ్రహ్మచారి, జిల్లా నాయకులు జంగా బాలరాజు, తదితరులున్నారు.

బోడుప్పల్‌లో ఘనంగా పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-బోడుప్పల్

తెలుగు సంవత్సరాది ఉగాది రోజును పురస్కరించుకొని బోడుప్పల్ కార్పొరేషన్ బంగారు మైసమ్మ దేవాలయంలో ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, సామల బుచ్చిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి,కార్పొరేషన్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

● జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ



మానవళి హితాన్ని ఆకాంక్షించే పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని ప్రతిబింబించేలా ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర సోదరి మణులకు జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పవిత్ర రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ శుభాకాంక్షలు

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



నేడు రంజాన్ పండుగను పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం జిల్లా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యంగా ప్రజలందరూ కలిసి మెలిసి పండుగలను జరుపుకోవాలని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కులమతాలకు అతీతంగా..
పండగలు జరుపుకోవాలి



● మాజీ డీసీపీ అధ్యక్షులు కె.యం. ప్రతాప్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలని మాజీ డీసీపీ అధ్యక్షులు కె.యం. ప్రతాప్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్.ఎన్. రెడ్డి నగర్‌లో గల నూరే మహమ్మదీయ మసీద్ కమిటీ సభ్యులు, ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు కె.యం.ప్రతాప్‌ని తన నివాసంలో కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు.

ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... ముస్లింలు జరుపుకునే పండుగలు అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు , నూరే మహమ్మదీయ మస్జిద్ కమిటీ సభ్యులకు ఉగాది , రంజాన్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జుబేర్, హుస్సేన్, ఇస్మాయిల్, సయ్యద్, ఇబ్రహీం, హుస్సేన్, అమినుద్దీన్, మన్సూర్, మెహమూద్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ ఆంజనేయులు పదవీ విరమణ

● బాలానగర్ అదనపు డీసీపీ పి. సత్యనారాయణ

● ఏఎస్ఐ ఆంజనేయులుకు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో బాలానగర్ సీఐ నరసింహ రాజు ఆధ్వర్యంలో హెచ్ఏఎల్ కళ్యాణమండపంలో ఈ వేడుక జరిగింది. బాలానగర్ అదనపు డీసీపీ పి.సత్యనారాయణ, బాలానగర్ అదనపు ఎస్పీ జి. హనుమంతా రావు, జీడిమెట్ల సీఐ.మల్లేష్, జగద్గిరిగుట్ట సీఐ.నరసింహ, డీఐలు నాగిరెడ్డి, కనకయ్య, యాదయ్య తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐని ఆదివారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులను శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పదవి విరమణ పొందిన ఆంజనేయులు, అతని సతీమణి విజయలక్ష్మి ని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాలతో కప్పి, మిఠాయిలు తినిపించి, బాలానగర్ పోలీస్ సిబ్బంది జ్ఞాపికను, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు రాంనారాయణ, హాజీ మియా, సరళ, పిఎస్ఐలు వెంకటేశం, వినోద్, హెచ్సీలు, పీసీలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ విశ్వా వసు' తెలుగు నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట్

తెలుగు నూతన సంవత్సరాది "శ్రీ విశ్వావసు" తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని కార్పొరేషన్‌లోని వివిధ ఆలయాల్లో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజాంపేట గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు రామస్వామితో ఉగాది నూతన సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మెన్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, గ్రామ పెద్దలు లీడర్ నరసింహారెడ్డి, సాయన్న, సంజీవరెడ్డి, నగేష్ చారి, జనార్దన్ రెడ్డి, కొలను చంద్రశేఖర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో స్థానికులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మెన్ మాట్లాడుతూ తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది నుండి ప్రారంభమవుతుందని ఈ నూతన సంవత్సరం అందరికీ శుభకరమై అన్నింట్లో విజయం చేకూర్చాలని కోరుతూ కార్పొరేషన్ ప్రజలకు నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాంతారావు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం





నవతెలంగాణ-కూకట్‌పల్లి

స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ అండ్ చైర్మెన్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో.. ఉగాది రోజున కూకట్‌పల్లి బీజేపీ ఆఫీస్ వద్ద ముఖ్యఅతిథిగా సూర్య ప్రకాష్ రావు హాజరై ఆయన చేతుల మీదగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వడ్డేపల్లి రాజేశ్వరరావు, సూర్యారావు, శ్రీకర రావు, వినోద్, పద్మాకర్‌లు హాజరై మజ్జిగ, మంచినీరు పంపిణీ చేయడం జరిగింది.

వడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు..

తెలుగువారి నూతన సంవత్సర వేడుక, ఉగాది పండుగ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్కనపల్లి సూర్యరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి కార్యకర్తలు జి. పాపరావు, కర్క డాకయ్య, సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ మరియు టీం వి.ఆర్.ఆర్ సభ్యులు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోదర భావానికి ఇఫ్తార్ విందు ప్రతీక

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-నేరేడ్ మెట్



మత సామరస్యానికి నిదర్శనం, సోదరుభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని మాజీ ఎమ్మెల్యేమల్కాజిగిరి మసీదులో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హను మంతరావు, కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మల్కాజిగిరి బిబ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, లక్ష్మీకాంతరెడ్డి, ఉమేష్ సింగ్, సత్యమూర్తి, సత్యనారాయణ, సంపత్ రావు, హైమద్, ఫరీద్, ఎండి అలీ, సయ్యద్ మబ్బు, గఫూర్, సయ్యద్ అక్తర్, రాందాస్ సంతోష్, సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, రత్న భూషణ్ రావు కిషోర్, నరసింహారెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కించపరిచే
విధంగా మాట్లాడటం సరికాదు

● తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామినేని వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్న

నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీలో విద్యాశాఖ బడ్జెట్‌పై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామినేని వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్న తెలిపారు. ఉపాధ్యాయులు సంవత్సరంలో కేవలం సగం రోజులే పని చేస్తున్నారనీ, జీతాలు మాత్రం సంవత్సరానికి తీసుకుంటున్నా రని అర్థం వచ్చేలా మాట్లాడటం సరికాదని తెలిపారు. తాము కూడా మిగతా ఉద్యోగులాగే పని చేస్తున్నామనీ, కేవలం మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం విద్యార్థులకు సెలవులు ఇస్తారనీ, ఆసమయంలో తాము ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అందుబాటులోనే ఉంటున్నామని తెలిపారు. ఒకవేళ పిల్లలకు ఎలాంటి సెలవులివ్వకుండా బోధన సాగించే విధంగా అకాడమిక్ క్యాలెండర్‌ను రూపొందించి ఇస్తే ఆ విధంగా పని చేయడానికి ఉపాధ్యాయ లోకమంతా సిద్ధంగా ఉందని తెలిపారు. మిగతా ఉద్యోగులు తమ కంటే 30 రోజులు ఎక్కువగా పని చేస్తారనీ, అందుకు తగ్గట్టుగానే వారికి 30 సంపాదిత సెలవులు కూడా ప్రభుత్వం ఇస్తున్న విషయం సీఎంకి తెలియనిది కాదని తెలిపారు. విద్యాశాఖను కూడా నాన్ వేకేషన్ శాఖగా మార్చి పిల్లలకు ఎలా బోధన చేయాలో నూతన శిక్షణ కార్యక్రమాలకు ప్రణాళికలను రూపొందించాలని కోరారు. ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో, ఇంకా ఉన్నతంగా బోధించడానికి అవసరమైన నూతన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

బాక్స్ క్రికెట్ సెంటర్ ప్రారంభం



● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వినాయక్ నగర్, ఓల్డ్ సఫిల్ గూడ బిసైడ్ ఇండియన్ పెట్రోల్ పంప్ పక్క లైన్ వద్ద ఎస్ ఎం ఇండోర్ స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎస్ ఎం బాక్స్ క్రికెట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని ఎస్ఎం బాక్స్ క్రికెట్ సెంటర్‌ను నిర్వాహకులు బి.రవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు బాక్స్ క్రికెట్ ద్వారా క్రికెట్ ను నేర్చుకునేందుకు ఈ సెంటర్లు బాగా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, గుండా నిరంజన్, ఎస్ ఆర్ ప్రసాద్, పిట్ల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మిడతపల్లి చిరంజీవికి ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఓయూ



మహబూబాద్ జిల్లా, దంతాలపల్లి మండలం, బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన మిడతపల్లి చిరంజీవి, ముత్యం, భద్రమ్మల కొడుకు మిడతపల్లి. చిరంజీవికి ఓయూ డాక్టరేట్ ప్రధానం చేశారు. అయిన వృక్ష శాస్త్రం (బోటని) విభాగంలో 'పోలెన్ ఐడెంటిఫికేషన్ అండ్ డైవర్సిటీ ఇన్ సెలెక్టెడ్ మెడిసినల్ ప్లాంట్స్ ఆఫ్ హైదరాబాద్ తెలంగాణ స్టేట్ ఇండియా' అనే అంశంపై డా.పి.ఛాయా పర్యవేక్షణలో (గ్రిడ్ షిప్)లో పరిశోధన చేసినందుకు ఆయనకు ఓయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. చిరంజీవి ఒకటి నుంచి ఆరవ తరగతి స్వగ్రామంలో, 7 నుంచి 10 వ తరగతి నర్సంపేట సోషల్ వెల్ఫేర్‌లో, ఇంటర్మీడియట్ స్టేషన్ ఘనపూర్ సోషల్ వెల్ఫేర్‌లో బీఎస్సీ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బీఈడి బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఎంఎస్సీ-మాస్టర్ ఆఫ్ సైన్స్ ఓయూలో, ఎంఈడీ-మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో పూర్తి చేశారు. ప్రస్తుతం ఓయూ నుంచి పీహెచ్డీ పూర్తి చేశారు. పరిశోధనలో భాగంగా 6 ఆర్టికల్స్ పేపర్ పబ్లికేషన్స్ చేశారు. వివిధ జాతీయ అంతర్జాతీయ సెమినార్సులాలో పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్ చేశారు. పరిశోధనలో సహకరించిన బోటనీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్స్, ఆజాద్ చంద్రశేఖర్ హైకోర్టు అడ్వకేట్‌కి, మిత్రులు మనోజ్ కుమార్, టి శ్రీను కి, కోస్కాలర్స్ జీవన్ కుమార్, నవీన్ కుమార్, చంద్రబాబు, శబ్బంకి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం మేఘ అండ్ ఒమేగా కాలేజ్‌లో బోటనీ సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. అయినకు ప్రొఫెసర్స్, మిత్రులు, గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేశారు.

రామరాజు నగర్‌లో ఉగాది వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం 132 - జీడిమెట్ల డివిజన్ రామరాజు నగర్‌లో నిర్వహించిన "విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలకు" బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రకృతి తనను తను మార్చుకుంటూ, జీవితంలో మనకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ నూతన ఉత్తేజంతో మనం ముందుకు సాగాలని సూచించేదే ఉగాది పండుగ అని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి నన్ను మూడుసార్లు గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషించిన రామరాజు నగర్ కాలనీ వాసులకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే గణేష్, బాల మల్లేష్, రామరాజు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ఉపాధ్యక్షులు దయానంద్ రెడ్డి, కార్యదర్శి అమ్మి రెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు స్థానికులు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్స్ మానండి.. సహజ పానీయాలు తాగండి

● జన విజ్ఞాన వేదిక

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



నేటి తరానికి కూల్‌డ్రింక్స్ రూపంలో పెను ముప్పు వచ్చి పడిందని, యువతీ యువకులంతా కూల్‌డ్రింక్‌కు అలవాటుపడి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని సినీ గేయ రచయిత నంది అవార్డు గ్రహీత ప్రొ. వెనిగళ్ళ రాంబాబు అన్నారు. ఆరోగ్యానికి హానిచేసే కూల్ డ్రింక్స్‌ను మానేయాలని కోరారు. ప్రకృతి సిద్ధంగా తయారు అయినా కొబ్బరి బొండం, చెరుకు రసం, మజ్జిగ, నిమ్మరసం లాంటి సహజ పానీయాలను తాగాలని ఆయన సూచించారు. జేవీవీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మధురానగర్ కాలనీ మాజీ సెక్రెటరీ సీహెచ్ విజయవాణి, జేవీవీ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర రావు కృష్ణ కాంత్ పార్క్ మెయిన్ గేటు వద్ద ఆదివారం నిర్వహించారు. 'కూల్ డ్రింక్స్ మానేద్దాం-సహజ పానీయాలు సేవిద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జూబ్లీహిల్స్ జోన్ అధ్యక్షులు సైంటిస్ట్ ఎస్.రవి, పోసాని సుబ్బారావు, వై.యాదగిరి, జి.రాజశేఖర్, ఎస్ జితిన్ ప్రసాద్ వై. ప్రేమ్, జి.బిక్షపతి, ఆర్. అశోక్, కృష్ణకాంత్ పార్క్ వాకర్ అసోసియేషన్ సభ్యులు లాయర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో మన్ కీ బాత్ ప్రసారం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రధానమంత్రి నరేందర్ మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలందరూ వీక్షించేందుకు ఆదివారము బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ తన కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యకర్తలు కలిసి మన్ కీ బాత్ వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత 70 ఏండ్లలో ఏ ప్రధానమంత్రి చేయనటువంటి అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారని మురళీధర్ రావు అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రచారం కావటం ఆనందంగా ఉందని తెలిపారు. అన్ని రంగాలలో ప్రజలకు ఉపాధి కలుగుతుందో వాటి గురించి పేద ప్రజలకు వివరించి, అనేక విషయాలపై పీఎం ప్రస్తావించాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ పురస్కరించుకొని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదివారం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సీఎంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో ఉగాది వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఉగాది పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ బాయ్, మన్నే ఉదయ్ యాదవ్, జనరల్ సెక్రెటరీ హరినాథ్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్ రావు, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, పిట్ల రాజు ముదిరాజ్, పోచయ్య, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఆల్ఫా హోటల్ సిబ్బంది దాడి



నవతెలంగాణ-బేగంపేట్


తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా కేక్ తీసుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తిపై ఆల్ఫా హోటల్ సిబ్బంది దాడికి పాల్పడాడు. ఈ ఘటన సికింద్రాబాద్ మార్కెట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్‌కు చెందిన శేఖర్ తన కూతురు బర్త్ డే సందర్భంగా కేక్ తీసుకుని వెళ్లేందుకు ఆల్ఫా హోటలకు వెళ్లాడు. కేక్ కావాలని కౌంటర్‌లో ఉన్న వ్యక్తిని అడిగాడు. కౌంటర్‌లో ఉన్న వ్యక్తి కేక్ చూపించగా అవి ఫ్రెష్‌గా అనిపించడం లేదని, ఫ్రెష్‌వి ఉంటే ఇవ్వాండి అన్నందుకు అతనితో సిబ్బంది. గొడవకు దిగారు. దాంతో అక్కడే ఉన్న సిబ్బంలుందరు అతన్ని చుట్టుముట్టి దాడికి పాల్పడ్డారు. గాయాలపాలైన శేఖర్ మార్కెట్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఆల్ఫా హోటల్ సిబ్బంది అరాచకాలు తరచూ కష్టమర్లపై దాడులు..

ఆల్ఫా హోటల్ సిబ్బంది అక్కడకు వచ్చే కష్టమర్లపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఓ వ్యక్తి అక్కడ బిర్యానీ తీసుకోగా, అది బాగా లేదన్నందుకు అతనిపై దాడి చేశారు. పలుమార్లు హోటల్లో ఆకస్మిత తనిఖీలు చేపట్టిన జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఇదేకాకుండా హోటల్ ఎదుట ఆటోలు నిలిపిన ఆటోడ్రైవర్లపై రెండు పర్యాయాలు దాడులు చేశారు. హోటల్ ముందు పండ్లు అమ్ముకునేవారిని అక్కడ నుంచి బండ్లుతీయాలంటూ వారిపై కూడా దాడులుచేశారు. వీటిపై సదరు హోటల్ యజమాన్యం పట్టించుకోవడం లేదని బాధితులు పేర్కొన్నారు. తరచూ దాడులకు పాల్పడుతున్న హోటల్ సిబ్బందిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నేడు ఈద్-ఉల్-ఫితర్

- ముగిసిన రంజాన్ ఉపవాస దీక్షలు..ప్రార్థనలకు ఏర్పాట్లు
- ముస్తాబైనా చారిత్రక మసీదులు..ఈద్గాలు
- కొనుగోలుదారులతో పాతబస్తీ మార్కెట్లు కిటకిట
- రాత్రింబవళ్లు కొనసాగిన కొనుగోళ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగరం రంజాన్ పండుగ శోభను సంతరించుకుంది. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలతో నెలరోజులపాటు గడిపిన ముస్లిం సోదరులు నెలవంక దర్శనంతో సోమవారం ఈదుల్ ఫితర్‌ను జరుపుకోనున్నారు.

మార్కెట్లకు పండుగ శోభ..

రంజాన్ పర్వదినం సందర్భంగా ఓల్డ్‌సిటీతో పాటు నగరంలోని పలు మార్కెట్లలో తెల్లవారుజాము వరకు వ్యాపార కార్యకలాపాలు నడిచాయి. మార్కెట్లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. అర్ధరాత్రి వరకూ దీపాల వెలుగులో పండుగ షాపింగ్ చేసుకోవడానికి ముస్లింలు ప్రాధాన్యం ఇస్తారు. దాంతో అర్ధరాత్రి దాటాక నగరంలో బజార్లు జనం రద్దీతో కిటకిటలాడాయి. రంజాన్ కొనుగోళ్లు చివరి దశకు చేరుకోవడంతో క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. ముస్లిం సోదరుల కొనుగోళ్లతో చార్మినార్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అయితే షాపింగ్ కోసం కేవలం నగరవాసులే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం ప్రజలు తరలివచ్చారు. ఓల్డ్‌సిటీలోని చార్మినార్, మదీనా, లాడ్ బజార్, పత్తర్‌గట్టీ, గుల్జార్‌హౌజ్, ఘాన్సీ బజార్, పటేల్ మార్కెట్, షహరాన్ వంటి బడా మార్కెట్లుగా పిలువబడుతున్నాయి. ఇదే క్రమంలో వాటికి పోటీగా వివిధ బస్తీల్లోనూ మార్కెట్లు వెలిశాయి. కొనుగోలుదారులు చార్మినార్‌కు మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ మార్కెట్‌లకూ వెళ్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు సైతం వినియోగదారులతో కిటకిటలాడాయి. ఎండల తీవ్రతకు పగటి సమయంలో జనం కాస్త తక్కువగా ఉన్నప్పటికీ రాత్రి సమయాల్లో భారీగా తరలి వస్తున్నారని షాపుల నిర్వహకులు చెబుతున్నారు.

ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద ఏర్పాట్లు

హైదరాబాద్ నగరంలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన ఈద్గా మీరాలంతో పాటు లంగర్‌హౌజ్, కొత్తపేట్, మాదన్నపేట్, ఎర్రగడ్డ, సికింద్రాబాద్ ఈద్గాలలో ప్రార్థనలకు ఏర్పాట్లు జరిగాయి. అంతేగాక బస్తీల్లో ఉన్న మసీదుల్లోనూ ఏర్పాట్లు చేసి ముస్తాబు చేసినట్టు మతపెద్దలు తెలిపారు.

లాడ్ బజార్‌కు మహిళల తాకిడి

సాధారణంగా లాడ్ బజార్‌లో రకరకాల గాజులు లభ్యమవుతాయి. రంజాన్ పండుగ సందర్భంగా వివిధ రకాల గాజులు లాడ్ బజార్‌లో అందుబాటులో ఉన్నాయని తెలుసుకున్న మహిళలు పెద్దసంఖ్యలో లాడ్ బజార్‌కు చేరుకుని గాజులు కొనుగోలు చేస్తున్నారు.

సేమియా, డ్రై ఫ్రూట్స్‌కు పెరిగిన గిరాకీ..

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రత్యేకంగా తయారు చేసే షీర్ ఖుర్మా కోసం సేమియా, డ్రై ఫ్రూట్స్ దుకాణాలలో గిరాకీ ఎక్కువైంది.

రూ.60, నుంచి రూ.1000 వరకు సేమియా ధర పలికింది. హలీమ్ లేక పోయినా షీర్ ఖుర్మాతో ప్రత్యేకతను చాటుతారు.

హలీం విక్రయాలకు డిమాండ్

రంజాన్ ఆఖరి రోజు కావడంతో పెద్దసంఖ్యలో హలీం తినడానికి పిస్తా హౌజ్, షా గౌస్ హోటళ్ళ వద్దకు ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. మాంసం దుకాణాలు, పాల దుకాణాలు, కిరాణ దుకాణాల్లో సందడి కనిపించింది.

చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన కార్పొరేటర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

వేసవికాలం దృష్టిలో ఉంచుకొని బాటసారులతో పాటు దారిలో వెళ్లే వాహనదారులకి, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల దప్పిక తీర్చాలని గొప్ప ఆలోచనతో ఉగాది పర్వదినం సందర్భంగా ఉచిత చలివేంద్రాన్ని ఫిలిం నగర్ కూడలి వద్ద కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సొంత నిధులతో ఏర్పాటు చేశారు. నీటిని వృధా చేయకండి నీరు ప్రతి జీవికి ప్రాణాధారమని ప్రతి ఒక్కరూ నీటి వృధాను తగ్గించుకోని వేసవి కాలన్నీ గడిపెయ్యాలని కోరారు. గత ప్రభుత్వం వాటర్ బోర్డుతో కలిసి ఉచిత మంచినీటి వాటర్ ఫిల్టర్‌లను ప్రధాన రహదారుల వద్ద ఏర్పాటు చేసిందని ప్రస్తుత ప్రభుత్వం వేసవి నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో విఫలమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధి లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జాన్ వెస్లీకి లింగంగౌడ్ వినతి



నవతెలంగాణ-ఓయూ

దేశవ్యాప్తంగా జాతి జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని అలాగే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలని డిమాండ్ చేస్తు ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో జరిగే బీసీల పోరుగర్జనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ.. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాల యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి వినతిపత్రం సమర్పించినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భం గా లింగం గౌడ్ మాట్లాడుతూ.. దేశ జనాభాలో సగానికి పైగా బీసీలు ఉన్న అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని వారి యొక్క జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్లు పొందినప్పుడే వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలగోని బాలరాజు గౌడ్, కుందారం గణేశచారి, అయిలి వెంకన్న పాల్గొన్నారు.

చిత్రపురి కాలనీకి 5 మెన్ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఉగాది సందర్భంగా అలాట్మెంట్ కమిటీలో సినిమాకు సంబందించి ఇద్దరిని ప్రభుత్వం నియమించింది. అందులో సుద్దాల అశోక్ తేజ, సృజన, అనిల్ ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు పరిణామాలనూ చాలా వివరంగా చెప్పారు. ఎజెండాలో ఉన్న వివిధ అంశాలను ముందస్తుగా అమలు చేసిన వీడియో చూపిస్తూ మాటాడారు. చిత్రపురి రక్షణ పేరుమీద కేసులు వేసిన వాళ్ళు సమావేశాలు జరగకుండా కేసులు వేసిన వాళ్ళు ఆధారాలు చూపించాల్సిన పరిస్థితి నెలకొందని అందుకే ఈ సమావేశానికి హాజరు కాలేదనీ భావిస్తూ, అటువంటి వారు విమర్శలు చేయొద్దనీ హితవు పలికారు. ఈ సమావేశానికి 1200 మందికి పైగానే అర్హులతో పాటు అధ్యక్షులు అనిల్ కుమార్ వల్లభనేని, సెక్రెటరీ పిఎస్ఎన్ దొర, ట్రెజరర్ లలిత, సభ్యులుగా మహానంద రెడ్డి, కాదంబరి కిరణ్, కొంగర రామకృష్ణ ప్రసాద్, అలహరి వి వి ప్రసాద్, దీప్తి వాజపేయిలతో పాటు సొసైటీ నుంచి ఆఫీసర్ సెక్యూరిటీగా పోలీస్ డిపార్ట్‌మెంట్ పాల్గొన్నారు.

ఇందిరా పార్క్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

- ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

ఉగాది పండుగను పురస్కరించుకుని, గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి ఇందిరా పార్క్‌లోని వాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విశ్వ వసునామ ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా పంచాంగ శ్రవణం చేయడం ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు అందరికీ తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వాకింగ్ అసోసియేషన్ సభ్యులకు నూతన ఐడీ కార్డులను అందజేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ఇందిరాపార్క్‌లో ఉగాది వేడుకలను జరుపుకోవడం చాలా ప్రత్యేకమైన అనుభవం అన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరికీ శాంతి, ఆనందం, అభివృద్ధిని అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ కుమారి రచన శ్రీ, ఇందిరా పార్క్ వాకింగ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ చేసిన కార్పొరేటర్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం రహమత్ నగర్ సర్కిల్‌లో అన్నపూర్ణాదేవి అన్నసమర్పణ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పచ్చడి, ప్రసాదం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని ఉగాది పచ్చడి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్యామ్ రావు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అందాల పోటీల గ్రాండ్ ఫినాలే



నవతెలంగాణ-బంజారాహిల్స్

మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ బ్యూటిఫుల్ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ ఫినాలే అద్యంతం ఆకట్టుకుంది. నగరంలోని టీ హబ్‌లో జరిగిన ఈ ఫినాలేను టాలీవుడ్ నటులు వితికా షెరు, నిర్వహకులు కిరణ్మయి అలివేలుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. యువతులతో పాటు వివాహిత మహిళలు పాల్గొన్నారు. వారిలో వైద్యులు, ఐటీ ఉద్యోగులు, ఫ్యాషన్ డిజైనర్లు, ఔత్సాహిక మోడళ్లు, గృహిణులతో పాటు విభిన్న రంగాలకు చెందిన 50 మంది ఫైనలిస్ట్‌లు పోటీ పడ్డారు. కతక్ వృత్యకారిణి సంధ్య, హ్యాండ్ లూమ్ క్యూరేటర్ శ్రీదేవి విజయ దాస్, మిస్ గెలాక్సీ ఇండియా జహ్నవి తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వారి నడక, నడత, శక్తియుక్తులను విశ్లేషణ ఆధారంగా విజేతలను ప్రకటించారు. మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ వ్యవస్థాపకురాలు కిరణ్మయి అలివేలు మీడియాతో మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఆరోగ్యం, పోషకాహారంపై, అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు సాధికారత కల్పించేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. మహిళలు తమ అందం మాత్రమే కాక మేధస్సు, శక్తి యుక్తులను గుర్తించి విజయాలు అధిరోహించేలా చెయ్యడం తమ లక్ష్యంగా పేర్కొన్నారు.

డిజిటల్ కమ్యూనికేషన్‌లో సరికొత్త విప్లవం

- స్మార్ట్‌ఫోన్ యూజర్లకు మేలు
- ఒడిస్సీ ఎండీ బీ రాబర్ట్ రాజా



నవతెలంగాణ-బంజారాహిల్స్

డిజిటల్ భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు చెన్నైకి చెందిన ఒడిస్సీ టెక్నాలజీస్ లిమిటెడ్ రెండు కొత్త సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్‌ను విడుదల చేసింది. ఈ ప్రాడక్ట్‌ను డిజిటల్ కమ్యూనికేషన్‌లో సరికొత్త విప్లవంగా భావించవచ్చునీ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఎక్స్‌జోర్క్‌సైన్ మెయిల్, ఎక్స్‌జోర్క్‌సైన్ స్పాట్. ఈ సందర్భంగా ఒడిస్సీ ఎండీ బీ రాబర్ట్ రాజా మాట్లాడుతూ.. ఈ ప్రాడక్ట్ ప్రపంచవ్యాప్తంగా 200 మిలియన్ల ఈమెయిల్ వినియోగదారులకు, ఒక బిలియన్ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు మేలు చేయనున్నాయన్నారు. ఇటీవల 'డిజిటల్ అరెస్ట్' అనే పదం ప్రజల్లో విస్తృతంగా వినిపిస్తుందని తెలిపారు. ఇది చట్టపరమైన పదం కాదన్నారు. అయినా, ఇది ప్రజలలో విస్తృతంగా వాడుతున్నారన్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున మోసాలకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఐడెంటిటీ థెఫ్ట్, డిజిటల్ బ్లాక్‌మెయిల్, ఎక్స్‌టార్షన్, రాన్సమ్‌వేర్ దాడులు పెరుగుతున్నాయన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు సెక్యూరిటీ సూచనలు, సాఫ్ట్‌వేర్ అప్డేట్‌లు వస్తున్నా మోసాలు తగ్గడం లేదన్నారు. ఈ సమస్య అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిందన్నారు. యూఎస్‌లోనూ టోల్ టెక్ట్, ఇతర స్కామ్‌లకు సంబంధించి హెచ్చరికలు మాత్రమే ఇస్తున్నారని. సరైన పరిష్కారం అందించడం లేదని తెలిపారు. ఈ సమస్యలు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న భద్రతా చర్యల ద్వారా పరిష్కారం కావడం లేదన్నారు. ఆర్థిక రంగానికి సంబంధించి భద్రతా సాఫ్ట్‌వేర్‌ను అందిస్తున్న అనుభవంతో ఈ సమస్యల మూలాన్ని కనిపెట్టామని పేర్కొన్నారు. అన్ని మోసాల వెనుక ఉన్న ప్రాథమిక కారణం 'డిజిటల్ ఐడెంటిటీ అసిమ్మెట్రీ' (అసమానత) అనే దాన్ని హ్యాకర్లు, మోసగాళ్లు తమ లక్ష్యాలను స్పష్టంగా గుర్తించగలుగుతున్నారని తెలిపారు.

బాధితులు మాత్రం తమను ఎవరు టార్గెట్ చేస్తున్నారో? తెలియని స్థితిలో ఉంటున్నారని పేర్కొన్నారు. ఒడిస్సీ ప్రాడక్ట్ ఈ సమస్యను నేరుగా పరిష్కరించనున్నాయని తెలిపారు.

పీఎంజే జ్యువెలర్స్‌ను ప్రారంభించిన సితార



నవతెలంగాణ-బంజారాహిల్స్

తన పేరుపై నగల కలెక్షన్ ఉన్నాయంటే చాలా ఆనందంగా ఉందని, అది తనకి ఫేవరేట్ కలెక్షన్ అని సూపర్‌స్టార్ మహేష్‌బాబు కూతురు సితార ఘట్టమనేని అన్నారు. ఆదివారం పంజగుట్టలో పీఎంజే జ్యువెలర్స్ 40వ స్టోర్‌ను సితార తన తల్లి నమ్రతతో కలిసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తనకు హెవీగా ఉండే జ్యువెలరీతో పాటు సందర్భాన్ని బట్టి లైట్ జ్యువెలరీని కూడా ఇష్టపడుతుంటానని చెప్పారు. తన తండ్రి మహేష్‌బాబు యాడ్‌లో నటించడం చాలా ఆనందంగా ఉందని తాను బాగా ఎంజాయ్ చేశానని తామిద్దరం ఇంట్లో ఎలా ఉంటామో ఆ యాడ్‌లో కూడా అలాగే చేశామని చెప్పుకొచ్చారు. నమ్రత మాట్లాడుతూ.. తాను సితార ఎప్పటికప్పుడు గిఫ్ట్‌లు ఇచ్చిపుచ్చుకుంటామని ఏది నచ్చినా అది కొనేస్తుంటామని అన్నారు. సితార్ ఎక్కువగా సైలెన్స్‌గా ఉండటానికి ఇష్టపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పీఎంజే యాజమాన్యం మాట్లాడుతూ.. తాము 1964 నుంచి ఈ వ్యాపారంలో ఉన్నామని వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం వల్ల దినదినాభివృద్ధి చెందుతున్నామని అన్నారు. సరికొత్త డిజైన్లతో పాటు ఎక్స్‌క్లూజివ్ డిజైన్లు ఈ స్టోర్‌లో అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు.

ఉగాది పచ్చడి పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

విశ్వ వాసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు రాగిరి టింకు గౌడ్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం న్యూ బోయిన్‌పల్లిలో దత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద చిన్నారులకు ఉగాది పచ్చడి, చల్లటి టాటా గ్లూకోస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ బోయిన్‌పల్లి వాసులకు ఉగాదినూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవి ప్రసాద్, యశ్వంత్, శ్రీకాంత్, మహేందర్, నితిన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-ఓయూ

తార్నాక కమ్మ సేవ సంఘం అధ్యక్షులు వల్లభనేని వీరభద్రయ్య తార్నాక హబ్సిగూడ ప్రధాన రహదారి వెంట ఉన్న చలివేంద్రం వద్ద మన్నె నాగమల్లేశ్వరి, అడుసుమిల్లి చిట్టివీరయ్య, కాట్రగడ్డ నరేంద్ర బాబు, మాదాల రాధకృష్ణ, తోటకూర చంద్రమౌళయ్య, సహకారంతో వేసావి కాలమంత ఉచితంగా ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం సాయంత్రం గత మూడేండ్లుగా ఆయన చలివేంద్రం వద్ద ఏడాది పొడవునా చలివేంద్రం ద్వారా సేవాలు అందిస్తున్న విషయం తెలిసిందే. తాము ప్రత్యేక సందర్భాల్లో ఇక్కడ ప్రసాదాలు కూడా అందజేస్తున్నట్టు చెప్పారు. కమ్మలు అన్ని వర్గాల అభ్యున్నతికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కిలారి చరణ్ సురేష్, ఈ నాటి ప్రసాదాలకు, మజ్జిగకు విరాళమిచ్చారని చెప్పారు. నల్లూరి శివరాం ప్రసాద్, కనకమేడల రాంబాబు, ఇస్మాయిల్ రెడ్డి, వీరమాచినేని రమేష్ బాబు, పరిటాల విజయకుమార్, కావూరి నరసింహారావు కార్యక్రమంలో పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు. పసల సుశీల, సుధా రాణి, సుధా, శ్రీవాణి, కుమారి, శ్రీహరి, వెంకట రత్నం, నాగేశ్వర రావు, హరిబాబు ఈ కార్యక్రమానికి సేవలను అందించారు. ఈ సందర్భంగా ఇక్కడ ప్రత్యేక ఉగాది పూజలు నిర్వహించిన అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం ప్రసాదాలు అందజేశారు.

కూల్‌డ్రింక్స్‌ను నిషేధించాలి

- జన విజ్ఞాన వేదిక



నవతెలంగాణ-ఓయూ

ఆరోగ్యానికి ఎంతో హానికరమైన కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్‌ను నిషేధించాలని జాతీయ సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ డిమాండ్ చేశారు. కోలా డ్రింక్స్‌తో అనారోగ్యం, ఆర్థికంగా నష్టం జరుగుతుందని చెప్పారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ఓయూ ఎన్సీసీ గేటు ఎదుట నిర్వహించారు. శీతల పానీయాలను మానేద్దాం-సహజ పానీయాలను సేవిద్దాం అంటూ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్‌పై జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న పోరాటాన్ని ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ ఈ పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. కూల్‌డ్రింక్స్‌ను విద్యాసంస్థలు, సినిమా హాల్స్‌తో పాటు ఇతర పబ్లిక్ ప్రదేశాలలో నిషేధించాలని ఆర్డర్ ఉందన్నారు. దీన్ని తెలంగాణలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ. ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్‌తో ఆరోగ్యానికి ఎంతో నష్టమన్నారు. కూల్ డ్రింక్స్‌తో ఆరోగ్యానికి ఒక్క శాతం కూడా ఉపయోగం లేదన్నారు. కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్ సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, కూల్ డ్రింక్స్‌తో దుష్పరిణామాలు తలెత్తుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ శీతల పానీయాలను సేవించడం మానుకోవాలని సూచించారు. జేవీవీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. వేసవిలో శీతల పానీయాల బిజినెస్ భారీగా జరుగుతోందని కోట్లాది రూపాయలు మల్టీ నేషనల్ కంపెనీలు దోచుకెళు న్నాయన్నారు. ప్రపంచం మొత్తంలో ఒక ఏడాదికి రెండు కోట్ల టన్నుల రసాయనాలను కూల్ డ్రింక్స్ రూపంలో ప్రజలు తాగుతున్నారని పేర్కొన్నారు. ప్రతి లీటర్ కూల్ డ్రింక్‌లో 0.0180 మిల్లీగ్రాముల క్రిమిసంహారక మందులు ఉన్నాయని మనదేశంలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ అనే సంస్థ బయట పెట్టిందని తెలిపారు. శీతల పానీయాలు సేవించడం వల్ల ప్రధానంగా యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జేవీవీ సైన్స్ కమ్యూనికేషన్ సబ్ కమిటీ కన్వీనర్ ప్రొ. ఏ రామచంద్రయ్య మాట్లాడుతూ.. కూల్ డ్రింక్ సంస్థలు అమ్మకాలు పెంచుకునేందుకు సినిమా తారలు, క్రికెట్ సెలబ్రిటీలతో వ్యాపార ప్రకటనలు ఇప్పిస్తున్నాయని చెప్పారు. శీతల పానీయాలతో ఎనర్జీ వస్తుందని సెలబ్రిటీలు ప్రచారం చేయడంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. కోలా సంస్థలు చేస్తున్న అసత్య ప్రచారానికి వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, పర్యావరణవేత్తలు, మేధావులు గల మెత్తాలని కోరారు. తెలంగాణలో కూల్ డ్రింక్స్ నిషేధించాలని డిమాండ్ చేశారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొ. బీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్ వ్యాపారం వల్ల దాదాపు 50 వేల కోట్ల రూపాయల సొమ్ము విదేశాలకు తరలిపోతుందని చెప్పారు. 300 లీటర్ల కూల్‌డ్రింక్స్ తయారీ ఖర్చు కేవలం ఒక రూపాయి మాత్రమేనని.. కానీ అదే కూల్ డ్రింక్స్‌ను ప్రజలకు 20 రూపాయలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీవీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్వీ లింగస్వామి, ఎం. శ్రీనివాస్, ప్రొ. మమతా, డా. పి. రజిని, చంద్రయ్య, హైదరాబాద్ జేవీవీ ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు, విద్యాసాగర్, మాణిక్యాలరావు, భీమేశ్వర్, యాదగిరి, పాల్గొన్నారు.

అలోవెరా జెల్‌తో

సహజ సిద్ధమైన పదార్థాలతో చేసిన క్రీమ్‌లు చర్మాన్ని ఆరోగ్యంగా, అందంగా ఉంచుతాయి. మరి మనకు నిత్యం అందుబాటులో ఉండే అలోవెరా జెల్‌తో నైట్ క్రీమ్ ఎలా చేసుకోవాలో చూద్దాం...

అలోవెరా జెల్‌తో నైట్ క్రీమ్



- గ్రీన్ టీ శాచెట్ ఒకటి తీసుకుని నీటిలో వేయాలి.
- దీనిలో రెండు టీస్పూన్ల కాఫీ పొడి వేసి మరిగించాలి.
- ఈ మిశ్రమం దగ్గర పడిన తర్వాత దించేసి.. రెండు విటమిన్ ఈ క్యాప్సూల్స్‌ని కట్ చేసి అందులో కలపాలి.
- దీనిలోనే రెండు టీస్పూన్ల తాజా అలోవెరా జెల్ వేసి చక్కగా కలపాలి.
- ఈ మిశ్రమాన్ని ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేసుకోవాలి.
- రోజూ రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకుని ఈ క్రీమ్‌ను అప్లైచేసి ఐదునిమిషాలు మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- జిడ్డు చర్మం కలిగిన వారు క్రీమ్ తయారీలో గ్రీన్ టీకి బదులు టీ ట్రీ ఆయిల్‌ను వాడుకుంటే మంచిది.

రంజాన్ రుచులు



మతసామరస్యానికి, మానవత్వానికి మారుపేరుగా జరుపుకునే పండుగల్లో రంజాన్ ఒకటి. ముస్లిం సోదరీసోదరకు అతి పెద్ద పండగ ఇది. కులం, మతం అనే తేడా లేకుండా రంజాన్ సమయంలో ఇచ్చే ఇఫ్తార్ విందులో ప్రతి ఒక్కరూ పాల్గొంటారు. రంజాన్ అంటే చాలు హలీమ్ సందడి మొదలవుతుంది. షీర్ ఖుర్మా, షహీ తుక్డా, కద్దూకా ఖీర్, మటన్, చికెన్ బిర్యానీ, కీమా సమోసా అలా బోలెడు వంటకాలు నోరూరిస్తాయి. ఘుమఘుమలాడే వంటకాలతో భోజన ప్రియులను కట్టిపడేలా చేస్తున్నారు. ముఖ్యంగా బిర్యానీలతోపాటు హలీమ్, హరీస్‌లను ఇష్టంగా తినేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. రాత్రుళ్లు నడిచే ఈ దుకాణాలకు అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు.

ఖీర్

కావలసిన పదార్థాలు: సేమియా - అరకిలో, చక్కెర - పావుకిలో, నెయ్యి - వంద గ్రాములు, యాలకులు - ఆరు, ఖాజు - 50 గ్రాములు, కిస్‌మిస్ - 50 గ్రాములు, బాదం - 50 గ్రాములు, పిస్తా - 50 గ్రాములు, చిరంజీలు - 20 గ్రాములు, ఖర్జూరాలు - ఆరు.


తయారు చేసే విధానం: రెండు గంటల ముందు ఖర్జూరాలను నాన బెట్టాలి. నానిన తర్వాత మధ్యలో ఉన్న గింజలు తీసి రెండు ముక్కలుగా చేసుకోవాలి. ఇప్పుడు మూకుడులో నెయ్యి వేసి పైన చెప్పిన డ్రై ఫ్రూట్స్ అన్నీ వేగనివ్వాలి. అదే నెయ్యిలో సేమియాలను దోరగా వేయించాలి. గిన్నెలో పాలను బాగా మరగనిచ్చి అందులో వేయించిన సేమియా, యాలకుల పొడి, చక్కెర వేసి బాగా కలపాలి. దించే ముందరే వేయించుకున్న డ్రై ఫ్రూట్స్ అన్నీ వేస్తే రంజాన్ ఖీర్ తయారైనట్లే.



చికెన్ హలీం

కావలసినవి: బోన్ లెస్ చికెన్ - 500 గ్రాములు, గోధుమ రవ్వ - 250 గ్రాములు, సెనగపప్పు - 5 టేబుల్ స్పూన్లు, బియ్యం - 5 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి - 5, అల్లం వెల్లుల్లి ముద్ద - 2 టీ స్పూన్లు, పుదీనా - అర కప్పు, కొత్తిమీర - అర కప్పు, ఉల్లిగడ్డ - 2, పెరుగు - కప్పు, ఉప్పు - తగినంత, పసుపు - టీస్పూను, కారం - 2 టీ స్పూన్లు, గరం మసాలా - టీ స్పూను, మిరియాలపొడి - అర టీ స్పూను, సొంటి పొడి - అర టీ స్పూను, నిహారి మసాలా లేదా పోట్లీ మసాలా - 1 చిన్న పాకెట్, లవంగాలు - 8, దాల్చిన చెక్క - ముప్పావు ముక్కలు, యాలకులు - 8, షాజీరా - రెండు టీ స్పూన్లు, నూనె - ముప్పావు కప్పు, నెయ్యి - 5 టేబుల్ స్పూన్లు.

తయారీ విధానం : ఒక కుక్కర్లో శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలు, సెనగపప్పు, బియ్యం, చెంచాడు అల్లం వెల్లుల్లి ముద్ద, పైన చెప్పిన మసాలా దినుసులలో సగం (యాలకులు, లవంగాలు, దాల్చిన, షాజీరా), సగం పుదీనా, రెండు పచ్చిమిర్చి, సగం కొత్తిమీర, సగం చెంచాడు పసుపు వేయాలి. ఇందులో బైట మార్కెట్‌లో దొరికే నిహారి మసాలా లేదా పోట్లీ మసాలా ఒక సన్నటి బట్టలో మూట కట్టి వేసి తగినన్ని నీళ్ల పోసి మూతపెట్టి నాలుగు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. మూత తీసి గోధుమ రవ్వ వేసి కలిపి మూత పెట్టి మళ్లీ నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. పూర్తిగా చల్లారిన తర్వాత పొట్లీ మసాలా మూట తీసేసి ఉడికిన చికెన్ మిశ్రమాన్ని మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవాలి. స్టవ్ మీద ఒక పాన్ లేదా మందపాటి గిన్నె పెట్టి నూనె వేడి చేయాలి. ఇందులో మిగిలిన లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, షాజీర , అల్లం వెల్లుల్లి ముద్ద, మిగిలిన పచ్చిమిర్చి నూరి వేసి కొద్దిగా వేగాక కారం, మిరియాలపొడి, సొంటిపొడి, గరం మసాలాపొడి వేసి కలుపుతూ వేయించాలి. ఇందులో కప్పుడు పెరుగు వేసి కలపాలి. తర్వాత గ్రైండ్ చేసుకున్న చికెన్ మిశ్రమం, తగినంత ఉప్పు వేసి సన్నని మంటమీద కలుపుతూ నిదానంగా ఉడికించాలి. హలీమ్ మొత్తం ఉడికి మంచి వాసన వస్తున్నప్పుడు నెయ్యి వేసి కలిపి మరి కొద్ది సేపు ఉంచాలి. సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, మిగిలిన కొత్తిమిర, పుదీనా నూనెలో కరకరలాడేలా వేయించి పెట్టుకోవాలి. హలీమ్ మొత్తం ఉడికి నూనె, నెయ్యి కలిసి పైకి తెలుతుండగా దింపేసి సర్వింగ్ బౌల్‌లో వేసి వేయించిన ఉల్లిగడ్డ, కొత్తిమిర, పుదీనా, కొద్దిగా నెయ్యి వేసి నిమ్మరసం పిండి సర్వ్ చేయాలి.



రంజాన్ స్పెషల్ బిర్యాని

కావలసిన పదార్థాలు: బాస్మతి - 1 కేజీ, మటన్ - 1 కేజీ, పెరుగు - ఒకటిన్నర లీటరు, ఉప్పు - సరిపడా, ఉల్లిపాయలు - పెద్దవి రెండు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 స్పూన్లు, ధనియాల పొడి - 2 స్పూన్లు, యాలకుల పొడి - అర టీ స్పూన్, మిరియాల పొడి - 2 టీ స్పూన్లు, దాల్చిన చెక్క - కొద్దిగా, జీలకర్ర - 1 స్పూన్, కుంకుమ పువ్వు - చిటికెడు, లవంగాలు - 20, నీళ్లు - 2 కప్పులు, నెయ్యి - పావు కిలో.



తయారీ విధానం: ముందుగా మటన్ చిన్న ముక్కలు కోసి శుభ్రం చేసుకోవాలి. దానికి అల్లం వెల్లుల్లి , ఉల్లిగడ్డ పేస్ట్, ధనియాల పొడి, దాల్చిన చెక్క పొడి, యాలకుల పొడి, మిరియాల పొడి, జీలకర్ర, కుంకుమ పువ్వు,పెరుగు, నీళ్ల పోసి బాగా కలిపి రెండు గంటలు నానబెట్టాలి. స్టవ్ వెలిగించి పాన్‌లో మటన్ ముక్కలు వేసి సమానంగా పరవాలి. నెయ్యి లవంగాలను నేతిలో వేయించి వీటిని మటన్ ముక్కల మీద వెయ్యాలి. తరువాత కడిగిన బియ్యానికి అరలీటర్ పెరుగు కలిపి ఈ మిశ్రమాన్ని మటన్ ముక్కలమీద వేసి మూత పెట్టి ఉడికించాలి. మంట సిమ్‌లో పెట్టి దమ్ చేయాలి. నీరు ఇగిరి పోయేవరకు వుంచి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.

టేస్టీ టేస్టీ గంజి ..!

బియ్యం రవ్వ లేదంటే, బొంబాయి రవ్వతో ఈ గంజి తయారు చేస్తారు. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి ముద్ద, టమాటాలు, కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, యాలుకలు, దాల్చినచెక్క, లవంగాలు, నెయ్యి, కొందరు ఇందులో పల్లీలను కూడా వాడుతుంటారు. ముందుగా మసాలా దినుసులన్నింటినీ నెయ్యిలో వేయిస్తారు. ఒక వంట పాత్రలో నీళ్ల పోసి బాగా మరగనిస్తారు. నీళ్ల బాగా మరిగిన తర్వాత రవ్వను కలుపుతారు. అలాగే, ముందుగా వేయించి పెట్టుకున్న మసాలా దినుసులు, సరిపడా ఉప్పు వేసి బాగా గంజి చిక్కబడేలా ఉడికిస్తారు. ఈ గంజిలో బూందీ వేసుకుని ఇష్టంగా తింటారు. ఉపవాసదీక్షపరుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన ఈ గంజిని కుల, మతాలకు అతీతంగా ఇష్టపడతారు.



డస్ట్ అలర్జీ ఇబ్బంది పెడుతుంటే.

డస్ట్ అలర్జీతో బాధపడుతున్నారా.? ప్రస్తుతం డస్ట్ అలర్జీ బారిన పడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చిన్న దుమ్ముకే తుమ్ములు రావడం, ముక్కు కారడం, కళ్లలో దురద, కళ్లు ఎర్రబడడం, గొంతులో నొప్పి వంటి సమస్యలకు దారి తీస్తుంది. శ్వాస సంబంధిత సమస్యలు ఎక్కువతున్నాయి. వాయు కాలుష్యం కూడా డస్ట్ అలర్జీకి దారి తీస్తుంది.



ఒక్కసారి డస్ట్ ఎలర్జీ అటాక్ అయ్యిందంటే తగ్గడం సులువుకాదు. ఎన్నో రకాల మందులు వాడాల్సి ఉంటుంది. అయితే డస్ట్ అలర్జీని కొన్ని రకాల నేచురల్ టిప్స్ ద్వారా చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎన్ని మందులు వాడినా తగ్గని డస్ట్ అలర్జీని కొన్ని రకాల వంటింటి చిట్కాలతో చెక్ పెట్టొచ్చని అంటున్నారు. ఇంతకీ ఆ నేచురల్ టిప్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- డస్ట్ అలర్జీని చెక్ పెట్టడంలో రాక్‌సాల్ట్ బాగా ఉపయోగపడుతుంది. ఒక కప్పు వేడి నీటిలో రాక్ సాల్ట్‌ను కరిగించి ఆ నీటిని ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల ముక్కు క్లీన్ అవుతుంది. గొంతు నొప్పి, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దుమ్ము బ్యాక్టీరియా నాశనం అవుతుంది.
- డస్ట్ అలర్జీ ఉన్న వారిలో అల్లం, తేనె కూడా బాగా ఉపయోగపడుతుంది. ఈ రెండింటిలో ఉండే నేచురల్ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫమేటరీ లక్షణాలు డస్ట్ అలర్జీని దూరం చేస్తుంది. ఒక చెంచా తేనెలో అల్లం రసం కలిపి ప్రతీరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే డస్ట్ అలర్జీ దూరమవుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

కటక్ : ఒడిషాలోని కటక్ జిల్లా నిర్గుండి సమీపంలో ఆదివారం ఎస్‌ఎంవీటీ బెంగళూరు-కామాఖ్య ఏసీ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 11 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా ఎనిమిది మంది గాయపడ్డారు. రైలు బెంగళూరు నుంచి అస్సోంలోని గౌహతి వెళుతుండగా మధ్యాహ్నం సుమారు 12 గంటలకు ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఒడిశా అగ్నిమాపక దళానికి చెందిన సిబ్బంది సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాదం నేపథ్యంలో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు. సాధ్యమైనంత త్వరగా రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

మస్క్‌కు తప్పని తిప్పలు

వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఇవి సోషల్ మీడియాలో కనిపించాయి. వాషింగ్టన్, చికాగో, ఇండియానాపొలిస్, సిన్సినాటి, సియాటిల్ వంటి ప్రధాన నగరాల్లో టెస్లా స్థానాల వెలుపల, అలాగే, వర్జీనియా, పెన్సిల్వేనియా, కొలరాడో పట్టణాలలో నిరసనలు వెల్లువెత్తాయి. లండన్‌లోని ఒక డీలర్‌షిప్ వెలుపల మస్క్‌ను దూషిస్తూ దాదాపు పదుల సంఖ్యలో నిరసనకారులు బోర్డులు పట్టుకొని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని నిరసనలు హింసాత్మకంగా మారాయి. టెస్లా వాహనాలకు నిప్పంటించారు. వాయువ్య జర్మనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడు టెస్లా కార్లు దగ్ధమైన విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లెయిమ్స్ పరిష్కారంలో కార్మిక శాఖ తాత్సారం

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించడంలో అడుగడుగునా జాప్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

క్లెయిమ్ పేరు 31 మార్చి	2024 నాటికి పెండింగ్	2024-25లో నమోదైనవి	మొత్తం	పరిష్కారం
కనీస వేతనాల క్లెయిమ్స్	412	195	607	26
పరిహార క్లెయిమ్స్	313	49	362	289
వేతన చెల్లింపు క్లెయిమ్స్	8	1	9	00
దుకాణాలు, సంస్థల క్లెయిమ్స్	50	20	70	8
గ్రాట్యూటీ క్లెయిమ్స్	141	20	161	44

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015లో రవాణా రంగంలోని డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టుల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చింది. ప్రతిఏటా కార్మికశాఖలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ బీమా పథకం వర్తిస్తుంది. అయితే, ఈ పథకం మీద పెద్దగా అవగాహన కూడా లేదు. ప్రమాదాల్లో చనిపోతే బాధిత కుటుంబాలకు పరిహారం వస్తుందనే విషయం కూడా పెద్దగా ప్రచారంలో లేదు. ఈ పథకం కింద 13,11,072 మంది డ్రైవర్లు లబ్ధిదారులుగా ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పరిహారం కోసం డ్రైవర్ల కుటుంబాల నుంచి కార్మిక శాఖ స్వీకరించిన క్లెయిమ్స్ కేవలం 250 మాత్రమే. అందులో పరిష్కరించబడినవి కేవలం 111 మాత్రమే. బాధిత కుటుంబాలకు రూ.4.80 కోట్ల పరిహారం అందింది. అన్నింటిపైనా అవగాహన ఉండే జర్నలిస్టుల నుంచీ క్లెయిమ్ కోరింది ఒక్క కుటుంబమే. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందించబడ్డాయి.

గత ఆర్థిక సంవత్సరంలో రూ.5 లక్షల ప్రమాద బీమా పథకం క్లెయిమ్స్ తీరు ఇలా..

పథకం	బీమా పరిధిలో ఉన్నవారు	స్వీకరించిన క్లెయిమ్స్	పరిష్కరించినవి	పరిహారం
డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు	13,11,072	250	111	రూ.4.80 కోట్లు
హోంగార్డులు	17,655	10	04	రూ.20 లక్షలు
వర్కింగ్ జర్నలిస్టులు	22,515	1	1	రూ.5 లక్షలు

మంచి రోజులొచ్చాయి



(మొదటిపేజీ తరువాయి)

పండించామన్నారు.

సన్నబియ్యం పంపిణీ అద్భుత కార్యక్రమం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సన్న బియ్యం పంపిణీ అద్భుత కార్యక్రమం అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సమాజంలో అణగారిన వర్గాలు, రైతు కూలీలు, మహిళలు, బీసీలు, దళితులకు ఆహారం పెట్టే నిజమైన ఆహార భద్రత పథకం అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ కార్యక్రమం అమలు చేయడం లేదన్నారు. దొడ్డుబియ్యంపై పీడీఎఫ్ ద్వారా రూ.10,065 కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రయోజనం లేదని, ఆ బియ్యాన్ని తినకుండా కిలో ఐదు, పది రూపాయలకు అమ్ముకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వనున్నదని, తెల్లకార్డు స్థానంలో బీపీఎల్ వారికి మూడు రంగుల కార్డులు ఇస్తామన్నారు. గులాబీకార్డుకు బదులుగా ఆకుపచ్చ కార్డు ఇవ్వనున్నట్టు తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి సన్న బియ్యం పథకాన్ని పదిమంది లబ్దిదారులు ధరావత్ బుజ్జి, మాలోతురంగా, కర్ల రాధా, షేక్ రెహమాన్, షేక్ కరీమా, కర్నూరపు లక్ష్మీ, గురువమ్మ, సుశీల, వెంకట పుష్పలకు అందజేశారు. అలాగే, రూ.26.10కోట్లు విలువచేసే చెక్కును 12,712 స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల రుణాలకు వడ్డీ రాయితీ కింద పంపిణీ చేశారు. సభ అనంతరం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట మోడల్ హౌసింగ్ కాలనీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు, వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లమాద పద్మావతి, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల ఐలయ్య, మందుల సామేలు, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, శ్రీహరి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్‌యాదవ్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సెక్రెటరీ డీఎస్ చౌహాన్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీశ్, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, సూర్యాపేట ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అణు ఒప్పందంపై ప్రత్యక్ష చర్చలకు తిరస్కరణ

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టత వచ్చింది. ఇరాన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించాక, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి లేఖ రాసినట్టు చెప్పారు. "రెండు పక్షాల మధ్య ప్రత్యక్ష చర్చల అవకాశాన్ని తిరస్కరించాం. అయితే.. పరోక్ష చర్చలకు దారులు తెరిచే ఉన్నాయి" అని పెజెష్కియాన్ తెలిపారు. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘీ సైతం పరోక్ష చర్చలకు మార్గం తెరిచే ఉందని వ్యాఖ్యానించారు. తమ దేశం విషయంలో ప్రత్యర్థుల వైఖరిలో మార్పు రానంతవరకు ప్రత్యక్ష చర్చలకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. అయితే, ట్రంప్ పరోక్ష చర్చలకు అంగీకరిస్తా రా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ట్రంప్ మొదటి హయాంలో టెహ్రాన్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే సాగాయి. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగింది. అప్పటినుంచి అనేక ఏండ్లుగా పరోక్ష చర్చలు విఫలమయ్యాయి.ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకోడానికి ట్రంప్ ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేశారు. "టెహ్రాన్ ముందు రెండు మార్గాలున్నాయి. సైనిక శక్తి, లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే నేను ప్రాధాన్యం ఇస్తా. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయాలనుకోవడం లేదు. చర్చలకు వస్తారని ఆశిస్తున్నా. అలా చేయడమే వారికి ప్రయోజనకరం" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. బాంబు దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు.

పారదర్శక దర్యాప్తు అవసరం

(మొదటిపేజీ తరువాయి)

నమ్మకం లేకపోతే.. భవిష్యత్తులో ప్రభుత్వాలు, కార్పొరేషన్లు వంటివి సైతం ఇలాంటి కేసుల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన అవసరం ఏర్పడుతుందని చెప్తున్నారు. కాబట్టి.. జస్టిస్ వర్మపై దర్యాప్తు కేవలం ఆయనకు సంబంధించే కాదనీ, హైకోర్టుల్లో పని చేసే న్యాయమూర్తులందరి నిర్ణయాత్మక స్వాతంత్య్రం భవిష్యత్తును కూడా ప్రతిబింబిస్తుందని అంటున్నారు.

న్యాయమూర్తులపై నిర్లక్ష్యంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం వారి నిర్ణయాత్మక స్వాతంత్య్రాన్ని ఎలా దెబ్బతీస్తుందో అర్థం చేసుకోవటానికి జిల్లా కోర్టుల అంశాన్ని చూడాల్సిన అవసరం ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. జిల్లా కోర్టుల విషయంలో హైకోర్టులే క్రమశిక్షణా విచారణలు నిర్వహిసాయి.న్యాయమూర్తులపై అందిన ఫిర్యాదులపై హైకోర్టులు అంతర్గత విచారణలు నిర్వహిస్తున్నపుడు అవి అన్యాయంగా వ్యవహరిస్తున్నాయనటానికి గణనీయమైన ఆధారాలున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. పుకార్లు, పరోక్ష ప్రకటనలు అలాంటి క్రమశిక్షణా విచారణలకు ఆధారమవుతాయని గుర్తు చేస్తున్నారు. తమిళనాడులోని జిల్లా న్యాయమూర్తి కె. గణేషన్ విషయంలో ఇలాగే జరిగింది. లంచం తీసున్నాడని ఆరోపణలు వచ్చాయి. కేవలం ఆరోపణల ఆధారంగానే ఆయనపై చర్యలు తీసుకున్నారు. న్యాయమూర్తిని విధుల నుంచి కూడా దూరంగా ఉంచారు. ఇలా.. జిల్లా కోర్టుల న్యాయమూర్తులు.. మధ్యవర్తుల ద్వారా లంచాలు తీసుకున్నారని ఆరోపించబడి, న్యాయ సేవల నుంచి తొలగించబడిన సందర్భాలు అనేకం ఉన్నాయని వారు గుర్తు చేస్తున్నారు. కేవలం ఆరోపణల ఆధారంగా జరిపే దర్యాప్తులపై న్యాయమూర్తులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి తమ వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదమున్నదన్న భయాన్ని వారు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం.. జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో నిజానిజాలు బయటకు రావాల్సి ఉన్నది. విచారణ ముగిస్తేనే అసలు విషయాలు తెలుస్తాయి. అయితే, ఆరోపణల ఆధారంగా జరిగే దర్యాప్తులు న్యాయమూర్తుల ప్రతిష్ఠను, వారి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీసే విధంగా ఉండకూడదని విశ్లేషకులు చెప్తున్నారు.



మణిపూర్‌లో మరో ఆరు నెలలు సాయుధ దళాల చట్టం అమలు

నాగాలాండ్, అరుణాచల్‌లోని కొన్ని ప్రాంతాలకూ వర్తింపు

న్యూఢిల్లీ : పదమూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు మినహా మణిపూర్ రాష్ట్ర వ్యాప్తంగా సాయుధ దళాల (ప్రత్యేకాధికారాలు) చట్టాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదివారం నిర్ణయం తీసుకుంది. కల్లోలిత ప్రాంతాలలో కార్యకలాపాలు నిర్వహించే సాయుధ దళాలకు ఈ చట్టం విశేషాధికారాలు కట్టబెడుతోంది. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే తప్ప సాయుధ బలగాలను ప్రాసిక్యూట్ చేసే అవకాశం కూడా ఉండదు. నాగాలాండ్‌లో కూడా ఎనిమిది జిల్లాలలో పూర్తిగానూ, మరో ఐదు జిల్లాలలోని 21 పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఈ చట్టాన్ని మరో ఆరు నెలల పాటు అమలు చేస్తారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని మూడు జిల్లాలలో, మరో జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఈ చట్టం అమలును పొడిగించారు. ఇది చాలా క్రూరమైన చట్టమని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తున్నాయి. కల్లోలిత ప్రాంతాలలో ఎక్కడైనా గాలింపు చర్యలు చేపట్టి అరెస్టులు చేసే అధికారం సాయుధ దళాలకు ఉంటుంది. అవసరమైతే కాల్పులు కూడా జరపవచ్చు. మణిపూర్‌లో ప్రస్తుతం నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించిన అనంతరం చట్టాన్ని మరో ఆరు నెలల పాటు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని హోం శాఖ ఓ నోటిఫికేషన్‌లో వివరించింది.

సన్నగిల్లుతున్న సజీవ ఆశలు

ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో భారీ పరికరాలు లేకుండానే రంగంలోకి దిగిన స్థానికులు.. ఉత్త చేతులతోనే శిథిలాలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నడి వీధుల్లోనే నిద్ర..

వరుస భూ ప్రకంపనలు మయన్మార్‌వాసులను హడలెత్తిస్తున్నాయి. వరుస ప్రకంపనల కారణంగా దెబ్బతిన్న ఇండ్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందనే భయాలు స్థానికుల్లో నెలకొన్నాయి. దీంతో 15 లక్షల జనాభా ఉన్న మాండలేలో చాలావరకు ప్రజలు రాత్రి వేళల్లో వీధుల్లోనే నిద్రపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 5.1 తీవ్రతతో మరోసారి భూకంపం రావడంతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు.

వారిపై ఆశలు లేనట్లే - బ్యాంకాక్

థాయ్‌లాండ్‌లో 33 అంతస్తుల నిర్మాణ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే. అందులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, వారు బతికుండే అవకాశాలు చాలా తక్కువని బ్యాంకాక్ పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు బయటకు తీసిన వారిలో ఎవరూ ప్రాణాలతో లేరన్నారు. శిథిలాలను పూర్తిగా తొలగించేందుకు కనీసం రెండు నెలల సమయం పడుతుందన్నారు. ఇప్పటివరకు థాయ్‌లాండ్‌లో 17 మంది మరణించగా.. 32 మంది గాయాలపాలయ్యారు. అయితే, భారీ అంతస్తు కుప్పకూలిన ఘటనకు సంబంధించి అక్కడ పనిచేస్తున్న 83 మంది ఆచూకీ తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య, ఈఎంఎస్ నంబూద్రిపాద్, హరికిషన్ సింగ్ సూర్జిత్, ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరి.. ఇవి కేవలం పేర్లు కాదు, చరిత్ర పుటలు. విప్లవ గాథలు. సమానత్వం కోసం జ్వలించిన దీపాలు. భూమికి హక్కులిచ్చిన శక్తులు. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి నిలువెత్తు రూపాలు. అరుణారుణ పతాకాలు. అరవయ్యేండ్ల మార్క్సిస్టు పార్టీ సారథ్యాలు..

క్రాంతిదర్శులు... సీపీఐ(ఎం) కార్యదర్శులు

పుచ్చలపల్లి సుందరయ్య (1964-1978)

పుచ్చలపల్లి సుందరయ్య సీపీఐ(ఎం) తొలి ప్రధాన కార్యదర్శిగా చిరస్మరణీయుడు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగామి నేతగా, ప్రజాజీవితంలో మహానాయకుడిగా గుర్తింపు పొందారు. అత్యున్నత విలువలతో కూడిన జీవితం, స్పష్టమైన సిద్ధాంత నిబద్ధత, విప్లవోద్యమం పట్ల అంకితభావం భారత రాజకీయాల్లో ఆయనను ప్రత్యేకంగా నిలిపాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పాత్ర, దేశవ్యాపిత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఆయన కృషి అజరామరమైనవి. 17 ఏండ్ల ప్రాయంలో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత అమీర్ హైదర్‌ఖాన్ మార్గదర్శకత్వంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఈఎంఎస్ నంబూద్రిపాద్, పి.కృష్ణ పిళ్ళై, ఎ.కె.గోపాలన్ లాంటి వారు కమ్యూనిస్టు పార్టీలో చేరడానికి ఆయన కారకులయ్యారు. 1936లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆలిండియా కేంద్రం ఏర్పడినప్పుడు ఆయన కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. అప్పటి నుంచి జీవితాంతం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగారు. ఉమ్మడి పార్టీలోనూ, సీపీఐ(ఎం) లోనూ సుదీర్ఘకాలం పొలిట్‌బ్యూరోలో కొనసాగారు.

తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం

1946-1951 మధ్యకాలంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటానికి సుందరయ్య కీలక నాయకుడిగా వ్యవహరించారు. జమీందారీ వ్యవస్థను ఎదుర్కొంటూ పేదలకు భూమి కోసం భుక్తికోసం వీరోచిత పోరాటాలను నిర్మించారు. దోపిడీ రహిత సమాజ స్థాపన కోసం జీవితమంతా ధారపోశారు. అసమాన ధైర్యశాలిగా కష్టజీవుల పక్షపాతిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు.

సీపీఐ(ఎం) స్థాపనలో ప్రధాన భూమిక

1964లో సీపీఐ(ఎం) ఏర్పాటులో కీలకపాత్ర పోషించి, నిజమైన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కొనసాగించేలా కృషి చేశారు. మార్క్సిజం-లెనినిజాన్ని భారత రాజకీయాలకు అన్వయించేందుకు మార్గదర్శకత్వం ఇచ్చారు. సీపీఐ(ఎం)ను ఉక్కు క్రమశిక్షణతో తీర్చిదిద్ది, సమిష్టి నాయకత్వం, ప్రామాణిక రాజకీయాల వైపు నడిపించారు. సుందరయ్య పార్లమెంటరీ రంగంలో కూడా అద్భుత ప్రతిభ కనపరిచి పాలక, ప్రతిపక్ష సభ్యులందరి మన్ననలు పొందారు. 1952లో రాజ్యసభకు ఎన్నికై పార్లమెంటులో కమ్యూనిస్టు పక్ష నేతగా బాధ్యతలు నిర్వహించారు. 1985 మే 19వ తేదీన ఆయన కన్నుమూశారు.

ఈఎంఎస్ నంబూద్రిపాద్ (1978-1992)



సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శిగా ఈఎంఎస్. నంబూద్రిపాద్ పార్టీని బలమైన వామపక్ష శక్తిగా నిలబెట్టేందుకు కృషి చేశారు. ఆయన కేవలం సిద్ధాంతవేత్తగా, కమ్యూనిస్టు నేతగా మాత్రమే కాక, ప్రభావశీలమైన పాలకుడిగా కూడా నిలిచారు. 1957లో కేరళ ముఖ్యమంత్రిగా భారతదేశపు తొలి ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ కమ్యూనిస్టు పాలన సాధ్యమేనని నిరూపించారు.

1957లో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ కేరళలో ఘన విజయం సాధించింది. నంబూద్రిపాద్ ప్రభుత్వ పరిపాలనలో భూసంస్కరణలు, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలు ప్రధానపాత్ర పోషించాయి. అగ్రవర్ణ ఆధిపత్య వ్యవస్థను ఎదుర్కొంటూ, అన్ని వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం అందించేందుకు కృషి చేశారు.

భూసంస్కరణల్లో విప్లవాత్మక మార్పులు

వ్యవసాయ కార్మికులకు భూమి ఇచ్చే విధానాన్ని అమలు చేశారు. భూమిపై కౌలుదారులకు, రైతులకు హక్కులు కల్పించి, కేరళలో పేదరికాన్ని తగ్గించడంలో కీలకపాత్ర నిర్వహించారు.


ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

నిరక్షరాస్యత నిర్మూలన, ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులకు ఆయన పాలన బలమైన వేదికను అందించింది. కేరళ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన సామాజిక సంక్షేమ రాష్ట్రంగా మార్చడానికి మార్గదర్శిగా నిలిచారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని భారత రాజకీయ వ్యవస్థకు అనువదించిన నాయకుడు. మార్క్సిజం-లెనినిజాన్ని భారత రాజకీయాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎలా అన్వయించాలో చూపిన గొప్ప నాయకుడు. సీపీఐ(ఎం) ఏర్పాటులో కీలకపాత్ర పోషించి, పార్టీకి ఒక స్పష్టమైన ప్రజావిధానం తీసుకొచ్చారు.

అంచంచలమైన నిబద్ధత అపార మేధస్సు

అధికారం కోసమో, వ్యక్తిగత భవిష్యత్తు కోసమో కాకుండా, ప్రజా సేవకు జీవితాన్ని అంకితమిచ్చారు. పదవులపై ఆశ లేకుండా, చివరి వరకు వామపక్ష ఉద్యమానికి అంకితమై పనిచేశారు. ఈఎంఎస్. నంబూద్రిపాద్ భారత వామపక్ష చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన నాయకుల్లో ఒకరు. ఆయన పాలన, భూసంస్కరణలు, ప్రజా సంక్షేమ విధానాలు భారత రాజకీయాల్లోనే ఆదర్శంగా నిలిచాయి. ప్రజాస్వామ్య మార్గంలో కమ్యూనిస్టు పాలనను స్థాపించి, దేశ రాజకీయ దృక్పథాన్ని మార్చిన నాయకుడిగా ఆయన పేరుగాంచారు. ఈయన కేవలం కమ్యూనిస్టు నాయకుడే కాదు, కవి, రచయిత కూడా. ఈయన రచనలకు కాంగ్రెస్ పాలనలోనే కేరళ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

ప్రకాశ్ కరత్ (2005-2015)



ప్రకాశ్ కరత్ ప్రధాన కార్యదర్శిగా కీలకమైన దశలో పార్టీకి నాయకత్వం వహించారు. సైద్ధాంతిక స్పష్టత, నిర్మాణపరమైన నిబద్ధత, రాజకీయ వ్యూహాత్మకత ఆయన ప్రత్యేకతలుగా నిలుస్తాయి. డిల్లీలో కార్మిక ఉద్యమాల కోసం కృషి చేయడంతో పాటు, గ్లోబలైజేషన్ ప్రభావాలను సమీక్షిస్తూ, వామపక్షం తన ప్రత్యేక స్థానాన్ని నిలుపుకునేలా పనిచేశారు. జేఎన్‌యూ నాయకుడైన ప్రకాశ్.. ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు.

సిద్ధాంతపరమైన నిబద్ధత

మార్క్సిజం-లెనినిజాన్ని భారతీయ ప్రక్షిప్త రాజకీయాల కంటే పైకి తీసుకెళ్లాలని విశ్వసించారు. వామపక్ష రాజకీయాలను గాడిలో పెట్టేందుకు, కమ్యూనిస్టు సిద్ధాంతాలను పటిష్ఠంగా అమలు చేయడంపై దృష్టి పెట్టారు. 2005లో సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీ మార్గదర్శకత్వాన్ని స్పష్టంగా రూపొందించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా 2008లో ఇండియా-అమెరికా అణు ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అణు ఒప్పందంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంలో కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. వామపక్ష విధానాలను రాజీపడకుండా కాపాడే ప్రయత్నం చేశారు.

ప్రజా ఉద్యమాల సారధిగా..


కార్మిక, రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురలో వామపక్ష శక్తులను పునరుద్ధరించేందుకు కృషి చేశారు.

నిఖార్సయిన సైద్ధాంతిక నిబద్ధత

మార్క్సిజంపై అనేక రచనలు చేశారు, ముఖ్యంగా భారత రాజకీయాల్లో వామపక్ష పాత్రను వివరించేలా వ్యాసాలు రాశారు. ఆయన రచనలు సిద్ధాంతపరమైన చర్చలకు దోహదపడ్డాయి. ప్రకాశ్ కరత్ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో స్పష్టమైన సిద్ధాంతపరమైన దృక్పథం, ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావం, గ్లోబలైజేషన్ సమయంలో వామపక్ష వ్యూహాన్ని నిలబెట్టే సామర్థ్యం కలిగిన నాయకుడిగా నిలిచారు. ఆయన నాయకత్వంలో సీపీఐ(ఎం) సిద్ధాంతాలను నిబద్ధంగా కొనసాగించేందుకు కృషి చేయడమే కాకుండా, రాజకీయ సమీకరణాల్లో వామపక్ష ప్రాముఖ్యతను నిలుపుకునేలా వ్యవహరించారు.

సీతారాం ఏచూరి (2015- 2024)

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా 2015 నుంచి కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తూ, 2024 సెప్టెంబర్ 12న కన్నుమూసే వరకూ వామపక్ష ఉద్యమాన్ని సమర్థంగా నడిపించిన నాయకుడు సీతారాం ఏచూరి.



ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, వాదనా శైలిలో గట్టి పట్టున్న వ్యక్తి. ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ పోరాటాల్లో కీలకంగా వ్యవహరించారు. వామపక్ష శక్తులను సమన్వయపరచడంలో, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడంలో, దేశ రాజకీయాలలో వామపక్ష పాత్రను ప్రతిష్టాత్మకంగా నిలబెట్టడంలో ఆయన పాత్ర విశేషమైనది.

సైద్ధాంతిక నిపుణుడు

మార్క్సిస్టు సిద్ధాంతాలను ప్రజాస్వామ్య విధానంలో అన్వయించడం ఆయన ప్రత్యేకత. వామపక్ష ఐక్యతను పెంపొందించేందుకు వివిధ ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేశారు. బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కమ్యూనిస్టు ఉద్యమం ఎలా అభివృద్ధి చెందాలి అనే అంశంపై స్పష్టమైన దృక్పథం కలిగిన నేత.

నిబద్ధత కలిగిన నాయకుడు

వ్యక్తిగతంగా ఎటువంటి భోగ భాగ్యాలపై ఆసక్తి లేకుండా, పార్టీ సిద్ధాంతా లకు కట్టుబడి ఉన్న వ్యక్తి. అత్యంత సాధారణ జీవనశైలిని అనుసరించి, ప్రజా సమస్యలే తన ప్రధాన దృష్టి కేంద్రమని నిరూపించుకున్న నేత.

అంతర్జాతీయ వ్యూహాలు, దౌత్య పరమైన అవగాహన

చైనా, రష్యా, లాటిన్ అమెరికా వంటి దేశాల వామపక్ష పార్టీలతో సంబంధాలను బలోపేతం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష రాజకీయాల ప్రస్థానాన్ని అధ్యయనం చేసి, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి అనుసంధానం చేసే ప్రయత్నం చేశారు.

గొప్ప వక్త

సీతారాం ఏచూరి.. సిద్ధాంతపరమైన స్పష్టతతో కూడిన కమ్యూనిస్టు నాయకుడు. గొప్ప ఉపన్యాసకుడు. మంచి రచయిత. అసాధారణమైన వాదనా నైపుణ్యం, వ్యూహాత్మక దృక్పథం, ప్రజాస్వామ్య నిబద్ధత ఆయన నాయకత్వాన్ని ప్రత్యేకంగా నిలిపే అంశాలు. దేశవ్యాప్తంగా లౌకిక శక్తుల ఐక్యతకు ఆయన చేసిన కృషి భారత రాజకీయాల్లో విశేష ప్రాధాన్యత పొందుతోంది.

అసాధారణమైన మేధస్సు, వాదనా నైపుణ్యం

లోక్‌సభ, రాజ్యసభలో ఆయన ప్రసంగాలు విశ్లేషణాత్మకంగా, బలమైన వాదనలతో సాగేవి. బీజేపీ ప్రభుత్వ విధానాలను కూలంకషంగా విమర్శిస్తూ, పార్లమెంటులో ప్రజావాణికి చిరునామాగా నిలిచారు. మీడియా చర్చల్లో, న్యూస్ అనాలిసిస్‌లో రాజకీయ విశ్లేషకునిగా తనదైన ముద్ర వేశారు.

హరికిషన్ సింగ్ సూర్జిత్ (1992-2005)

హరికిషన్ సింగ్ సూర్జిత్ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మాత్రమే కాకుండా, దేశ రాజకీయాల్లో కూడా ప్రముఖంగా నిలిచిన నాయకుడు. ఆయన 1992 నుంచి 2005 వరకు సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శిగా ఉన్న సమయంలో దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రగతిశీల నాయకుల్లో ఒకరుగా నిలిచారు. రాజకీయ చాతుర్యం, వ్యూహాత్మక ఆలోచన, విపక్ష ఐక్యతను బలోపేతం చేయడంలో ఆయన పాత్ర అపూర్వమైనది.



హరికిషన్‌సింగ్ సూర్జిత్ 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఉషార్‌పూర్‌లో గవర్నర్ వస్తున్న సందర్భంగా బ్రిటీష్ పతాకాన్ని తొలగించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని భగత్‌సింగ్ సహచరులు నిర్ణయించారు. విద్యార్థిగా ఉన్న సూర్జిత్ ఆ సంఘటనను చూడటానికి వెళ్లి బ్రిటీష్ పతాకాన్ని తొలగించారు. ఆయనపై సైన్యం కాల్పులకు తెగబడింది. సూర్జిత్‌కు నాలుగేండ్లు జైలు శిక్ష విధించబడింది. జాతీయోద్యమ భావాలతో రగిలిపోయే యువ సూర్జిత్ స్పందన అది. సూర్జిత్ మొత్తం పదేండ్ల పాటు జైలు జీవితం గడిపారు. 1953లో మధురై మహాసభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికయ్యారు.

భారత రాజకీయాల్లో నిర్ణయాత్మక పాత్ర

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులోనూ ఆయన కీలక భూమిక పోషించారు. ప్రతిపక్ష ఐక్యతకు నాయకత్వం భారత రాజకీయాల్లో వామపక్షం కీలకశక్తిగా కొనసాగేందుకు, ఇతర ప్రజాస్వామ్యవాద పార్టీలు, ప్రాంతీయపార్టీలతో సమన్వయానికి ఆయన ఎనలేని కృషి చేశారు. బీజేపీ వ్యతిరేక శక్తులను ఐక్యపరిచేందుకు అవిరామంగా శ్రమించారు.

మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు అంకితమైన నాయకుడు

మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని నమ్మి, నిబద్ధతతో పనిచేశారు. పాలిటిక్స్‌లో ప్రజాస్వామ్య విధానాలను గౌరవిస్తూ, వామపక్ష ఉద్యమాన్ని పార్లమెంటరీ రాజకీయాల్లో బలోపేతం చేసేందుకు కృషి చేశారు. ప్రజా సమస్యలు కేంద్రంగా పార్టీ కార్యకలాపాలు కొనసాగించారు. నీటి సరఫరాకు రూ.142 కోట్ల బెటర్‌మెంట్ లెవీని ప్రభుత్వం విధించగా, దానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమ నిర్మాణానికి నాయకత్వం వహించారు. పంజాబ్‌లో కిసాన్ సభ ఉద్యమాన్ని నిర్మించిన సూర్జిత్ అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా చాలా కాలం పనిచేశారు.

దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర

అధికార పదవుల గురించి ఆలోచించకుండా, కమ్యూనిస్టు సిద్ధాంతానికి సేవ చేస్తూనే జీవితాన్ని గడిపారు. భోగభాగ్యాలకు దూరంగా, సాధారణ జీవితాన్ని అనుసరించేవారు. హరికిషన్ సింగ్ సూర్జీత్ భారత రాజకీయాల్లో వామపక్ష పోరాటాన్ని బలోపేతం చేసిన గొప్ప వ్యూహకర్త. రాజకీయ చాతుర్యం, విపక్ష ఐక్యత, దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన కృషి ఆయనను భారత కమ్యూనిస్టు చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిపింది. ఆయన నాయకత్వం సీపీఐ(ఎం)ను జాతీయ స్థాయిలో రాజకీయంగా ప్రభావశీలమైన శక్తిగా మార్చింది. 2008 ఆగస్టు 1వ తేదీన సూర్జిత్ కన్నుమూశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.